వెన్నెలకంటి సుబ్బారావు

1784 - 1839

జీవయాత్రా చరిత్ర

నూటనలభై సంవత్సరాలపూర్వం ఇంగ్లీషులో వ్రాసుకొన్న

స్వీయ జీవిత వృత్తాంతం

అనువాదం

డా॥ అక్కిరాజు రమాపతిరావు

C1

* తొలికూర్పు ముఖపత్రం ప్రతిరూపం.

THE LIFE
OF
VENNELACUNTY SOOBROW

(NATIVE OF ONGOLE)

TRANSLATOR AND INTERPRETER
OF THE
LATE SUDR COURT,
MADRAS, FROM 1815 to 1829

AS WRITTEN BY HIMSELF

PUBLISHED FOR THE INFORMATION OF
HIS RELATIONS AND FRIENDS
BY HIS SON

VENNELACUNTY VENKATA GOPAL ROW,
DISTRICT MUNSIFF; TRIVELLORE

MADRAS
PRINTED BY C. FOSTER AND Co.,
FOSTER PRESS, 23, RUNDALL'S ROAD, VEPERY
1873

వెన్నెలకంటి సుబ్బారావు
జీవయాత్రా చరిత్ర

The Life of Vennelacunty Soob Row
1873

అనువాదం:

డా॥ అక్కిరాజు రమాపతిరావు

శ్రీ భారతి ప్రచురణలు
సికింద్రాబాదు
1976

ప్రథమ ముద్రణ :
1976 ఏప్రిల్

మూల్యం : రూ. 6-50

ముద్రణ
వేంకట్రామ పేపర్ ప్రోడక్ట్స్ (ప్రై) లి.
నారాయణగుడ, హైదరాబాదు-29

వెన్నెలకంటి సుబ్బారావు 3
1784 - 1839
జీవయాత్రా చరిత్ర

మా పరిచయం.

ఇది మా రెండవ ప్రచురణ.

వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్రా చరిత్ర. పరిశోధన గ్రంథం. ఇంచుమించుగా నూటయాభై సంవత్సరాలనాటి తెలుగుదేశాన్ని, ఈస్టిండియా కంపెనీ నాటి ప్రభుత్వ వ్యవస్థను తెలియజెప్పే గ్రంథం. అన్నిటికన్నా ముఖ్యమైనది తెలుగు మహాశయుడు వ్రాసిన స్వీయ చరిత్రలలో మొట్టమొదటిది ఇది. నూట నలభై సంవత్సరాలక్రితమే దీని నాయన ఇంగ్లీషులో వ్రాశారు. నూట మూడేళ్ల క్రితం మొదటిసారి అచ్చయింది. కాశీ, రామేశ్వరయాత్రల విశేషాలతోబాటు నాటి మేధావులైన, రాజకీయోద్యోగులైన ప్రతిభావంతులైన, తెలుగు పెద్దలను గూర్చి తెలుసుకోవలసిన సంగతులున్నాయి ఈ గ్రంథంలో.

అనువాదకర్త డా॥ అక్కిరాజు రమాపతిరావునుగూర్చి, తెలుగు సాహితీపరులకు కొత్తగా పరిచయం చేయవలసిన పని లేదనుకుంటాము. మేము కోరగానే దయతో తమ అభిప్రాయాలను అందించిన ఆచార్య శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగారికి, విఖ్యాత చరిత్రపరిశోధకులు శ్రీ దిగవల్లి వేంకట శివరావుగారికి, ఆంధ్రత్వము ఆంధ్రభాషా ప్రియత్వము మూర్తీభవించిన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారికీ, వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్రా చరిత్రం తెలుగు పాఠకులు చదివే అవకాశం కలిగించిన శ్రీ ఎన్. ఎస్. కృష్ణమూర్తిగారికీ, విపుల పీఠికతో అనువాదకర్త కృషికి సార్థకత చేకూర్చిన కళా ప్రపూర్ణ, పరిశోధన పరమేశ్వర, సాహిత్యరత్న. డా॥ నిడుదవోలు వేంకటరావు గారికి మా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు.

మా ఈ మలి ప్రచురణనుకూడా తెలుగు దేశం ఆదరిస్తుందని విశ్వసిస్తున్నాము.

ఇది శ్రీ భారతి ప్రచురణ.

మీ

కె. జి. కృష్ణమూర్తి

కృతజ్ఞతలు

ధారావాహికంగా ప్రచురించిన

జమీన్‌రైతు వారపత్రిక సంపాదకవర్గానికి

మిత్రులు

డా. సి. వి. రామచంద్రరావు

డా. కాళిదాసు పురుషోత్తం

శ్రీ పి. గోపాలకృష్ణ

గార్లకు

అభిప్రాయాలు అనుగ్రహించిన పెద్దలు

ఆచార్య మామిడిపూడి వేంకట రంగయ్యగారికి

శ్రీ దిగవల్లి వేంకట శివరావుగారికి

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారికి

శ్రీ ఎన్. ఎస్. కృష్ణమూర్తిగారికి

పీఠికాకర్త

ఆచార్య, కళాప్రపూర్ణ, విద్యారత్న

నిడుదవోలు వేంకటరావుగారికి.

పెద్దల అభిప్రాయాలు

ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్యగారిట్లా వ్రాస్తున్నారు.

శ్రీ అక్కిరాజు రమాపతిరావుగారు తెనిగించిన వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్రాచరిత్ర కందుకూరి వీరేశలింగం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం మొదలైన ప్రఖ్యాతుల స్వీయ చరిత్రలవంటిది కాకపోయినా సాంఘిక చరితను రచించదలచినవారికి ఉపయుక్తమైన గ్రంథం అని చెప్పవచ్చు - ఇంగ్లీషు విద్య, పాశ్చాత్య సంస్కృతి, మొదలైనవాటియొక్క ప్రభావం ఎక్కువగా లేనిరోజులలో హిందూ సమాజం ఏ విధంగా ఆచారబద్ధంగా ఉండినదీ ఈ గ్రంథం స్పష్టపరుస్తూఉంది. సుబ్బారావు ఆయన తండ్రికి పన్నెండో సంతానం. కుటుంబాలు పరిమితంగా ఉండటం వాంఛనీయమనే ప్రభావం ఆనాడు లేదు. కుటుంబాలు సమిష్టిగా బంధువులతోకూడి వుండేవి. సుబ్బారావు నాలుగు పర్యాయాలు వివాహం చేసుకొన్నాడు. ఆడపిల్లలకు 10, 11 సంవత్సరాల వయస్సులోనే వివాహం జరగడంచేత భార్యాభర్తలమధ్య వయస్సు ఎంతో అంతరం ఉండేది. భార్యకు యుక్తవయస్సు వచ్చినవెంటనే భర్తతో కాపురం చేసేది. సుబ్బారావు ఎక్కువగా చదివినవాడు కాకపోయినా తెల్లదొరల అభిమానాన్ని సంపాదించడంలో నేర్పుగలవాడు కావడంచేత చిన్న ఉద్యోగంలోచేరి ఉన్నత న్యాయస్థానంలో ట్రాన్స్‌లేటరు పదవిని అనుభవించి పెన్షన్ పుచ్చుకోగలిగాడు. బంధువు లనేకులకు ఉద్యోగాలను ఇప్పించగలిగాడు. ఈ స్వీయ చరిత్ర మూలంగా ఆనాటి వీధిబడులలోని విద్యావిధానం, ప్రారంభదశలో ఇంగ్లీషు విద్యావిధానం ఏలాగు ఉండేది మనకు తెలుస్తుంది. బంధువులు ఇంటికి వచ్చినప్పుడు విందులేకాక బోగంమేళాలుకూడా ఏర్పాటుచేయడం పరిపాటి. ఈ లాటి విశేషాలు అనేకం ఈ గ్రంథంమూలంగా మనం తెలుసుకోవచ్చు. ఎంతో శ్రమపడి ఈ గ్రంథాన్ని సేకరించి ఇంగ్లీషునుండి తెనుగుచేసిన శ్రీ రమాపతి రావుగారు మన కృతజ్ఞతకు పాత్రులు.

సికింద్రాబాదు
7-4-76

మామిడిపూడి వేంకట రంగయ్య

విఖ్యాత చరిత్ర పరిశోధకులు, సాహిత్యవేత్తలు

శ్రీ దిగవల్లి వెంకట శివరావుగారి అభిప్రాయం

శ్రీ వెన్నెలకంటి సుబ్బారావు పంతులుగారు (1784 - 1859) మద్రాసు రాజధానినగరంలో గొప్ప ఉద్యోగంచేస్తూ ఆంధ్ర విజ్ఞాన వికాసానికి కృషి చేసిన మహాపురుషులు. ఇంగ్లీషు విద్య, శాస్త్రవిజ్ఞానము దేశీయులకు బోధించ డము ఆవశ్యకమని రాజా రామమోహన్‌రాయలు ఆనాటి గవర్నరు జనరలును కోరుతూ 1823 సం॥లో వ్రాసిన గొప్ప లేఖకు మూడేళ్ళకు ముందుగానే అదే విషయమై మద్రాసు ప్రభుత్వాధికారులను అభ్యర్థిస్తూ సుబ్బారావుగారు 22-11-1820 తేదీగల చరిత్రాత్మకమైన పెద్దలేఖ వ్రాశారు. ఆంధ్ర భాషను అభ్యసించేవారికి ఉపయోగకరమైన గ్రంథాలను రచించి తెలుగు వచన రచనకు రాచబాట నేర్పరిచారు.

సుబ్బారావుగారు ఇంగ్లీషులో రచించిన స్వీయ చరిత్రలో ఆనాటి దేశ చరిత్రకు సంబంధించిన అనేక అపూర్వవిషయాలున్నవి. ఈ అపూర్వ గ్రంథ మును తెలుగులోనికి అనువదించి డాక్టరు రమాపతిరావుగారు చరిత్ర పరిశోధకు లకు మహోపకారం చేశారు.

ఈ పుస్తకములోని కొన్నిమాటలకు అర్థవివరణమువ్రాస్తే బాగావుండేది. ఉదాహరణమునకు ఆ కాలంలో జిల్లా కోర్టులోను, ప్రొవిన్షియల్ కోర్టులలోను "రిజిష్టర్" అనే ఆంగ్లేయోద్యోగి ఉండేవాడు. 1802 సం॥ నాటి 'రెగ్యులేషన్'లో అతని 'డ్యూటీస్' వివరింపబడినవి. 1843 లో ప్రొవిన్షియల్ కోర్టులు రద్దు చేయబడినవి. జిల్లా కోర్టుకే హెచ్చు అధికారాలు ఇచ్చారు. అప్పుడా ఉద్యోగిని నియమించడం మానివేశారు. కాని ఈ పుస్తకంలో 'రిజిస్ట్రార్' అనే పదం వాడారు. నాలుగు ప్రొవిన్షియల్ కోర్టులు బందరు, చిత్తూరు, తిరుచినాపల్లి, తలచేరీలలో ఉండేవి.

విజయవాడ
నల సంవత్సరాది
31-3-1976

దిగవల్లి వేంకట శివరావు

7

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య
అధికారభాషాసంఘం అధ్యక్షులు

8-4-1976

ఆధునిక యుగంలో స్వీయ చరిత్ర వ్రాసుకోవడం ఒకవిధంగా చరిత్రకు ఉపయోగపడగలదనీ, లేక తన చరిత్ర మిగిలివుంటుందనీ లేక సమకాలీన సంఘటనలు ఉదహరింపబడి వుంటవనీ, లేక తన అనుభవాలు ఎపుడన్నా చదువుకుంటే సర్దాగా కన్పిస్తవనీ ఉద్దేశించి జరుగుతున్నది.

అయితే భారతదేశ చరిత్ర రచనలో వివిధ దేశీయులు పాహియాన్, హు ఎసంగ్, మార్కొపోలో, అబూబేకర్ వారు వ్రాసుకున్న స్వీయ చరిత్రలు లేక దినచర్యలు ఉదాహృతా లవడమే కాకుండా ఆధారాలుకూడా అయినవి. అయినా భారతీయులు స్వీయ చరిత్ర వ్రాసుకొన్నవి వ్రేళ్ళమీద లెక్కించ దగిననన్నికన్నా లేవేమో.

19 వ శతాబ్దిలో మొదటి పాదంలోకన్నా ద్వితీయపాదంలో తరుచుగా స్వీయచరిత్రలు రచింపబడినవి. అటుతర్వాత లెక్కకు మిక్కిలిగనే వస్తున్నవి. తెలుగులోకూడా వస్తూనే వున్నవి. ఇంతవరకు శ్రీ వీరేశలింగంగారు వ్రాసిన స్వీయ చరిత్రే ప్రథమమైనదని ఆంధ్రులు తరుచు భావిస్తున్నారు.

అయితే శ్రీ యేనుగుల వీరాస్వామి రచన కొంతకొంత స్వీయరచన ఫక్కీలో వున్నదని భావించవచ్చు. కాని ఏనుగుల వీరాస్వామయ్యకన్నా ముందే శ్రీ వెన్నెలకంటి సుబ్బారావు రచించిన ఈ ఆత్మ చరిత్ర ఆంధ్ర సాహిత్యంలో స్వీయ చరిత్ర పరంపరలో అతి ప్రాచీనమని రుజువుచేయటంలో రమాపతిరావు చాలా కృషిచేసి దీనిని బయటకు తేగలిగారు. శ్రీ వెన్నెలకంటి సుబ్బాలావు 1784 నవంబరు 28 న జననమందారు.

ఇంత చిన్నచిన్న వివరాలతో, తేదీలతో, తాను తిరిగిన గ్రామగ్రామపు వివరాలతో ఆత్మ చరిత్ర వ్రాయడం, ఆ రోజులలోనే ఇంత జాగ్రత్తగా దినచర్యను భద్రపరచుకోవలెననే శ్రీ సుబ్బారావు మానసికస్థితి నిజంగా ఆదర్శనీయము.

ప్రజల మాతృభాష అధికార లేక పాలనాభాషగా అమలు జరుపుటకు అన్నిరకాలైన యాంత్రిక పరికరాలు ఆధునికంగా అభివృద్ధిచెంది అందు బాటులో వున్న ఈ రోజులలో ఎవరికివారు పట్టిపట్టనట్లు ప్రవర్తిస్తున్న మనో భావం తలచుకొని - ఈ ఆత్మ చరిత్ర రచించిన సుబ్బారావుగారి ఆనాటి పరి స్థితులలో - తెలుగులోకూడా పెద్ద చదువులకు అవకాశాలులేని ఆ రోజులలో తెలుగునుండి ఇంగ్లీషుకి పోవడం మాత్రమేకాక, కన్నడం, తమిళం, మళయాళం భాషలు నేర్చుకొని వాటినుండి ఇంగ్లీషులోకి - ఇంగ్లీషునుండి మరల ఆ భాషలోకి సాహిత్యభాషగానేకాదు - పాలనాభాషగా, న్యాయస్థానాల భాషగా- ఆదీ విదేశీయుల సామాజిక-సాంసారిక విధానాలపై ఆధారపడిన వివిధ దేశీయుల భాషా సాంప్రదాయాలను వ్యాకరణ పద్ధతులను, పారిభాషిక సమానార్థాలను- సంతృప్తి కలిగించి తన ప్రతిభను చాటిన శ్రీ సుబ్బారావు ప్రజ్ఞ, శ్రమ, పట్టు దల నిజంగా తలచుకొంటె చేతులెత్తి నమస్కరించవలె ననిపిస్తుంది.

శ్రీ వీరేశలింగం పంతులు, మహాత్మాగాంధీ, పండిత జవహర్‌లాల్ నెహ్రూ, విన్‌స్టన్ చర్చిలు వంటివారు వ్రాసిన ఆత్మచరిత్రలకు దీనికి ఎంత తేడా వుందంటే, నిజంగా వైవారి ఆత్మచరిత్రలలో ఒకదానికి మరొకదానికి వున్నంత తేడా వుందనక తప్పదు. ఆ వొక్కొక్కటి వారివారి వ్యక్తిత్వాలను బట్టి, సమకాలీన పరిస్థితులు వానిని ప్రభావితం చేసినవాటినిబట్టి, తమ ఆలోచన లతో, ఆచరణలలో ఆనాటి సమకాలీన పరిస్థితులను ప్రభావితం చేసినవాటినిబట్టి వారి రచనలు వున్నవి. సహజంగా వుంటవికూడా. అట్లే సుబ్బారావు రచన కూడా తన ఉద్యోగం, తన కుటుంబం, తన బంధువులు, తన మనోవిశ్వాసాలు వీటి అన్నింటి అవసరాలను తనకున్నపరిధిలో తన వ్యక్తిత్వం, వ్యక్తికరించు కుంటూ తన వ్యక్తిత్వం నిలుపుకుంటూ అవకాశాన్నిబట్టి పెంచుకుంటూ చేసిన కృషి స్వయంగా వ్రాసుకోవటం- ఆ ప్రయత్నం చేద్దామని ఆ రోజుల్లో తలంచు కోవడం అనే ఆలోచనే మనలను చకితులను చేస్తుంది.

ఉద్యోగ నిర్వహణలో, సాధనలో, మత విశ్వాసాలమ సంతృప్తి పరుచుకోవడంలో, కుటుంబ సమస్యలు పరిష్కరించుకోవడంలో రైలు, బస్సులు విమానాల సంగతి అసలే ఆలోచించ పనిలేదుకదా - లేని ఆ రోజులలో ఆయన చేసిన ప్రయాణాలు, సాధనలు ఏమైనా, వెంటవెంటనే జరుగుకుంటూ పోవడం ఆ మనిషికున్న చలనశక్తికి నిదర్శనం.

ఆనాటి విద్యావిధానాన్నిగురించి వ్రాసిన లేఖ ఇప్పటికి అప్పటికి ఉన్న విద్యా అవసరాలను, అవకాశాలను పోల్చుకొని చూచుకోవడానికేకాక, ఆనాటి పరిమితులనుండి ఈనాటి సంస్థలవరకు రచయితల విషయంలో పాఠ్య పుస్తకాలలో, రచనల విషయంలో పురోగమించిన ఘట్టాలుకూడా వున్నవని అనిపిస్తుంది. ఈనాటి మన ఆలోచనలకు సమాధానాలుకూడా వున్నవా అనిపిస్తున్నది. ఆనాటి చదువులు అచ్చంగా బ్రిటిష ప్రభుత్వయంత్రాంగం సుస్థిరంచెయ్యటానికి ఉద్దేశింపబడినవి. ఈనాటి విద్యావిధానంలోకూడా ఆఫీసులలో ఉద్యోగస్థులుగా తయారుచేయటంకన్నా పురోగమించినవని చెప్పగలిగినస్థితిలో లేము అనే అనిపిస్తుందికదా. బ్రిటిష పాలనలో ప్రారంభదశలో వారి అవసరాలకు-వారి విదేశీ సామ్రాజ్య నిర్మాణానికి వాడుకున్న సాధనాలు, సంస్థలు పదజాలం, నామరూపాలు - ఆ పాలన పోయినా మారలేదని ఈ పుస్తకం చదువుతుంటే అనిపిస్తున్నది. ఈనాటి పరిపాలనకు పునాదులు ఆనాటివే అవడంవల్ల ఎంతగా పైపైన సంస్కరణలుచేసినా, పూతలు పూయడంగానే కనుపించుతున్నవికాని నూతన సమాజ నిర్మాణానికి కావలసిన మౌలికమైన మార్పులు రాకపోవడం స్పష్టంగా కనుపిస్తున్నది.

ఈ ఆత్మచరిత్రలో అప్పుడపుడే భారతదేశం పాలన ఆక్రమించి పాలనలో నిలవత్రొక్కుకోవటానికి పాలకులు చేసిన ప్రయత్నాలు భాషలో, పాలనలో, ఉద్యోగాల్లో, ఆర్థిక లావాదేవీలలో అద్దంగా ప్రతిఫలిస్తున్నాయి. వీటిని మూల మట్టంగా మార్చవలసిన అవసరం వుష్కలంగా బోధపరుస్తున్నది.

ఆత్మ చరిత్ర రచనకు మొదటి ఒరవడిపెట్టి, సాహిత్య ప్రక్రియలో నూటయాభై సంవత్సరాలక్రితం జరిగిన ప్రయత్నాన్ని ఆంధ్రుల దృష్టికి తెచ్చిన శ్రీ అక్కిరాజు రమాపతిరావుకు అభినందనలు.

స్వీయ చరిత్ర: ఆత్మ కథ

రచయిత తన చరిత్రనే, వ్రాయునది స్వీయ చరిత్ర. తన వ్యక్తిగత జీవితాంశములనేగాక, తన సమకాలిక ప్రపంచస్థితులను ఇతర వ్యక్తులనుగూర్చి రచన యుండును. ఇదియు ఒక సాహిత్య ప్రక్రియయే. కేవలము ఆత్మస్థమై సాగు సాహిత్యలాహరి, లేక లహరుల పరంపర. తన గత జీవితమునుగూర్చి తన ఎరుకలో జరిగిన ఉదంతములనుగూర్చి, ముఖ్యవిషయముల ఏర్చి, కూర్చి, స్వల్పమైనవి, అనౌచిత్యమైనవి వదలి ఒక పథకము ప్రకారము నిర్ణయించుకొని వ్రాసిన రచన. ఈ వ్రాత ఆత్మాయత్తముగనే సాగుచుండును. రచన క్రమ బద్ధమై, అందు తెలువు సంఘటనలు పొంకముగ కదించి, కుదుర్చియుండును.

రచన ఎవ్వరినిగూర్చి కేంద్రీకరింపబడి వ్రాయబడెనో, వారి అంతఃకరణ పరీక్ష జరిగి, బాహ్యమైన విషయములు, పరిచయమేర్పడిన వ్యక్తులు, వారి సంబంధముతో, తాను ఎట్లు మారినది, తానెట్లు ప్రభావితుడైనది, విపులముగ వర్ణింపబడును. ఇట్టి రచనలకు ఉదాహరణముగ, ఆంగ్ల సాహిత్యమునుండి కొన్నిమాత్రమే పేర్కొనబడినవి.

(i) ఫ్రెంచి వ్యాసరచనా పితామహుడైన, మాంటెగు వ్రాసిన వ్యాస ములు, షేక్స్పియర్ నాటక ప్రయోగములగూర్చి తెలిసికొనుటకు సాధన సంప త్తిగా ఆకరమైన ముఖ్య గ్రంథమగు పెపీస్ డైరీ; కాలరిడ్జి వ్రాసిన బైయా గ్రఫియా లిటరియా; వర్డ్స్వర్తు రచించిన ప్రిలూడ్; ఇవన్నియు స్వీయ చరిత్ర నిర్వచనమునొక్క విస్తృతములు. అతివ్యాప్తి రూపములు.

స్వీయ చరిత్రవంటిదే, మెమోయిర్లు-జ్ఞాపక శకలములు. వీటిని స్వీయ చరిత్రనుండి విడదీయుటకును వీలులేదు. వారివారి కాలమున చరిత్రాత్మకముగా, ప్రతిష్ఠ గణించి. యశస్సునార్జించి, దేశ చరిత్రతో సంబంధము కలుగచేసి కొన్నవారు, వారి జ్ఞాపక శకలములను రచింతురు. ఇవికూడ 'స్వీయ చరిత్ర' వర్గమునందే చేర్పతగినవి. ఇట్టివే డైరీలు. దైనందిక క్రమముగా ఒకరు దిన చర్యలు వ్రాసియుంచుట ఈ రచనలును స్వీయచరిత్ర లనతగినవే.

ఆంగ్లమున ప్రథమముగా స్వీయ చరిత్ర వ్రాసినది 15వ శతాబ్దిలో. ఆ రచనపేరు Book of Margery Kempo. కాని కాలగర్భమున అస్తంగతమైపోగా నుండి 1934 లో వెలికివచ్చినది. నిర్వేదము, ఆర్తి, ఆధ్యాత్మిక చింతనతో-పరమేశ్వరునిపై భక్తితో జీవితము గడిపిన Lynn గ్రామవాసి, ఒక స్త్రీ రత్నము వ్రాసిన జీవితాంశములతోనిండిన గ్రంథము. ఆమె జననం 1375. ఆమెచేసిన పుణ్య తీర్థయాత్రలు, ఆమె వర్ణించిన పెద్ద ఉత్సవములు, చదివిన, ఆమె అమూర్తిత్వ గుణగణములు వివరముగా తెలియగలవు.

ఆమె ఆసువుగా చెప్పినవి, ఇద్దరు, ఆమె పనువున వ్రాసిరి. ఆ వ్రాత ప్రతి లభ్యమైన విలియం బట్లర్-బౌడస్ 1936 లో, ఆధునిక భాషాశైలిలో ప్రచురించెను.

మూలమును యథాతథముగా 1940 లో S. B. మీచ్ (Meech) ప్రచురించెను.

1791 అమెరికాదేశపు బెంజిమెన్ ఫ్రాక్లిన్ స్వీయ చరిత్ర ప్రఖ్యాతమైనది.

1798 లో ఎడ్వర్డు గిబ్బన్ - ఇతడు రోమ్ సామ్రాజ్య వైభవమును, పతనమును గూర్చి వ్రాసిన దిట్టయగు చరిత్రకారుడు. 1781-1788 లో రూజో (Jean Jaeques Roussean) రాజకీయ సిద్ధాంతవేత్త స్వీయ చరిత్రను వ్రాసెను. ఆంగ్లమున స్వీయ చరిత్రకు పర్యాయపదము Autobiograhy. ఈ పేరు 1809 లో ప్రాముఖ్యమునకు వచ్చినది. ఈ పదమును ప్రథమముగా చెప్పినది Robert Southey. Quarterly review లో 1809 న తన వ్యాసమున సధే వ్రాసెను. ఆ సంవత్సరమే అదే పత్రికలో (మే నెలలో) Issac. D.Isareli ఈ పదమును ప్రయోగించెను. ఇట్టిరచనలు మహామారిగాపుట్టి, అతివిస్తారముగా వ్యాపించున్నవనియు వ్రాసెను. ప్రజల మన్ననలు స్వీయ చరిత్రలు పొందెను.

19వ శతాద్ది జీవితరంగములలో, శ్మశ్రువర్ధకునినుండి మల్లి, ముష్టి యుద్ధములు చేయువారి వరకు, సంఘమున కొద్దిపాటి ప్రాముఖ్యము చెందినవారు స్వీయచరిత్రలు వ్రాసిరి.

II

భారతదేశమున సంప్రదాయముగ, అందరకు తెలిసినది ఒక జీవిత కథయేకాదు. గౌతమ బుద్ధుడు తన పూర్వపు జీవితములందలి విషయము లన్నింటిని శిష్యులకు చెప్పెను. ఇవే నేడు లభ్యమైన జాతనకథలు. ఇవన్నియు చేరిన ఒక జీవి, తన కర్మానుసారముగ, ఉపాధులనేకముల ధరించును. కాని ఒక ఉపాధిలో నున్నపుడు తన పూర్వజన్మల గూర్చిన స్మృతి కొంచమైనను ఉండదు. ఇట్టి మరపు సాధారణమైనది. యోగులు తమ సాధనను చిత్తవృత్తి నిరోధముతో ప్రారంభించి, అధ్యాత్మికసాధనలతో ఉత్తమస్థితులను చెందుదురు. ఆ సోపానమార్గ అధిరోహణ కాలమున, తన పూర్వజన్మలన్నీ జ్ఞాపకమునకు వచ్చును. ఇవన్నియు చేర్చిన 'నిజమైన ఆత్మకథ' యగును. ఒకే జన్మము గూర్చిన విషయముల ఆ జీవి రచించిన అది 'స్వీయ చరిత్ర' యగును. ఇట్టి భేదమును సాగించువారు వైదికమతస్థులొకరే. మన పురాణములందు ఒక జీవి, పూర్వ జన్మములగూర్చి చెప్పుట కలదు. ఇట్టి ఆత్మకథా కథనము రామాయణమున, భారతమున కలవు.

చరిత్రకాల ప్రారంభమున అశోకుడు తన భావములను, తాను సంకల్పించి, నిర్వహించదలచిన పథకములను, శిలాక్షరములుగా చేసి, దేశ దేశము లందు ఆ శాసనముల నాటించెను. "స్వీయ చరిత్ర" ప్రకాశము చేయుటయందు ఇది ఒక మార్గముగా మౌర్య చక్రవర్తి తలంచెను.

సముద్రగుప్తుడు తన జీవితాంశములను నాణెములపై ముద్రింపించెను. తాను పులుల ధిక్కరించగల వ్యాఘ్రబలుడనని, కళాకారుడనని, అందును వీణా వాద్యమును వాయించగల నేర్పు కలదు, సైనిక వాహినుల నడిపించగలనను సంగతి తెల్పుటకు ఒక చిహ్నమును; తాను దైవభక్తుడుగా, విష్ణువునకు పూజ చేయుచున్నట్లు నాణెములపై తన వివిధ రూపములను ముద్రింపించెను. ఇదియు స్వీయ చరిత్రయే.

ఇట్లు స్వీయ చరిత్రను వ్రాయించి. లోకమునకు తెలియజేసెను. వీటన్నింటిని చూచిన ఆ మహా రాజాధిరాజు అమూర్తిత్వము లోకమునకు తెలిసినది.

III

మన దేశమున ఆంగ్లమున మహాత్మాగాంధి, పండిట్ నెహ్రూలు స్వీయ చరిత్రలు వ్రాసిరి. అవన్నియు తెలుగున వెల్వడినవి.

ఈ గ్రంథము ఆంగ్లమున వ్రాసిన వెన్నెలకంటి సుబ్బారావు స్వీయ చరిత్రకు తెనుగుసేత. ఇది భారతదేశమున ఆంధ్రుడు ఆంగ్లమున వ్రాసిన ప్రథమగ్రంథ మనవచ్చును. డా॥ రమాపతిరావుగారు సాహిత్య పరిశోధన యందు దిట్ట. వారు ఆంగ్లమునగల మూలగ్రంథమును చేపట్టి, తెనుగువారికి 18 వ శతాబ్దపు దక్షిణ భారతదేశ చరిత్రాంశములను పరిచయముచేయు సాధనముగా దీనిని తెనుగున రచించిరి. ఇట్టి కావ్యము లింకను గలవు. వీటన్నింటిని తెనుగు ప్రజల కందించుట కర్తవ్యము. డా॥ రమాపతిరావుగారు ఇట్టి సాహిత్య సేవ చేయుదురని ఆశించుచున్నాను. వీరు సంకల్పసిద్ధులు.

ఈ గ్రంథమును, తెలుగు వారాదరించగలరను నమ్మకమున్నది.

భాగ్యనగరము
8—4—1976

నే. శ్రీ. కృష్ణమూర్తి

పీఠిక

భారతదేశమున ఇంగ్లీషువారి పరిపాలనకాలము రెండు విధములుగా విభజింపవచ్చును.

(1) కుంపిణీ కాలము (Company Rule). 1757-1857,

(2) ఆంగ్లరాజుల కాలము (Under the Crown) 1857-1947.

దక్షిణభారతమున కుంపిణీవారి కాలములో రాజభాషయగు నాంగ్లభాష నభ్యసించి ఆంగ్ల రాజకార్య నిర్వాహక చతురులై, ఉన్నత పదవులకు నియుక్తులై ఆంగ్లపాలకుల గౌరవాదరములకు పాత్రులై యశస్సు నార్జించినవారిలో-ఆంధ్రు లగ్రగణ్యులు.

భారతవర్షమున ఆంగ్లపాలన స్థిరపడిన వెనుక, ప్రథమముగా వంగదేశమున (బెంగాలు) రాజారామమోహనరాయి- ఆంగ్లభాషా ప్రవీణుడై ఇంగ్లీషువారి కనుకూలముగ పాలితులైన భారతీయులకు, వారితో సామరస్యము గల్పించుటకు బ్రహ్మసమాజ మతము ప్రతిష్ఠించి, పాశ్చాత్య విద్యా వ్యాసంగము ప్రోత్సహించి ఆంగ్లేయుల ఆదరాభిమానములు ననుభవించి, నవ్యభారత పునరుజ్జీవమునకు నాయకు డయ్యెను. కాని, రామమోహనుని సాంఘిక సంస్కరణ, బ్రహ్మసమాజ పథకము, ప్రాచీన భారతీయ సంప్రదాయములను, విస్మృతముచేసి, పాశ్చాత్య విద్యాసంస్కారప్రభావము బలపరచినది. భారతీయు లాంగ్లమానసపుత్రులైనారు.

తెలుగుదేశము

తెలుగుదేశము చేసికొన్న యదృష్టముచేత ఆంగ్లభాష నభ్యసించి ఆంగ్లేయుల గౌరవమును గడించి, వారి కార్యములను తూచా తప్పక నిర్వహించుచు మన ప్రాచీన భారతీయ వైదికమత సంప్రదాయములను చెక్కుచెదరక నిల్పుచు

ఇటు రాజకీయముగా అటు సాంఘికముగా తమ జీవితములను ధన్యముచేసికొన్న ఆంధ్ర మహాపురుషులు అమాత్య శాఖీయులు ఆరుగురు.

1. అవధానము పాపయ్యమంత్రి, (లంగరు పాపయ్య) కావలి సోదరులు.
2. వెంకట లక్ష్మయ్య
3. వెంకట రామస్వామి
4. వెంకట బొమ్మయ్య
5. ఏనుగుల వీరాస్వామయ్య
6. వెన్నెలకంటి సుబ్బారావు

ఈ ఆరుగురి యుదంతములు ఆంధ్రదేశ ఆధునికయుగచరిత్ర కమూల్య నిధులు. కాని వీరి సమగ్రచరిత్రములు రచియించుట కింతవరకెవ్వరును పూనుకొనలేదు; వారి చరిత్రలమాట యటుండనిచ్చి, కనీసపక్షము వారినిగూర్చి ప్రకటింపబడిన గ్రంధములనైనను మనము చదివి వారి ప్రత్యేక వ్యక్తిత్వము లను గ్రహించుటకు ప్రయత్నింపలేదు. ప్రాయికముగా పై ఆరుగురిని గూర్చి ఈనాటి వారికి తెలియదని చెప్పుటలో అతిశయోక్తిలేదు. స్వాతంత్ర్యానంతరము మనము తప్పక తెలుసుకోదగినవేగాక, మనము గర్వింపదగిన చరిత్రలు వీరివి.

ఇట్టి యున్నతాశయముతో నేడు వెలువడినది– వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్రాచరిత్ర.

డాక్టరు అక్కిరాజు రమాపతిరావుగారు రచియించిన ఈ గ్రంథమును గూర్చి తెలుసుకొనుటకు ముందు తెలుగుదేశ చారిత్రక సంస్కృతులలో పై యారుగురికిగల ప్రత్యేక విశిష్టతల నెరుగుట యావశ్యకము.

1. బహుభాషా పరిజ్ఞానము

పైవారిలో ముగ్గురు ద్విభాషులైనను చతుర్భాషులు. అవధానము పాపయ్య మంత్రికి అంగ్లభాష, ఫ్రెంచిభాష. పారసీభాష, తమిళభాష, నాలుగుభాషలేకాక సంస్కృతముకూడ వచ్చును. వెన్నెలకంటి సుబ్బారావుగారు, ఇంగ్లీషు, తెలుగు భాషలుకాక కన్నడ,తమిళ,మహారాష్ట్రిభాషలు చక్కగానేర్చినవారు. కన్నడభాష

ద్విభాషలు. ఏనుగులవీరాస్వామయ్యగారికి తమిళ,మహారాష్ట్రిభాషలలో పరిచయ మున్నట్లు తెలియుచున్నది. కావలి బొర్రయ్యకు దేశభాషాలిపి పరిజ్ఞానము చాలా గలదు. యావద్భారతవర్షమున మొదట హళగన్న ధశాసనలిపిని చదివినదాతడే.

2. హైందవులు - ఆంగ్లరచన

హైందవుల ఆంగ్లరచన- (Indian writing in English) అన్న గ్రంథమున, తత్కర్తలైన డాక్టరు కె. ఆర్. శ్రీనివాసఅయ్యంగారు యావద్భారత వర్షమున మొదటి ఆంగ్లభాషా ప్రావీణ్యము సంపాదించి ఆంగ్లభాషలో మొదట రచన చేసినవాడు 'రాజారామమోహనరాయి' అనియు, ఆతనిగ్రంథము 1820 లో ప్రకటిత మైనదని తెలిపిరి.[1]

నేనావెనుక యీవిషయమై పరిశ్రమచేసి యావద్భారతవర్షమున ఆంగ్ల రచన చేసినవారిలో ప్రథములు కావలి సోదరులనియు, అందును మూడవ వాడగు కావలి వెంకటబొర్రయ్య ప్రథముడనియు, ఈతని ఆంగ్లవ్యాసము (On the manners & Customs of Jains) రామమోహనరాయి గ్రంథమునకు పదహారేండ్లు ముందుగా క్రీ. శ. 1803 లో రచితమైనదని అది క్రీ. శ. 1803 లో బొర్రయ్య చనిపోయిన వెనుక క్రీ. శ. 1810 లో రాయల్ ఏషియాటిక్ సొసయిటీవారి 10వ సంపుటములో ప్రకటితమైనదని, సప్రమాణముగా నిరూపించితిని. కీ. శే. లక్ష్మణరాయ మహోదయుల పిమ్మట కావలి సోదరులను గూర్చి విశేషముగా పరిశోధన చేసినవాడను నేనే.[2]

రామమోహనరాయి తరువాత భారతదేశమున ఆంగ్లరచన చేసినవాడు మన వెన్నెలకంటి సుబ్బారావే. కాబట్టి భారతదేశమున ఆంగ్లరచయితలలో

---

1. Ramamohanroy should be named as the first of the Indian masters of English Prose: Indian writing in English P. 32.

2. Poineers of English writing in India: The Cavally Telugu Family. Annals of Oriental Research- University of Madras.

ప్రథమస్థానము- కావలి బోర్రయ్య, ద్వితీయస్థానము- రాజారామమోహనరాయి, తృతీయస్థానము- వెన్నెలకంటి సుబ్బారావు ఆక్రమింతురు.[1]

3. దినచర్య రచన (Journal)

దక్షిణ భారతమున దినచర్య వ్రాసినవారిలో ప్రథముడు డూప్లేవద్ద వ్రాసెంచివారి దుభాషియైన ఆనందరంగపిళ్ళ. అయితే ఆ దినచర్య గ్రంథము తమిళభాషలో నున్నది.[2]

కావున ఆంగ్లభాషలో దినచర్య గ్రంథములను వ్రాసినకీర్తి ఆంధ్రులదే. వారిలో తొలివాడు

1. కావలి వెంకటబోర్రయ్య (1776-1803)

ఇంగ్లీషు భాషలో బోర్రయ్య దినచర్యను రచించినట్లు, ఆతని సోదరుడు వెంకట రామస్వామి ఇట్లు చెప్పినాడు.

"Boriah was deputed by his master to collect information useful for the office... The service was very ardous for Boraiah had to traverse dreary woods, and lofty mountains about Srisaila while on his survey Colnel Mackenzie was appointed Engineer to the expedition against Manilla, and Boriah was obliged to return home; while on the way from Hyderabad to Madras, he kept a correct journal and wrote some poems in Sanskrit & Telugu.

In the year 1798 Boriah accompanied his master in the Campaign against Tippu Sultan and kept a poetical

---

1. ఈవిషయ మింతవరకు ఆంగ్లభాషలో వ్యక్తముకాలేదు. ఇకముందు తెలుపదగినది.

2. The Dairy of Ananda Ranga Pillai 9 vols.

journal of the route till he reached Gadwa (Gadwal) a petty zamindary of the Nizam's Dominions.[1]

రెండవది పద్యమయ మగుటచే తెలుగున నున్నను మొదటిది- ఆంగ్ల భాషలోనే యుండుట నిశ్చితము. ఇవి లభ్యము కాలేదు.[2]

2. ఏనుగుల వీరాస్వామయ్య (1780-1836)

వీరాస్వామయ్యగారు కాశీయాత్ర చరిత్ర-[3] అనుపేర దినచర్యగ్రంథము రచించిరి. (18-5-1830 to 3-9-1831). ఇది తెలుగు భాషలోనే వ్రాయబడినను; అది తొలుత తమిళ, మహారాష్ట్ర భాషల లోనికి అనువదింప బడినది.

ఇంగ్లీషు భాషలో ఆంధ్రప్రదేశ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమువారు దీనిని ప్రకటించిరి. దాని ముఖ్యరచయితలు శ్రీ పి. సీతాపతి I. A. S. గారు.

(1) సీతాపతిగారీగ్రథంము నాంగ్లములోని కనువదించియు గ్రంథకర్త పేరీక్రింది విధముగా ముద్రించుట ఎంతమాత్రమును సరికాదు. Enugula Veeraswamy's Journal (Kasiyaera Charitra) వీరాస్వామయ్య గారిపేరు వీరాస్వామి అని ఎచ్చటను లేదు. కాశీయాత్రచరిత్ర (1836) లోగాని దాని తమిళ, మహారాష్ట్ర భాషాంతరీకరణములలో గాని, ఎక్కడను వీరాస్వామి అనునది కానరాదు. అన్నిచోట్లను "వీరాస్వామయ్య" అనియే యున్నది.

1941 కాశీయాత్రా చరిత్ర ముద్రణమున "వీరాస్వామయ్య" అనియే యున్నది. ప్రసక్తమైనది కావున చూపినాను.

---

1. పై ఉదాహృత భాగము రామస్వామిగారి Biographical sketches of the Deccan Poets లోనిది.

2. ఇది బౌర్రయ్య యితరాంగ్ల రచనలతోగూడ లండను ఇండియా ఆఫీసు లైబ్రరీకి (India officc Library) పంపబడినది. అక్కడ యుండ వచ్చును.

3. దీనిని గూర్చిన సంపూర్ణ వివరణమునకు చూడుడు. డాక్టరు కొత్త పల్లి వీరభద్రరావుగారి "తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము: (పుటలు 172-195) (23 పుటలు).

3. వెన్నెలకంటి సుబ్బారావుగారి ప్రస్తుతగ్రంథము

సుబ్బారావుగారు హైందవాంగ్ల రచయితలలో తృతీయులని యీవరకే తెలిపితిని. ఇది దినచర్య గ్రంథమే.

4. హైందవుల చరిత్రలు - ఆంగ్లభాషా రచన

భారతదేశమున ఇంగ్లీషువారు అడుగుపెట్టిన తరవాత, ఆంగ్లభాషలో రచింపబడిన భారతీయుల చరిత్రలలో తెలుగువారివే మొదటివని యూహింప వచ్చును.[1] ఆంగ్ల రచయితల వ్రాతలలోకెక్కిన మొదటివారు తెలుగువారే.

అవధానము పాపయ్య [2]

సర్ వాల్టరుస్కాటు పాపయ్యనుగూర్చి ఇట్లువ్రాసినాడు.[3] (క్రీ.శ.1770)

"A tap at a small postern gate was answered by a black slave who admitted Middlemas to that necessary appurtenance of every government, a back stair, which in its turn conducted him into the office of the Brahman Papaiah, the Dubash or Steward of the greatman and by whose means, he communicated with the native courts and carried on many mysterious intrigues which he did not communicate to his native brethern at the Central Board....

But the thin dusky form which stood before him rapped in robes of muslin embroidered with gold, was

---

1. ఈవిషయమింకను పరిశోధింపవలెను.

2. ఈతనిపేర నేడును మదరాసు వేపేరిలో అవధానము పాపయ్య రోడ్డు-అని ఒకవీధి యున్నది.

3. The surgeon's daughter Page 129.

that of Papaiah, known as the master Counsellor of dark projects an OrientalMachivelli whose premature wrinkles was the result of many an intrigue to which the existence of the poor, the happiness of the rich, the honour of the men, the chastity of women had been sacrificed without scruple to attain some private or political advantage.

కావలి వెంకటబొ్రయ్య జీవితము 1829 నాటికే ఆంగ్లభాషలో వెలసినది.

వీరాస్వామయ్యగారి కాశీయాత్రచరిత్ర ఆతడు బ్రదికియుండగానే ఆంగ్లములో రచించుటకు పూనుకున్నాడు. కొంత యనువదించినాడు. (1887)

సుబ్బారావుగారిది ఆంగ్లములో 1889 నాటికే పూర్తి అయినది.

తెలుగువారికి, తెలుగుదేశ ఆధునికయుగచరిత్రకు నిట్టి ప్రత్యేకత నాపాదించినవారు పై ఆరుగురు మహావ్యక్తులు. వారిలో వెన్నెలకంటివారి గ్రంథమును పరిశీలింతము.

వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్రా చరిత్ర అను నిది ముందుచెప్పినట్లుగా డాక్టరు అక్కిరాజు రమాపతిరావు గారిచే ఆంగ్ల గ్రంథమునుండి అనువదింపబడినది.

డాక్టరు రమాపతిరావు గారివరకే తమ పరిశోధనల మూలమున తెలుగువారికి, తెలుగు పరిశోధక విద్వాంసులకు పరిచితులు- వారు వీరేశలింగము పంతులుగారి గ్రంథములపై సమగ్ర పరిశీలన జరిపి, విశ్వవిద్యాలయ పరిశోధనా పట్టమును బడసినవారు. అయితే, తక్కిన పరిశోధనా పట్టములను బడసినవారికి వీరికి కొంచెము వ్యత్యాస మున్నదని నా భావన. రమాపతిరావుగారు తక్కిన చాలమంది వలెగాక, పరిశోధనా పట్టము బడసిన వెనుకకూడ పరిశోధనా వ్యాసంగము నిరంతరాయముగా సాగించుచున్నారు. నూతనవిషయ సేకరణమున. కభినివేశముతో పరిశ్రమచేయుచు, వానిని లోకమునకు నందింపజేయ వలెనన్న, ఉత్కంఠ ఉత్సాహముతో కృషిసేయు చున్నారు. తెలుగున స్వీయ

చరిత్రలను గూర్చి యొక సాధికారమైన చారిత్రకగ్రంథము సమకూర్చు ప్రయత్నములోనున్నారు. ఆదికూడ త్వరలో సూర్యాలోకమును బడయనుగాక.

అనువాద విధానము

వీరేశలింగము గారినిగూర్చియే గాక వ్యవహారిక భాషావికాసము అను మరియొక గ్రంథమును రమాపతిరావుగారు వ్రాసినారు.[1] ఈ యనువాదమును వారు శిష్టజన వ్యావహారిక భాషలోనే రచించినారు; వ్యావహారికభాషలో రచన చేయుట అందరికి పట్టుబడునది కాదు. కొంతమందిమాత్రమే దానిని నిర్వహింప గలరు. అట్టి కొంతమందిలో ప్రస్తుతానువాదకు లొకరని నిస్సందేహముగా చెప్ప వచ్చును.

ఆంగ్లగ్రంథము ననువాదము చేయునప్పుడది అనువాదమని యనిపించక స్వతంత్ర రచనగా భాసింపచేయుటయే, అనువాదకుని నేర్పునకు ప్రతీక. ఈ గ్రంథమున అనువాద విధాన మెట్లున్నదో నిరూపించుటకు ఒక్కపట్టు నుదహరించుచున్నాను-

My Dear Soobonah,

I am sorry it became my lot both to condole and congratulate you in one breath. This is the world, Soobanah, to which we are sent for the sake of a trial as agreed by all religions. The occurrences which we believe as happy ones in this world are real curses, and our want of religious persuasions misleads us entirely in this respect. You see for an instance we know we are born to die, and yet we are afraid of death and bewail at the death of our friends and relations who are born also to die. As there is no use to be sorry for the loss of things which we are aware, are liable to perish at every moment.....".

---

1. ఇది ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి బహుమతి గ్రంథము.

నా ప్రియమైన సుబ్బన్నా

ఏక కాలంలోనే నిన్ను అభినందించటము నీకు సానుతాపం తెలియజేయ వలసిరావటము నాదురదృష్టం. ఇది నాపాల బడింది. సుబ్బన్నా ఇదీ ప్రపంచం. ఇందులోకి పరీక్షకోసమే మనం పంపబడ్డాము. అన్ని మతాలవారు ఈ విష యంలో ఏక వాక్యతనే కనపరుస్తారు. ఈ ప్రపంచంలో సుఖ సంతోష దాయకా లని మనంభావించే సంఘటనలన్నీ నిజానికి శాపబంధనాల వంటివి. పరమార్థం తెలుసుకొనే దృష్టిలేక పోవడంకూడా ఈవిషయంలో మనం తప్పుదోవ తొక్క డానికి హేతువవుతున్నది. ఉదాహరణకు- మనకందరికీ తెలుసు. మనం పుట్టడ మనేది చావడానికేనని. అయినా మృత్యువంటే మనకు పరమభీతి. మనమిత్రుల మృతికి అలమటించి పోతాము. బంధువియోగానికి పలవిస్తాము. పుట్టుట గిట్టుట కొరకే అని వీళ్ళ విషయంలో మాత్రం మనకు తెలియదా. వస్తు జాతక్షయానికి వగచి పనిలేదు. మనకు తెలుసు. ప్రతిక్షణం అవి నశించిపోతూవుండే అవకాశం వుంది".[1]

ఇట్లే సజీవమైన, సరళ, సుందర రచనతో గ్రంథమంతయు సాగినది. తక్కినవాని వలెగాక మనకు పరిచితముగాని ఆంగ్లేయుల పేళ్లు వచ్చుటచేత పాఠకులకు కొంచెము క్లేశము కలిగించవచ్చును. కాని ఆ క్లేశముకూడ కలిగింప కుండ రచన చేసినారు రమాపతిరావుగారు. ఇక ఈ గ్రంథములోని విషయము లకు కొన్నింటికి వ్యాఖ్యానము.


వెన్నెలకంటివారి వంశావళి

తెలుగుదేశమున చారిత్రకముగా, సాహిత్యమున ప్రసిద్ధమైన కుటుంబము లలో వెన్నెలకంటివారి కుటుంబ మొకటి.[2] వీరు ఆరువేల నియోగులు. హరితస గోత్రులు. ఈ కుటుంబమువారు చాలా ప్రాచీనులు.

---

1. ఇది 1881 అక్టోబరు 11 తేదీని ఏనుగుల వీరాస్వామయ్యగారి ఆంగ్లలేఖ కనువాదము. ఆనాడేమి, ఈనాడును మన మాంగ్లభాషలో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుచుండుట అనుభవైకవేద్యమే.

1. వెన్నెలకటివారి వంశవృక్షము నా ప్రబంధమణిభూషణము పీఠికలో నొకరీతిగా నిచ్చితిని. (పుట 36) అది 1971 లో ఆంధ్రపదేశ్ సాహిత్య అకాడమీ వారివలన ప్రకటిత మైనది.


అన్నయ (క్రీ. శ. 1200)
సూరన
అన్నయ (ఇతడు షోడశకుమార చరిత్ర రచించెను) (క్రీ. శ. 1800)
సిద్ధమంత్రి
కాస్యరన్న లేక సూరన్న
జన్నమంత్రి
సిద్ధన (ఇతడు జక్కన విక్రమార్క చరిత్ర కృతిపతి) (క్రీ.శ. 1400)
భైరవమంత్రి
2 తరములు
ఆదిత్యుడు లేక అమరన్న
సూరన (క్రీ. శ. 1530) (ఇతడు విష్ణుపురాణము రచించెను)
చంద్రశేఖరుడు
తిప్పయ

తిరుమలయ్య
వెన్నెలకంటన్న
లక్ష్మన్న
భైరవుడు
పిన్నమరాజు
గంగన
బాచిరాజు
పెదవెంకన్న
చినవెంకన్న
చక్రప
కాలంరాజు
సూరన్న
అనంతుడు
రామకృష్ణయ్య
గంగయ్య
కందయ్య
సూరపరాజు
రామన్న
రంగయ్య
ఉదయగిరి
వెంకన్న
తిప్పన్న
జగ్గన్న
వెంకటాచల కవి (క్రీ.శ. 1700)
(వెంకటాచలం)
సుబ్బన్న
నరసన్న
(కృష్ణవిలాస కర్త)
వెంకటకృష్ణమ్మ
వెంకటచలం
కృష్ణమ
సుబ్బన్న
భోగన్న
సింగన్న
దత్తు
వెంకటకృష్ణ
భద్రయ్య
సుబ్బారావు
(గ్రంథకర్త (1784-1839)
వెంకట్రాముడు
వెంకటజోగిగోపాలరావు

నాగరాజు శేషగిరయ్య (పుట 21)

ఈయన దక్షిణాదిని ప్రసిద్ధులైన మంత్రి కుటుంబమునకు చెందినవాడు. ఈతని మాతామహుడు ఒలాందా (డచ్చి) వారికి ప్రళయ కావేరీపట్టణమున (నేది పులికాటు) దుబాషి, మంత్రియై, పట్టణాధ్యక్షుడై ఉండేవాడు. తన మాతామహుడు మగదల కృష్ణమంత్రి కృతినందిన దశావతార చరిత్రను క్రీ.శ. 1849 లో ముద్రించుచు, శేషగిరయ్య ఇట్లు చిన్న జ్ఞాపిక వ్రాసినాడు [1]

"ఈ దశావతారచరిత్ర అనే గ్రంథము, ప్రళయ కావేరీపట్టణంలో ఒలాందా వారివద్ద ద్విభాషులుగా ఉండే నా మాతామహులైన మగదల కృష్ణ మంత్రిగారికి కృతికాబట్టి, ఆయన దౌహిత్రుడనైన నేను దీనిని ముద్రించినాను".

నాగరాజు శేషగిరిరావు.

ఉదయగిరి వెంకటరమణయ్య (పుట 33)

సుప్రీంకోర్టులో తమిళ, తెలుగు భాషల్లో ఇంటర్‌ప్రిటరుగా ఉన్న ఈయనను తెలుగుభాషకు ఇంగ్లీషు వ్యాకరణము రచించిన ఎ. డి. కాంబెలు (A. D. Cambell) దొరగారు తన వ్యాకరణమున నిఘంటువులోను పేర్కొన్నాడు. (1821). కాంబెలుదొర ఈయనవద్దనే తెలుగు నేర్చుకున్నాడు. ఇతడు ఫోర్టు సెంటుజార్జి కళాశాలలో ఆంగ్లభాషకు ప్రధానోపాధ్యాయుడై, ఆ వెనుక సుప్రీంకోర్టులో తెలుగు, తమిళ ఇంటర్‌ప్రిటరు పదవిని వహించినాడు.

సుబ్బారావుగారి వివాహములు

ఈ గ్రంథమునుబట్టి సుబ్బారావుగారు నాలుగు పర్యాయములు పెండ్లి చేసుకున్నట్టు కనబడుచున్నది. ఆయనకు నలుబది యెనిమిదవ యేట నాలుగవ వివాహము జరిగినది.

ఈ రీతిగానే నలుబది యెనిమిదవయేట పెండ్లిచేసుకొన్నవారు మరి యొకరు గలరు. వారు వసురాయకవి యని ప్రఖ్యాతికెక్కిన వడ్డాది సుబ్బా

---

1. ఈ దశావతార చరిత్ర ప్రథమ ముద్రణ ప్రతి (1849) శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము నందున్నది.

రాయుడుగారు (1854-1938). కాని సుబ్బారాయుడుగారు పేరులో సామ్య మున్నను పెండ్లి విషయమున సుబ్బారావుగారిని మించినారు.

వడ్డాదివారు- 48 యేటికి 5 వివాహములైన తరువాత 6 వ వివాహము చేసికొన్నారు. వారే యిట్లు వ్రాసికొన్నారు.

ఉ. ఐదు వివాహముల్ తుదకు నాబ్దికమాత్ర ఫలంబులైననే
నా దగు నల్వదెన్మిది వయస్సున నారవ పెండ్లి యాడగా
గాదిలి కూతురుం గొడుకు గల్గిరిఁ దానికి వడ్డి దుందుభిన్
శ్రీదయిత ప్రసాదమునఁ జిన్నికుమారుడు పుత్రిపూర్ణకున్.[1] (81 ప.)

ఆరువదేండ్లయిన వెనుక పెండ్లియాడిన వారీనాడును గలరు.

ఆరవ వివాహము అరటిచెట్టును నరికి దానికి మంగళసూత్రము మొదట కట్టి ఆవెనుక వధువు మెడలో కట్టుదురు.

అరటిచెట్టు కొట్టి ఆరోపెళ్ళి చేసికొన్నాడని వాడుక.

కాశీయాత్ర (40-48 పుటలు)

ఈ గ్రంథమున సుబ్బారావుగారి కాశీయాత్ర యుదంతము ముఖ్యమైనది. సుబ్బారావుగారీ యాత్రను విపులముగా వర్ణించినారు.

ఆధునిక యుగమున అనగా 19వ శతాబ్ది ప్రారంభమున 1829 లో కాశీయాత్ర చేసినవారిలో సుబ్బారావుగారు ప్రథములు. తరువాత కాశీయాత్ర చేసినవారు ఏనుగుల వీరాస్వామయ్యగారు. (1831).

ఈ సందర్భమున తెలుగువారు - కాశీయాత్ర - అను విషయమై మనము తెలుసుకొనుట యావశ్యకము. భారతదేశమున తక్కిన రాష్ట్రములవారికంటె తెలుగువారే కాశీక్షేత్రమును సేవించినట్లు తెలుగు సాహిత్యమున నిదర్శనములు క్రీ. శ. 12 వ శతాబ్దినుండి కన్పట్టుచున్నవి.

---

1. వసురాయ చాటుప్రబంధము - స్వవిషయ ప్రకరణము. (1927) అందు వసురాయని స్వీయచరిత్ర యున్నది.

1. కేతన - (1250) కంచి నెల్లూరు మరి యోరుగల్లవంతి యను పురంబులపై గంగ కరుగుమనిన ఇచట గంగ అనగా కాశి.

— ఆంధ్రభాషాభూషణము

2. తిక్కన - (1260) చేసేతన్ పృథివీశు లందుకొనచేసెన్ కాశి సింధు తోయంబులన్.

— నిర్వచనోత్తరరామాయణము

3. శ్రీనాథుడు - (1410) కాశీఖండమును రచించుటయేగాక కాశీక్షేత్ర మును స్వయముగా దర్శించినట్లు తెలియుచున్నది.

— శృంగార శ్రీనాథము

4. అల్లసానిపెద్దన - (1520) కాశి కురుక్షేత్ర గయా ప్రయాగములు

4. నందితిమ్మన - (1520) తిమ్మన గయాసనము నాతడు కాశిని దర్శించినట్లు తెలుపుచున్నది.

6. పింగళిసూరన - (1560) "గయలోఁ గాశిప్రయాగ" నాపినతండ్రి ఎఱ్ఱనయొనర్చెం దండ్రి కాహ్లాదమున్.

— ప్రభావతిప్రద్యుమ్నము

తెనుగున కాశీమజిలీ కథలు వ్యాప్తిలో నుండెడివి. క్రీ. శ. 1726-50 లో విజయనగర రాజైన నారాయణగజపతి కాశీక్షేత్రమందే నివాసము.

1828 లో వెన్నెలకంటి సుబ్బారావుగారు, 1831 లో ఏనుగుల వీరాస్వామయ్యగారు కాశీయాత్ర చేసిరి.

1850 లో తెలుగువారైన మానవల్లి గంగాధరశాస్త్రి కాశిలో స్థిరనివాస మేర్పరచుకొని తెలుగుప్రతిభను వెలిగించినాడు.

1888 లో మానవల్లి త్యాగయ్యగారు కాశియాత్ర చరిత్ర ప్రకటించిరి.

1893 లో మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారు యాత్రా చరిత్రలో కాశీ క్షేత్ర ప్రశంస చేసిరి.

తెలుగువారి కాశీ ప్రయాణమును గూర్చి వివాహములలో కూడ నొక వాదుక యుండుట గమనింపదగినది. వివాహమునకు ముందు వరుడు నేను కాశికి పోతాను అనును. అప్పుడు బావమరదివచ్చి మా చెల్లెలినిచ్చి పెళ్ళి చేయుదుము వెళ్ళవద్దు అనును. అప్పుడు వరునకు పాంకోళ్ళు గొడుగు ఇచ్చెదరు. ఈ యాచార మిప్పుడు లేదు.

కాశ్యాంతు మరణాన్ముక్తి అను ఆధ్యాత్మిక భావనయే కాశీయాత్రకు హేతువు.

తెలుగువారు - కాశీక్షేత్రము - అను విషయమై పరిశోధన యావశ్యకము.

వినోద కథలు (పుట 69)

కుంపిణీవారు మదరాసు రాజధానిలో ప్రాథమికవిద్య ప్రవేశపెట్టి బడిపిల్లల పుస్తకములను ప్రకటించుటకు

Madras School Book Society

(మదరాసు బడిపిల్లల పుస్తక సంఘము)

అను ఒక సంఘమేర్పడినది. సుబ్బారావుగారందులో సభ్యులేగాక-ఆ సంఘము వారికి ఒక నివేదిక కూడ పంపినారు. అందు ప్రాథమిక విద్య ఎట్లు ప్రచారములోనికి తేవలెనో, బడిపిల్లలు-భాషాజ్ఞానమలవరచుకొనుట కెట్టిపుస్తకము లుండవలెనో, ఆ విషయములన్నిచక్కగా సుబ్బారావుగారు నిరూపరచిరి.*

సుబ్బారావుగారు పై సంఘమువారికి కొన్ని పుస్తకములు అనువదించియిచ్చిరి. వానిలో ముఖ్యమైనది

---

* ఈ నడుమనే ప్రకటింపబడిన- Book Printing in India అన్న గ్రంథమున, వెన్నెలకంటి సుబ్బారావుగారినిగూర్చి, వారి నివేదికనుగూర్చికలదు. పుటలు 265-269. కాని అందు సుబ్బారావుగారి నివేదిక కొంతభాగముమాత్రమే ఉదాహరింపబడినది. ప్రస్తుత గ్రంథమున తెలుగులో సుబ్బారావుగారి నివేదిక పూర్తిగా వచ్చినది (50-51 పుటలు). పై ఆంగ్ల గ్రంథమునకు కర్త-డాక్టరు మంగమ్మ. ప్రకటనకర్త బంగోరె.

వినోద కథలు

ఈ గ్రంథమునకు మొదట 1823 లో వేయిప్రతులు ముద్రితమై, ఆ వెనుక తిరిగి 1828 లో వేయిప్రతులు - చెల్లనవన్నచో నా కాలమున నీ పుస్తకమునకు గల వ్యాప్తిని మనమూహింపపచ్చును. అందుండి సుబ్బారావుగారి వచన శైలి తెలియుటకు మచ్చునకొక భాగ ముదాహరించుచున్నాను.

చిన్నవాండ్లకు తెలివి పుట్టగలందులకున్ను
నడవడి తెలియగలందులకున్ను యేర్పరచబడ్డ

వేడుక కథలు

Madras: Reprinted for the
Madras School Book Society, 1881.

విద్య తరగని ధనము

విద్యయొక్క గుణములు వినుము. ఆ విద్య చెప్పేవాణ్ణిన్ని, గ్రహించే వాణ్ణిన్ని వృద్ధిచేస్తున్నది. మీరు యే వస్తువైనా అన్యులకుయిస్తే ఆది మీది కాకపోతుంది. ఈ విద్యా మహత్మ్యం ఏమంటే విద్వాంసుడైనవాడు తన విద్యను పోగొట్టుకోకుండా విద్యాదానం పూరాగా చేయనున్నవచ్చును. ఒకడు గ్రహించనున్న వచ్చును. వెండి బంగారము నిరంతరము యిస్తూవుంటే రాశి అయినా తరిగిపోతున్నది. అన్యులకు చెప్పడంవల్ల విద్య దినదినానికి అభివృద్ధి అవును గాని తక్కువగాదు - విద్య ఏ విధముగానైనా ద్రవ్యము పోయినట్టు పోదు, వ్యయముకాదు.

దొంగిలించబడదు. మంచి ఆలోచనకర్తవలె మనకువచ్చే అపాయమును తెలియజేసి అండుల ఫలములు అగుపరుస్తుంది. గ్రహచారవశాత్తు యెప్పుడైనా తొందరవస్తే విద్య మనకు ఆలోచన చెప్పును. జనులకు విద్య చెలికాడున్నూ ప్రాణ స్నేహితుడున్ను.

చీకట్లో దివిటి ప్రకాశించును. దీపమున దీపము ముట్టిస్తే మొదటిది ఆరిపోని విధమున విద్య చెప్పడముచేత మూఢుడనే అంధునియొక్క మూఢత్వ

మనే చీకటి పోతున్నది. కాని చెప్పేవానికి తక్కువబడదు. కాబట్టి విద్యాదానము కల్గినవాడు అజాగ్రత్తవల్ల దానిని పోగొట్టుకోకూడదు. తనకు శక్తిగల్గినమట్టుకు వకరికి చెప్పరమునకు అసమ్మతముగానూ వుండకూడదు.

గిడుగు రామమూర్తి పంతులుగారి గద్య చింతామణి పుటలు 255-356 1933 ముద్రణము.

ఈ వినోదకథ లీనాడు తిరిగి ముద్రించి పాఠశాలలలో పఠనీయ గ్రంథముగా చేయవలెను.

ఇంకను గలవు. కాని గ్రంథ విస్తర భీతిని విరమించితిని.

ఈ గ్రంథము చిన్నదైనా మన దేశమున అనాది ప్రాథమిక విద్యను గూర్చి, ఇతర సాంఘికవిషయములనుగూర్చి ఎన్నో క్రొత్తసంగతులు మనము గ్రహింపవచ్చును. ఆంధ్రు లందరును ఆవశ్యకముగా పఠింపదగినది.

ఇట్టి గ్రంథమును తెలుగు వెలుగునకుదెచ్చిన డాక్టరు రమాపతిరావుగారింకను నితోధికముగా మఱికొన్నిండిని రచియించి, తెలుగు సాహిత్యమునకు దీప్తి నించుదురుగాక యని ఆశీర్వదించుచున్నాను.

నలయుగాది (ఉగాది)
31—3—76
లక్ష్మీకాంత నిలయము
2-2-1137/5
సరస్వతీనగరము (క్రొత్తనల్లగుంట)
హైదరాబాదు-44

ఇట్లు
నిడుదవోలు వేంకటరావు

వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్ర చరిత్ర

ముందు ఇది చదవండి

'కొందరు నెల్లూరి గొప్పవారి'లో ఒకడు. స్వీయ చరిత్రను వ్రాసిన మొట్టమొదటి తెలుగువాడు - వెన్నెలకంటి సుబ్బారావు. ఆయన 1889 లో 'A Life Journey of V. Soob row' అనే పేరుతో తన జీవితయాత్రా చరిత్రను ఇంగ్లీషులో వ్రాసిపెట్టి పోయాడు. ఆయన మరణానంతరం, 1878లో ఆయన కుమారుడు, 'సబార్డినేటు జడ్జి పనిని శ్లాఘ్యముగ నిర్వహించిన 'వెంకట గోపాలరావు' ఆ గ్రంథాన్ని మద్రాసులోని ఫాస్టరు ప్రెస్సులో అచ్చువేయించి తనకు ముఖ్యులైన బంధుమిత్రులకు, తనను అభిమానించి ఆదరించిన అధికారులకు పంచిపెట్టాడు.

వెన్నెలకంటి సుబ్బారావు రాజా రామ్మోహనరాయల సమకాలికుడు; చారిత్రక మహాపురుషుడు ఏనుగుల వీరాస్వామయ్య సుప్రీంకోర్టు ఇంటర్‌ప్రిటర్ ఉద్యోగంలో చేరడానికి కారణభూతుడు; భారతదేశపు సర్వేయర్ జనరల్ కల్నల్ కాలిన్ మెకంజీకి దుబాషి అయిన కావలి లక్ష్మయ్యకు స్నేహితుడు; మద్రాస్ సదర్ అదాలత్ కోర్టులో పదిహేనేళ్లు హెడ్ ఇంటర్‌ప్రిటరు, ట్రాన్స్‌లేటరు వగైరా ఉన్నతోద్యోగాలను నిర్వహించినవాడు.

తెలుగు దేశపు వీధిబడులను గురించి, తెలుగు పిలకాయల చదువు సాములను గురించి మద్రాసులోని ఆనాటి పాఠ్యగ్రంథకరణ సభకు సుదీర్ఘ నివేదిక సమర్పించాడు సుబ్బారావు.

సుబ్బారావు జీవిత చరిత్రలో రెండు శతాబ్దాలనాటి తెలుగుదేశం మనల్ని పలకరిస్తుంది. ఆనాటి రాజకీయ వ్యవస్థ, సాంఘిక వాతావరణం, ఆర్థిక పరిస్థితులు, వివిధరంగాల్లో తెలుగువారి ప్రాశస్త్యాలు - ఇవన్నీ ప్రతిబింబిస్తాయి. ఇంచుమించు 19 వ శతాబ్ది మొదటి నాలుగు దశాబ్దాల తెలుగుదేశపు సంగ్రహ స్వరూపం ఈ గ్రంథంలో సాక్షాత్కరిస్తుంది. ముఖ్యంగా రెండువందల ఏళ్లనాటి నెల్లూరి కిటుకు చిన్న అద్దంముక్క.

సుబ్బారావును గురించి 'కొందరు నెల్లూరి గొప్పవారు'లో ఒంగోలు వెంకటరంగయ్య ఇట్లా వ్రాశారు- "తెలుగువారు స్వగ్రామము వదలిపోవ జంకుదురనియు, ధైర్యసాహసములయెడ వీరు యితరులతో సరికాజాలరనియు, ఇట్టి మిథ్యాపవాదములు వినబడుచుండును. ఇట్టి దుర్భ్రమల కన్నిటికి ఈ సుబ్బారావు పంతులుగారి జీవయాత్ర బలవత్తరముగను నిర్మూలముగను ప్రత్యాఖ్యానము చేయుచున్నది. మీసకట్టు యేర్పడని పసితనములో, తూర్పు సముద్రము చేరువనుండు ఒంగోలునుంచి పశ్చిమ సముద్రతీరమునుండు మంగుళూరికి, రైలులేని యా కాలములో కొండలు కనుమలు మహానదులు యడవులు దాటుకొనిపోయి, అచట భాషతెలియక, ముందు వెనుకలవారెవరులేక, స్వశక్తితో నిజప్రజ్ఞతో, చిన్న యుద్యోగమును సంపాదించుకొని, తన బంధుగులకును జీవనోపాయముల నమర్చి, ఆ దేశ భాషలలో ప్రవీణుడై, మైసూరు మహారాజా గారిచే జోడు శాలువల మరియాదబొంది, అపుడపుడె యుదయించుచుండిన ఇంగిలీషు సామ్రాజ్య నిధానమగు చెన్నపట్టణమునందలి మహోన్నత న్యాయ స్థానములో, గ్రుడ్డివానికి త్రోవచూపు మహోపకారివలె, దేశభాషల నెరుగక న్యాయప్రణయమున చిక్కులువడుచుండు న్యాయమూర్తుల ఉపనయనక్రియమై ర్తివహించిన సుబ్బారావుగారొకరే యాంధ్ర ప్రతిభకును. ఆంధ్రుల ధైర్యస్థైర్య సాహసోద్యమములకును, కార్యశూరతకును చాలినంత ప్రమాణము కాగలరు. ఆ కాలమున దేశస్థునికి లభింపగల గొప్పపదవి నందిరి".

ఆ మహనీయుని జీవిత చరిత్ర ఆంగ్ల మాతృకకు అనువాదం ధారావాహికంగా ప్రచురించాము. అనువాదకర్త డాక్టరు ఆక్కిరాజు రమాపతిరావు కందుకూరి వీరేశలింగం పంతులు జీవితం, సాహిత్యంగురించి సమగ్ర పరిశోధన జరిపిన ప్రజ్ఞాధురీణుడు; తెలుగు సారస్వత పరిశోధనలో, నవలా రచనలో లబ్ధప్రతిష్ఠుడు.

నెల్లూరి గొప్పవాడు వ్రాసిన మొట్టమొదటి స్వీయ చరిత్రకు ఇది మొట్ట మొదటి అనువాదం.

— సంపాదకుడు

జమీన్ రైతు

ఒంగోలుకు నైరృతిగా ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న ఓగూరు అనే గ్రామంలో సాయంవేళ 7-8 గంటల మధ్య నేను పుట్టాను. ఆరోజు ఆదివారం. మార్గశిర మాసం, కృష్ణపక్ష విదియ, క్రోధినామ సంవత్సరం ధనుర్మాసంలో పదహేడవ రోజు. కలియుగం 4884 కు సరిగా శాలివాహన శకం 1706 కు సరి అయిన క్రీస్తు శకం 1784 నవంబరు 28 వ తేది అవుతుంది ఆ రోజు.

నా తండ్రిగారైన వెన్నెలకంటి జోగన్న వెన్నెలకంటి వెంకటకృష్ణమ్మ గారి పన్నెండో సంతానం. నెల్లూరు పరగణాలోని తమ కరణీకం గ్రామాలైన నిడుముసిలి, లేబూరు, పున్నూరు మొదలైనవాటిని వదిలిపెట్టుకొని జోగన్నగారు తమ తండ్రి కృష్ణమ్మగారితోను, నలుగురు అన్నదమ్ములతోను ఒంగోలు వచ్చారు. మా తాతగారు మరణించేనాటికి ఆయనకు నలుగురు కొడుకులు, నలుగురు కూతుళ్ళు వున్నారు. పెద్దవాడు వెంకటచలం, రెండో ఆతడు కృష్ణమ్మ, మూడు సుబ్బన్న, నాలుగు జోగన్న. ఒంగోలు రామన్నగారి వితంతువు నారమ్మ, ఒంగోలు బైరాగిగారి భార్య లచ్చమ్మ, మంచెళ్ళ ఏకాంబరయ్యగారి భార్య వెంకమ్మ, వేములపాటి బుచ్చెన్నగారి భార్య మంగమ్మ ఆయన నలుగురు కూతుళ్ళు. మా తాతగారు చనిపోయిన తరువాత ఒంగోలులో వున్న ఆ ఒక్క ఇల్లూ, కొద్దిపాటి ఆస్తి, నా తండ్రులు పంచుకొన్నారు. అప్పటినుంచీ ఆ కుటుంబం వేరుపడిపోయినట్టయింది. అన్నలు తమ్ములు భార్యాబిడ్డలతో వేరింటి కాపురాలు చేసుకుంటూ కాలక్షేపం చేశారు. తరవాత కొద్దికాలానికి అన్నదమ్ములలో పెద్దవాడైన వెంకటచలం, కండ్లగుంటలో కొద్ది మాన్యపుభూమిని సంపాదించుకొన్నాడు. రెండోవాడైన కృష్ణమ్మ కనపర్తిలో నాలుగు గ్రామాల మెట్టభూమిని మాన్యంగా సంపాదించుకొన్నాడు. తరవాత తరవాత ఆ ఊళ్ళలోని భూములు, వాళ్ళ సంతానం మాత్రమే ప్రత్యేకంగా అనుభవిస్తూ వచ్చారు.

నా తల్లిపేరు వెంకమ్మగారు. వేములపాటి పాపన్నగారి కూతురు. పాపన్న గారి మూడో భార్య ఆదెమ్మగారి సంతానం నా తల్లి. నేను పుట్టేటప్పటికి మా అమ్మగారికి ఇరవై సంవత్సరాల వయసు. నేను తొలిచూలు బిడ్డను. నేను పుట్టిన తరవాత కొన్నాళ్ళకు ఉప్పుగుండూరులోను, అద్దంకిలోను మా తండ్రిగారు లాండ్ కస్టమ్ డిపార్టుమెంటులో చిన్నపని సంపాదించి, అక్కడే వుంటూ

వచ్చారు. కుటుంబాన్నికూడా అయన వెంటతీసుకొని వెళ్ళారు. తొమ్మిదినెలలు నిండిన వయసున నాకు మెడమీద కుడివైపున ఒక వ్రణం లేచి చాలా బాధ పెట్టింది. అది నయంకావడం చాలాచాలా కష్టమైంది. అప్పుడు పడిన మచ్చ ఇక అట్లానే వుండిపోయింది. ఒక సంవత్సరం గడచినతర్వాత మా నాన్నగారు ఒంగోలుకు తిరిగివచ్చారు. తన తండ్రిగారి ఇంట్లో తనకు సంక్రమించినభాగంలో వుంటూ, ఒంగోలులోనే లాండ్ కస్టమ్ డిపార్టుమెంటులో, చిన్న ఉద్యోగమే అయినా, కుటుంబపోషణకు సరిపోగలిగిన రాబడిగల ఒక చిన్నపనిలో ప్రవేశించారు. నా మూడోఏట నాకు జానకమ్మ అనే చెల్లెలు పుట్టింది. నా ఆరోఏట వెంకటకృష్ణుడు అనే తమ్ముడు పుట్టాడు. ఈ తమ్ముణ్ణి పన్నెండోరోజునే మా పెదతండ్రి కృష్ణమ్మగారు దత్తత తీసుకున్నారు. నా ఎనిమిదోఏట నాకింకో తమ్ముడు లక్ష్మీనరసు పుట్టాడు.

నా ఏడోఏట ఒంగోలులో, నన్ను తెలుగుబళ్ళో చేర్పించారు. నాకు తొమ్మిదో ఏడు వచ్చేవరకూ అక్కడే చదువు సాగింది. తొమ్మిదోఏడు నిండి పదోఏడు వస్తుండగానే మా తండ్రిగారు కాలగతి చెందారు. ఆయన కప్పటికి అరవైమూడు సంవత్సరాల వయసు. ఆనందనామ సంవత్సర వైశాఖ మాసం కృష్ణపక్ష దశమికి సరిఅయిన క్రీ. శ. 1794 మేనెల 24 వ తేది మా నాన్న గారు మరణించారు.

తరవాత కొద్దినెలలకు నా ఉపనయనం జరిగింది. అప్పుడిక మా మేన మామ వీరయ్య, మా అమ్మమ్మ ఆదెమ్మగారలు నన్ను ఓగూరు తీసుకొనిపోయినారు. అక్కడ కొన్ని నెలలున్నాను. అప్పుడు మా మామయ్య నాకు తెలుగు చెప్పేవాడు. మచిలీపట్నంలో మిస్టర్ జాన్‌వన్‌గమ్‌ను కలెక్టరుగా నియమించటంతో, నా మేనత్త ఆదెమ్మగారి ఏకైక పుత్రుడు మంచెళ్ళ పాపయ్య కలెక్టరు గారిని ఆశ్రయించుకొని, ఆయన కచ్చేరీలో శిరస్తాళాఖలో గుమాస్తాగా చేరాడు. ఇంకో మేనత్త లచ్చమ్మగారి కొడుకు ఒంగోలు గోపాలకృష్ణమ్మ 1795 లో మచిలీపట్నం బయలుదేరాడు. నేనుకూడా అప్పుడతనితో వెళ్ళాను. నేను మచిలీపట్నం వెళ్ళిన తర్వాత మంచెళ్ళ పాపయ్య నాకు జాబులు వ్రాయటం, లెక్కలు వ్రాయటం నేర్పించాడు. ఈ పరిస్థితులలో కొన్నినెలలకక్కడ గడిపి అక్కడినుంచి ఒంగోలుకు తిరిగి వచ్చాను. అక్కడినుంచి మా పెదతండ్రి కృష్ణమ్మ గారిని చూడామని నేను వినుకొండ వెళ్ళాను. చాలాకాలంగా అయన తన కుటుం

బంతో అక్కడే వుంటున్నాడు. అక్కడి పే మేస్టరు ఆఫీసులో మేనేజరైన నవలూరు నరసాయపిళ్ళ గారికించ ఒక చిన్నపని సంపాదించుకొన్నాడాయన. మా చెల్లెలు జానకమ్మకు అప్పటికి తొమ్మిదేళ్ళు వచ్చాయి. తమ్ముడు వెంకట కృష్ణకు ఏడేళ్ళు వచ్చాయి. అందువల్ల మా పెత్తండ్రి, తమ్ముణ్ణి దత్తతీసుకున్నాడు కాబట్టి, వాడి ఉపనయనమూ, చెల్లెలి పెళ్ళికూడా జరిపించాము. బెల్లంకొండ పరగణా గురిజేపల్లి గ్రామస్థుడైన నందిగామ గోపాలప్పగారి ఒక్కగానొక్క కొడుకు బాపిరాజుకు మా చెల్లెల్నిచ్చి పెళ్ళి చేశారు.

వినుకొండలో కొద్దినెలలున్న తర్వాత నేను మళ్ళీ మచిలీపట్నం వెళ్ళాను. మంచెళ్ళ పాపయ్య నన్ను చూసి చాలా సంతోషపడ్డాడు. తరవాత కొన్ని నెలలకు మా అమ్మ, మా చెల్లెలు, చిన్నతమ్ముడు లక్ష్మినరసు మచిలీపట్నానికి వచ్చారు. ఆ తరవాత కొన్నాళ్ళకే చాలా విచారకరమైన వార్త మాకు తెలిసింది. ఎవరితోనూ చెప్పకుండా, ఎవరూ ఊహించనూలేకుండా, మా ఒక్కగానొక్క మేనమామ, అప్పటికి జీవించివున్నవాడాయన ఒక్కడే, వీరయ్యగారు కాశీకి వెళ్ళాడన్న సంగతే ఆ విచారకరమైన వార్త. అప్పటినుంచి ఆయుత్తరువాత ఆయన గురించి మాకేమీ తెలియదు.

నలనామ సంవత్సర మాఘ శుక్ల పక్షమి నవమికి సరిఅయిన 1797 ఫిబ్రవరి 6వ తేదీన మంచెళ్ళ పాపయ్యగారి ఒక్కగానొక్క కూతురునిచ్చి నాకు వివాహం చేశారు. కాని దురదృష్టవశాత్తు పింగళ కార్తీక కృష్ణపక్షమి ద్వాదశి నాడు అంటే 1797 నవంబరు 19 తేదీనాడు, మా మామగారైన మంచెళ్ళ పాపయ్యగారు మచిలీపట్నంలో చనిపోయినారు.

1797 అంతంలో మేము ఒంగోలుకు తిరిగి వచ్చాము. 1798 అంతా అక్కడొక చిన్నబడిలో చేరి నేను ఇంగ్లీషు నేర్చుకొన్నాను. పైడిపాటి వెంకటచలం అనే బ్రాహ్మణుడా బడిని నడిపేవాడు. అప్పుడప్పుడు కొన్ని విఘాతాలు కలిగి, నా చదువు సక్రమంగా సాగలేదు. ఓగూరులోవున్న మా అమ్మమ్మను, ఇంకా ఇతర బంధువులను అప్పుడప్పుడు వెళ్ళి నేను చూడవలసి రావడం తప్పని సరి అయ్యేది. 1799 ప్రారంభంలో నేను మళ్ళీ వినుకొండకు ప్రయాణమైనాను. మిలిటరీ పే మేస్టరు ఆఫీసులో ఎకౌంటెంట్ అయిన నవలూరు పెరియ తంబిపిళ్ళ దయతో కల్పించిన ఆసరాతో, ఇంగ్లీషు యింకా బాగా నేర్చుకోవాలని

అక్కడకు చేరాను. అక్కడ కొద్దినెలలుండి ఒంగోలుకు తిరిగి వచ్చాను. అప్పుడు 1799 మే నెల 4వ తేదీన శ్రీరంగపట్నం పట్టుకోవడం నేను విన్నాను. వాస్తవానికి ఆ ప్రాంతానికివెళ్ళి ఏదైనా 'రైటర్' ఉద్యోగం సంపాదించుకొందామని నాకు కోర్కె ఉండేది. కాని తరవాత ఆ ఆసక్తి తగ్గిపోయి చేయదగిన ఆ ప్రయత్నాన్ని నేను విరమించుకున్నాను. తరవాత వచ్చిన ఆగస్టు నెలలో మళ్ళీ నేను వినుకొండకుపోయి, నా అధికారి అయిన పెరియతంబిపిళ్ళ వెంట గుంటూరుకు వెళ్ళాను. పే మేస్టర్స్ ఆఫీసును అప్పుడు గుంటూరుకు మార్చారు. గుంటూరులో పే మేస్టరైన మిస్టర్ హెన్రీ విల్సన్, నా జరుగుబాటుకోసం ఒక మద్రాసు వరహా అంటే 4 రూపాయలు, నాకు నెలకు ఇచ్చే ఏర్పాటు చేశాడు. ఆయన ఆఫీసులో నేను ఇంగ్లీషు బాగా వ్రాయడం, లెక్కలు బాగా చేయడం నేర్చుకొని ఆ విషయంగా నా పరిజ్ఞానం బాగా అభివృద్ధి చేసుకున్నాను. నిజానికి నా అధికారి ఎకౌంటెంట్ ఆఫీసులో పని అంతా నా చేతనే చేయించేవాడు. నేనీ పనిలో 8 నెలలపాటు వున్నాను.

1880 అక్టోబరు 18వ తేదీన, ఒంగోలులోనూ, చుట్టుప్రక్కలా పెద్ద తుపాను చుట్టుముట్టింది. ఆ సమయంలో నేను గుంటూరులో వున్నాను. ఎంతో మంది మనుషులు, ఎన్నో పశువులు మృత్యువాత పడటం జరిగిందని నేను విన్నాను. తరవాత కొన్నాళ్ళకు గుంటూరుకు పదిమైళ్ళ దూరంలో వున్న కలియలూరు వెళ్ళాను. మా మేనత్త లచ్చమ్మగారి కొమారుడు ఒంగోలు జానకి రాముడు పెళ్ళికిగాను. ఇతడు ఒంగోలు శేషాచలంగారి పెద్దకొడుకు. తరవాత ఫిబ్రవరిలో నేను గుంటూరుకు తిరిగి వచ్చాను.

1801 మార్చి నెలలో రాయలసీమ జిల్లాల పే మేస్టరైన ఎఫ్. ఎ. సేవెజ్‌గారి కింద పనిచేస్తున్న సుంకా రామకృష్ణమ్మ నాయుడుగారితో కలిసి, ఆ జిల్లాలకు వెళ్ళాను. 'పే మేస్టరు'గారు ఈ నాయుడుగారిని ఇంగ్లీషు వ్రాయగలిగిన కొందరు 'రైటర్ల'ను 'పే ఆఫీసు' పనిలోకి తీసుకోవలసిందని కోరినందువల్ల నాయుడుగారు నన్నూ, మచిలీపట్నానికి చెందిన ఇంకా కొందరినీ పనిలోకి తీసుకొన్నారు. అంతా బయలుదేరి కంభం మీదుగా కొమర కాల్వ గండికి చేరుకున్నాము. అక్కడ మెజర్ జనరల్ డగల్డ్ కెంపెబెల్ 'కేంపు' చేసివున్నాడు. ఆయనదగ్గర మిస్టర్ సేవెజ్ పే మేస్టరుగా వుండేవాడు. వెంటనే పే మేస్టరు కొలువులోకి నన్ను ఇంగ్లీషు రైటరుగా పనిలోకి తీసుకొన్నారు. నెలకు పది

వరహాలుగా నా జీతం నిర్ణయించినారు. ఇందుతో $5\frac{1}{2}$ వరహాలు నేను, మా అమ్మ, చెల్లెలు, తమ్ముడు, నక్ష్మినరసుల జీవనార్థం ఫేమిలీ సర్టిఫికెట్ద్వారా ఒంగోలులో అందే ఏర్పాటుచేసి, మిగిలిన $4\frac{1}{2}$ వరహాలు నా కోసం వుంచుకొన్నాను. కొన్ని నెలలపాటు సైన్యం తాలూకు 'పే ఆఫీసు'తో పాటుగా ఒక చోటినుంచి మరోచోటికి ప్రయాణంచేస్తూ, గుత్తి, తాడిపత్రి, కడప, గండికోట, కంబం, సిద్ధవటం, రాయచోటి, పుష్పగిరి, కమలాపురం మొదలైన ప్రదేశాలన్నీ చూశాను. చివరకు రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యస్థానంగా బళ్ళారిని నిర్ణయించడంతో, పే ఆఫీసును అక్కడ నెలకొల్పారు. బళ్ళారి చేరిన కొన్ని నెలలకు నాకు ప్రమాదకరమైన జబ్బు చేసింది. ఈ జబ్బుసంగతి మా అమ్మకు తెలియజేయడంతో, ఆమె ఒంగోలునుంచి నే నున్న చోటుకి (300 మైళ్ళకు పైగా వున్న దూరం) పరుగులమీద వచ్చింది. నా ఆరోగ్యం పూర్వస్థితికివచ్చి కుదుట బడటంతో, ఆమె ఒంగోలు తిరిగి వెళ్ళిపోయింది.

1802 జులై నెలలో హెడ్‌రైటరైన మనపాక స్వామి నాయక్‌ను, మిస్టర్ సేవెజ్ బర్తరఫ్ చేసినందువల్ల అతడి కింద పనిచేస్తూ వచ్చిన నిడమర్తి వీరేశలింగం, ఆ పనిలో ప్రవేశించాడు. పనినుంచి బర్తరఫైన హెడ్‌రైటర్‌కూ నాకూ మధ్యవున్నసౌన్నిహిత్యం వొకవైపూ, కొత్తగా ఆ పనిలో ప్రమోషన్ పొందిన అధికారికీ నాకూవున్న వైమనస్యాలు ఇంకొకవైపూ, పేఆఫీసులో నాపనికి రాజీనామా చేయవలసిన అగత్యం కలిగించాయి. రాజీనామా చేయటానికి అనుమతించవలసిందిగా సేవెజ్ గారికి దరఖాస్తు పెట్టుకొన్నాను. అయనకు అటువంటి అనుమతి ఇవ్వటానికి అభ్యంతరం తోచినట్టున్నది. నిజానికిలేని అనారోగ్యమేదో అనుభవిస్తున్నట్టుఆ దరఖాస్తులో నేను వాసుకొన్నాను వాస్తవంచెప్పవలసివస్తే నేను ఇంటికివెళ్ళి చేయగలిగిందేమీలేదు. ఇల్లు గడవటానికినాకు వేరేదారి లేనేలేదు. కాబట్టి ఈపని వదిలానా, నేను వేరే ఏదోపని చూసుకో తప్పదు.ఆ ప్రయత్నాలేప్రారంభించాను. అదృష్టవశాత్తూ నాస్నేహితుడైన హలాది నాగోజిరావు, అక్కడి సబ్‌కలెక్టరాఫీసులో హెడ్‌రైటర్‌గా పనిచేస్తుండేవాడు. అప్పు డక్కడి సబ్‌కలెక్టరు మిస్టర్ జేమ్సుకొక్రెన్. నామీద సానుభూతితో నాకష్టాన్ని పంచుకొంటూ నాస్నేహితుడు అప్పుడు బనవాసిలో. ఉత్తరకెనరా జిల్లాకు కలెక్టరుగా పనిచేస్తున్న మిస్టర్ అలెగ్జాండర్‌రీడ్ అఫీసులో హెడ్ ఇంగ్లీషు రైటర్‌గా పనిజేస్తున్న జేమ్సు క్రైగ్‌కు, అక్కడేమైనా ఇంగ్లీషు రైటర్ పనికి ఎవరైనా

కావాలాఅనీ, కావలసివుంటే నన్ను పంపుతాననీ వ్రాశాడు. ఆజాబుతోపాటు నాదస్తూరీ ఎట్లా వుంటుందో తెలియజేసే మచ్చువాత కాగితాన్ని కూడా జతపరిచి పంపాడు. రీడ్‌గారు ఇందుకు అంగీకారం తెలియజేస్తూ నేను నెలకు ఎంతజీతంకావా లనుకొంటున్నానో తెలియజేయవలసిందిగా కోరారు. నాగోజీరావు నాతో సంప్రతించి ఇందుకు సమాధానంగా, 18 వరహాలుగా నిర్ణయించి, బళ్ళారినుంచి అక్కడకుచేరు కోవటానికి ఒక నెలజీతం ముందుగా 'ఎడ్వాన్సు'గా పంపవలసిందని బనవాసికి వ్రాశాడు. వెంటనే వాళ్ళు అంగీకరిస్తూ, 18 వరహాల బిల్లును, తనపేరిట 'డ్రా' చేసేటట్లుమిస్టర్ కొక్రన్‌కు, మిస్టర్‌రీడ్ పంపించటం జరిగింది ఆబిల్లునాకు చేరగానే, సేవెజ్‌గారిదగ్గర తుదివీడ్కోలు తీసుకొని, కొక్రెన్‌గారి దగ్గర 18 వరహాల మొత్తం అందుకొని, 1802 ఆగస్టు 1తేదిన బళ్ళారిని వదిలి పెట్టి. 10వ తేదిన బనవాసికి చేరుకున్నాను.

బనవాసికి చేరిన తరువాత నాయజమాని అయిన రీడ్‌గారు. నాజీతాన్ని 20 వరహాలకు పెంచారు. అక్టోబరు నెలలో కలెక్టరుగారి కచేరీ కనుమల దిగువ ప్రాంతాలకు తరలడంతో, నేనుకూడా మంగుళూరుదాకా, కచ్చేరిని అనుసరించుకొంటూ పర్యాణంచేశాను. నవంబరులో, కచ్చేరిసిబ్బందిలో కొంతభాగమూ నేనూ ఒనూరుకు తిరిగివచ్చాము. అక్కడనేనొక చిన్న ఇల్లుకూడా నిర్మింపచేశాను. ఎందుకంటే రీడ్‌గారు, ఒనూరును ప్రాంతీయ పరిధాన కార్యాలయంగా నిర్ణయించటంతో, ఉద్యోగులంతా, ఒకరి తర్వాత ఒకరుఅక్కడ ఇల్లు కట్టుకొన్నారు. 1803 ఫిబ్రవరి 3తేదీ రీడ్‌గారు నాకు వ్రాసినజాబు ఇక్కడ పొందుపరుస్తున్నాను.

మంగుళూరు, ఫిబ్రవరి 1803.

సుబ్బారావు,

బంగళా కట్టుబడి ఎట్లా సాగుతున్నదో నాకు తెలియజేయవలెను. డబ్బు అవసరమైతే వ్రాయి. ఒనూరులో నీకింకేమైనా కావలసివుంటే వ్రాయగలవు. అక్కడనీ వేంపని చేస్తున్నదీ నాకు తెలియజేయవలసింది. డిసెంబరునెల తాలూకు కాపీ చేయవలసిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నిటినీ ఒకటి రెండు రోజుల్లో నీకు నేను పంపుతాను. ఈలోపున జనవరి తాలూకుపని నీకు పంపుతాను. ఫుల్‌స్కేప్ కాగితాలమీద, ఒక్కొక్క అక్షరమే విడివిడిగా వ్రాస్తూ, నివృత్తి చేయవలసి వచ్చి

టుంది. అజాబులు తేదీవారీగానివు కాపీ చేయాలి. స్పెల్లింగు (వర్ణక్రమం) విషయంలో బాలాజాగ్రత్త చూపాలి. ఎక్కడైనా నీకు ఒకమాట తెలియకపోతే, అందుకు తగినఖాళీని వదిలిపెట్టు. తరావాత నేను వచ్చి వాటిని పూర్తిచేసుకుంటాను. పూర్తిచేసిన తర్వాత (చిత్తు, సాపుకాపీలుకూడా) ఓనూరులో కెర్రియిన్‌గారి చిరునామాకు పంపవలసింది. 13వ తేది లోపుగా నేనక్కడకు చేరుకోలేను.

(సం)అలెగ్జాండర్ రీడ్.

పైజాబువల్ల 1803 నాటికేనా యజమానికి నాపట్ల ఎంతటి విశ్వాసం వుండేదో స్పష్టపడటంలేదా? ఓనూరుకో ఆయన ఇంటి కట్టుబడి పర్యవేక్షణ అంతా నేనే నిర్వహించేవాణ్ణి. దానికి సంబంధించిన మేనేజ్‌మెంటు అంతా ఆయన నాకే అప్పగించారు. అప్పటికినావయస్సు 18 సంవత్సరాలునిండి రెండునెలలుమాత్రమే గడిచాయి. ఆతరవాత కొద్దిరోజుల్లో రీడ్‌గారు ఓనూరుకు తిరిగి వచ్చారు. నేను దగ్గరుండి కట్టుబడి పూర్తిచేయించిన ఆఇంటిని ఆయన బాగుందన్నారు.

1803 ఆగస్టునెలలో యజమానినుంచి మూడునెలలు సెలవు సంపాదించుకొని ఒంగోలుకు చేరుకున్నాను. ఊడిగిరి, సర్‌కార్‌పూర్, హొనల్లి, హరిహర్, హర్పనహల్లి, బళ్ళారి, గుత్తి, గండికోట, కంబం మీదుగా ప్రయాణం చేశాను.

1803 సెప్టెంబరు నెలలో ఒంగోలు చేరుకున్నతర్వాత, బంధువులందరినీ చూసివచ్చాను. ఒంగోలు శేషాచలంగారినికూడా చూసివచ్చాను. అయనగారు కలెక్టరు మిస్టర్ జె.బి. ట్రావెర్స్‌గారిదగ్గర శిరస్తాశాఖలో పనిచేస్తున్నారు. కలెక్టరుగారితోనూ, ఆయనవెంట కచేరీతోనూ ఆయన పర్యటన చేస్తూ ఆరోజుల్లో అక్కడకు వచ్చారు- సెటిల్‌మెంటు పనులనిమిత్తంగా అక్టోబరు నెల మొదటిరోజుల్లో మా అమ్మను, చెల్లెలిని, మాతమ్ముడు లక్ష్మీనరసును వెంట బెట్టుకొని శ్రీరంగపట్నంమీదుగా కనరాజిల్లాకు ప్రయాణంచేశాను. మాఅమ్మమ్మ ఆదెమ్మగారుకూడా మాతోపాటు వచ్చింది. అంతా క్షేమంగా నవంబరులో అక్కడికి చేరుకున్నాము. తరవాత ఐదారునెలల కనుకుంటాను ఓనూరులో లక్ష్మీనరసుకు ఉపనయనం జరిపించాను. అటుతరవాత మా అమ్మతోపాటుగా మాచెల్లెలిని ఒంగోలు పంపించాను- ఆమె గురిజేపల్లికి భర్తదగ్గరకు కాపరానికి వెళ్ళటానికిగాను.

1805 జనవరిలో కలెక్టర్ కచ్చేరి కొండపూరుకు మార్చుచేయటం జరిగింది. అక్కడ ఒకటి రెండు నెలలపాటు నేను రీడ్ గారుండేందుకు స్వగృహం నిర్మింపచేసే పనిలో వున్నాను. మాఅమ్మ నాచెల్లెలిని భర్తయింటిలో గురిజేపల్లిలో దిగవిడచి, మార్చి నెలలో మళ్ళీ కనరాకు ప్రయాణమై వచ్చింది. కొండపూర్‌లో ఆమెవచ్చి నాకు కనపడ గానేనాకు మహదానందమైంది. ఏప్రైల్ నెలలో నాకుచాలా జబ్బుచేసింది. అందువల్ల నూగూరులో వైద్యం చేయించుకొనే నిమిత్తం సెలవుకోసం రీడ్‌గారికి విజ్ఞప్తి పంపుకోవలసి వచ్చింది.

రీడ్‌గారు ఎంతో దయతో సర్జన్ ఆండ్రూన్‌గారిపేరిట సిఫారసుజాబు ఒకటి నాకు దయచేశారు. నూగూరులో నెలరోజులు ఆయనదగ్గర చికిత్స చేయించుకోవలసి వచ్చింది. పూర్తిగా ఇంకా నేను కోలుకోక ముందే, రీడ్‌గారిని కనరాప్రాంతపు ప్రధాన కలెక్టరుగా నియమించారన్న సంగతి నాకు తెలిసింది. ఆయనక్రింద గోవాన్‌గారిని, విల్సన్‌గారిని కలెక్టరులుగా నియమించి నట్లున్నా తెలిసింది. రీడ్‌గారు నన్ను కొండపూర్ వచ్చి కలుసుకోవలసిందిగా జాబు వ్రాశారు. ఆరోగ్యం కుదుటబడితే రమ్మని వ్రాశారు అందులో. ఆ సమయానికి నాఆరోగ్యం ఒక మోస్తరుగా కుదుట పడటంవల్ల నేను వెంటనే కొండపూర్, వెళ్ళి, నాపనిలో చేరాను. అటుతరువాత అక్టోబరులో అసిస్టెంట్ కలెక్టర్ విల్సన్‌గారు కొండపూర్ వచ్చారు. అప్పుడు, రీడ్‌గారునెలకు 25 వరహాల జీతంమీద నన్ను ఇంగ్లీషు హెడ్ రైటర్‌గా నియమించుకొమ్మని వారికి సిఫారసుచేశారు. విల్సన్ గారు అప్పుడు సబ్ కలెక్టరుగా పనిచేస్తుండేవారు. ఈవిధ్యా టునుబట్టి విల్సన్‌గారి కచేరిపన్ను ఒనూరుకు నేను వెళ్లవలసివచ్చింది. కనరా ఉత్తర ప్రాంతానికి ఒనూరు కేంద్రంగా విల్సన్‌గారి కచేరీపనిచేసే ఏర్పాటు జరిగింది. ఆతరవాత కొద్దిరోజులకు నాభార్య తనతల్లి గారైన చిన్నమ్మగారితోను, నాపెత్తండ్రి కృష్ణమ్మగారి పత్తుడూ నా సోదరుడూ అయిన వెంకటకృష్ణయ్య, ఇంకొక పెత్తండ్రి సుబ్బన్నగారి కొమారుడు భద్రయ్యతోనూ కలిసి ప్రయాణంచేసి ఒంగోలు నుంచి వచ్చి నన్ను చేరుకుంది. ఒనూరు దగ్గర అగసపడే వాళ్ళకు మాకు పునస్సంధానం జరిగింది. పైన చెప్పిన నాతమ్ముళ్ళిద్దరూ ఒంగోలులో జీవనాధారం ఏమీ లేకపోవడంవల్లనూ, చదువుసంధ్యలు నేర్వకపోవడంవల్లనూ, కనరాజిల్లాకు నాదగ్గరకువచ్చారు. వాళ్ళను నేను ఆదరించి నెనరుతో ఏదోవిధంగా

పైకితీసుకొనివచ్చి బ్రితుకుతెరువు చూపించాలని వాళ్ళు నాతోపాటు వుండటానికి నేనుకూడా నమ్మతించాను.

1808 ఫిబ్రవరిలో ప్రభుత్వంవారి రెగ్యులేషన్ చట్టం 11 (The Government Regulation 11) అమలైంది. దీని ప్రకారం కలెక్టర్ల న్యాయ నిర్ణయాధికారాలు రద్దయిపోయాయి. డిసెంబరులో అలెగ్జాండర్ విల్సన్ గారిని కనరాకు యాక్టింగ్ జడ్జిగా నియమించారు. ఈ నియామకసమాచారం విల్సన్‌గారు తన కచేరీలో రాజమండ్రిలో వుండగా, వారికి చేరింది. అయన తన సిబ్బందినంతా ఒకూరుకు వెళ్ళవలసిందిగా ఆజ్ఞాపించి, వెంటనే మంగుళూరుకు హుటాహుటి ప్రయాణమై, రీడ్‌గారిదగ్గర అధికార ప్రమాణ స్వీకారం చేయడానికి వెళ్ళారు. విల్సన్‌గారు ఒకూరు తిరిగి వచ్చిన తరవాత, ఆయన నన్ను అక్కడే తన కోర్టులో ట్రాన్సలేటర్‌గానూ, హెడ్ ఇంగ్లీషు రైటర్‌గానూ నియమించుకొన్నారు. వెనక రివిన్యూ యిలాకాలో నేను నెలకు తీసుకొనే జీతం మీదనే ఈ నియామకంకూడా జరిగింది. అంటే నెలకు 25 వరహాల జీతం మీదనేనన్నమాట. నా తమ్ముడు లక్ష్మీనరసు అప్పటికి ఇంగ్లీషు భాషయనూ, చదవనూ తగినంత పరిజ్ఞానం సంపాదించినందువల్ల నా దగ్గరే, 3 వరహాల జీతం మీద, విల్సన్‌గారు అతణ్ణికూడా పనిలో చేర్చారు అక్కడ చక్కటి ఇల్లు, అందమైన కొబ్బరితోట సంపాదించుకొని మేమంతా ఒకూరులో సంతోషంగా కాలం వెళ్ళబుచ్చాము.

1807 సెప్టెంబరులో, తమ్ముడు లక్ష్మీనరసును, జ్ఞాతి సోదరుడు భద్రయ్యను మా అమ్మవెంట ఒంగోలుకు పంపించాను. వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించడానికి కాను ఈ విధంగా చేయవలసి వచ్చింది. అనుకొన్నట్లుగానే ఈ రెండు పెళ్ళిళ్ళు జరిగాయి. కాని నాలుగు నెలలు గడిచాయో లేదో మా ప్రారబ్ధం కొద్దీ దురదృష్టవంతుడు నా ముద్దు తమ్ముడు లక్ష్మీనరసు ఒంగోలులో కన్ను మూశాడు.

విభవనామ సంవత్సర వైశాఖమాస శుక్లపక్ష తదియనాడు, అంటే 1808 ఏప్రిల్ 28 వ తేదీనాడు ఇది జరిగింది. ఈ అత్యంత విషాదవార్త నాకు చేరిన రోజునుంచీ నేను తట్టుకోలేక చాలా దుఃఖపడ్డాను. మాటి మాటికి నా తమ్ముడే గుర్తు వస్తూవుండటంతో, నేను అక్కడ వుండలేక ఉద్యోగాన్ని విడిచిపెట్టి

అయినా సరే. కనరా ప్రాంతాన్ని విడిచి నా స్వస్థానం చేరుదామా అని తల పోశాను. మా అమ్మ, భద్రయ్య, అతడి తోబుట్టువు అక్క లక్ష్మమ్మ, ఒంగోలు నుంచి 1808 సెప్టెంబరులో ఒనూరుకు తిరిగి చేరుకున్నారు. 1808 జులైలో మంగుళూరులోని దక్షిణ కనరా జిల్లాకోర్టు మూతపడి, ఒనూరు కోర్టుకే ఆ పని అంతా, అధికారమంతా అప్పగింత చేయడం జరిగింది. సబ్‌కలెక్టరు పదవీ అధికారాలుకూడా రద్దుకావడం జరిగింది. విల్సన్‌గారు, సిరస్తదారు పుట్టప్ప, నేను రికార్డులు స్వాధీనపరచుకోవడానికిగాను మంగుళూరు వెళ్ళాము. ఆగస్టు మాసారంభంలో తిరిగి ఒనూరు చేరుకొన్నాము. పధ్నాలుగేళ్ళ నా మద్దు తమ్ముడు లక్ష్మీనరసు కన్నుమూయడం నా కెంత దుస్సహంగా గుండె పగల జేసిందో నేను చెప్పలేను. అప్పటికే నా తమ్ముడు ఐదు భాషలలో తగినంత పరిచయం సంపాదించాడు. ఇటువంటి నా తమ్ముడి అకాల మరణం నా ఆరోగ్యాన్ని చెడగొట్టి నేను తరచు మంచాన పడేటట్లు చేసింది. నా ఉద్యోగ విధులు నిర్వహించటానికి కావలసిన శక్తి, ఉత్సాహాలుకూడా నాలో పూర్తిగా లోపించి పోయాయి. నేను కోర్టులో చాలా ముఖ్యమైన పనులు, ఇంటర్ ప్రెటర్‌గా, ట్రాన్స్‌లేటర్‌గా, ఎకౌంటెంట్‌గా, హెడ్‌రైటర్‌గా నిర్వహించవలసి వుండేది. కాని మాటిమాటికీ నేను సెలవు పెట్టవలసిన పరిస్థితి తప్పనిసరి అయ్యేది. చిట్టచివరకు ఇక నేను కనరా జిల్లా కోర్టులో నా పనికి స్వస్తి చెప్పుదామన్న నిర్ణయానికి రావలసి వచ్చింది - విధిలేక ఇందువల్ల 1808 నవంబరు 3 తేదీ నాడు, రిజిష్ట్రారైన మెక్‌రత్ దొరగారికి దీనికి అనుమతిని దయచేయవల సిందిగా విజ్ఞాపనం పంపుకున్నాను. ఆయన విల్సన్‌గారికి ఆ సందర్భంగా ఒక జాబు వ్రాశారు. ఇది దాని నకలు.

మై డియర్ విల్సన్,

సుబ్బారావు ఇటీవల తరచుగా కోర్టులో తన పనికి సెలవు పెట్టటానికి అనుమతించవలసిందిగా కోరుతూ వచ్చాడు. ఈ రోజుకూడా, తన పరిస్థితుల నన్నిటినీ వివరిస్తూ, మీకీ విషయం నేను తెలియజేయవలసిందిగా కోరుతూ, మళ్ళీ నాపేరిట వ్రాశాడు. అతని ఆరోగ్యం ఈ ప్రాంతాలలో ఏమీ బాగుండం లేదనీ, కోర్టుపని చాలా అలసట కలిగిస్తున్నదనీ, అవకాశంవుంటే ఉత్తరప్రాంతా నికి వెళ్ళాలని వున్నదనీ వ్రాశాడు. మీరు అవసరమనుకొంటే అన్ని విషయాలు మీతో విశదంగా అతడే స్వయంగా మాట్లాడతాడు.

మీరుగనుక అతడి రాజీనామాను అంగీకరించే పక్షంలో, అతణ్ణి నా ప్రైవేట్ మున్షిగా నియమించుకోవటం నా కోరిక అయినప్పటికీ, నా సలహాను బట్టిగాని, నాతో సంప్రదించిగాని, అతడిటువంటి నిర్ణయానికి వచ్చినట్లుగా మీ రెంతమాత్రమూ భావించకూడదని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. పైగా అతడి కోరిక ఉచితమైనది కాదని చెపుతూ 28 వరహాల జీతం వచ్చే ఒక పనినిగూర్చిన అవకాశాన్నికూడా అతడికి నేను సూచించాను. దీనితోపాటుగా కేవలం నన్ను నమ్ముకున్నంత మాత్రాన అతనికి ఉద్యోగం దొరకటమనేది సరైన ఆలోచన కాదనికూడా తెలియజేశాను. కాని అతడిపైవరకే పూర్తిగా నిశ్చయించుకున్నాడు.

నమ్మకంగా

మీ

3 నవంబరు, 1808 (సం.) జె. మెక్కెరెల్.

తలవని తలంపుగా యీజాబు చూడగానే విల్సన్‌గారు చాలా విస్మయం పొందారు. వెంటనే నన్ను పిలిచి, ఈ విధంగా హఠాత్తుగా ఎందుకు నిర్ణయించుకొన్నావని అడిగారు. కాని నేను అంతా వివరంగా చెప్పిన తర్వాత, నా నిర్ణయాన్ని ఆయనకూడా అంగీకరించారు; నేను పనిలోంచి విరమించుకోవడానికి సమ్మతించారు. వెంటనే నేను నాకింది అధికారి పోర్చుగీసు దేశస్థుడైన గవియస్‌కు చార్జి అప్పగించి 1808 నవంబరు 3 వ తేదీ మధ్యాహ్నం పనినుండి విరమించుకున్నాను. జాన్ మెక్కెరెల్‌గారు వెంటనే నన్ను తన ప్రైవేటు మున్షిగా నెలకు పన్నెండు నక్షత్ర వరహాల జీతంమీద నియమించారు. ఆయన నాదగ్గర తెలుగు నేర్చుకొన్నారు. నేను ఈ పనిలో ప్రవేశించేముందు పశ్చిమ విభాగపు ప్రొవిన్షియల్ కోర్టుకో 3 వ జడ్జిగా వుండే బెయిల్ బిహార్డ్‌సన్‌గారు, అప్పుడు పర్యటిస్తూ ఓసూరులోవుండి, పైన పేర్కొన్న ప్రొవిన్షియల్ కోర్టులో శిరస్తదారుపని నాకు ఇప్పిస్తామని చెప్పారు. కాని స్వస్థలానికి వెళ్ళిపోవాలనే కోర్కతో వున్న నేను, ఆ ఉద్యోగంలో చేరడానికి ఇష్టపడలేదు. మెక్కెరెల్‌గారు ఎట్టాంటి తదేక దీక్షతో తెలుగు నేర్చుకొన్నారంటే, ఫిబ్రవరి 1 వ తేదికల్లా, ఆయన తెలుగులో ఒక పరీక్షకు వ్రాయడానికి హాజరైనారు. అందుకుగాను ప్రభుత్వంవారినుంచి నెలవు మంజూరు చేయించుకొని, 1809 ఫిబ్రవరి 16 తేది ఒంగోలు విడిచి

మద్రాసు వెళ్ళారు. నేనుకూడా సకుటుంబంగా వారితోనే ప్రయాణం సాగించా నని చెప్పవలసినపని లేదనుకుంటాను.

మేము శ్రీరంగపట్నం చిత్తూరుమీదుగా ఏప్రిల్‌లో రాజధాని ప్రవేశిం చాము. నా దారిఖర్చులన్నీ నా యజమాని భరించడమేకాక, పరీక్షలో చెప్పుకో దగినట్లుగా కృతార్థుడై వెయ్యి పెగొడాల (1000 వరహాల) నగదు బహుమానం అందుకొన్నప్పుడు నాకు మంచి బహుమానంకూడా ముట్టచెప్పారు.

మెక్కెరెల్‌గారు కనరాప్రాంతం విడిచిపెట్టి పోవటానికిముందు, ఉత్తర సర్కారులలో ఏ ప్రాంతంలోనైనా కలెక్టర్ ఉద్యోగం తనకు లభిస్తుందని ఆశిం చారు. నేనుకూడా ఇది జరుగుతుందనే ఆశతోనే ఆయనను అంటిపెట్టుకొని వుంటూవచ్చాను. కాని దురదృష్టవశాత్తూ ఆయన కోరిక నెరవేరకపోవడంతో, 1809 ఆగస్టుకో మళ్ళీ కనరాప్రాంతానికి తిరిగిపోవలసివచ్చింది. నా కుటుం బాన్ని మద్రాసులోనే వుంచి నేనుకూడా ఆయనను అనుసరించవలసివచ్చింది. మెక్కెరెల్‌గారు ఒక ఏర్పాటు చేశారు. నా కుటుంబాన్ని విలియమ్ ఆలివర్‌గారి పోషణవర్గంగా వుంచేందుకన్నూ, దానికిగాను వారికి నెలకు పదివరహాలు చెల్లించ డానికిన్నీ ఏర్పాటు అది.

ఒనూరుకు తిరుగుప్రయాణంలో గత్యంతరంలేక మేము శ్రీరంగపట్నంలో ఇంచుమించుగా నెలరోజులపాటు నిలిచిపోవలసివచ్చింది. ఆ రోజుల్లో కల్నల్ బెల్‌న్నూ, ఇంకా ఇతర సైనికాధికారులు, అక్కడ సృష్టించిన అలజడివల్లనే మేము అట్టా చేయవలసివచ్చింది. చివరకెట్టాగో మేము ఒనూరు చేరుకొన్నాము. మెక్కెరెల్‌గారు నా తోడ్పాటుతో కన్నడ వ్యాకరణ రచనకు పూనుకొన్నారు. కాని ఒనూరులో ఆపని సంతృప్తికరంగా సాగకపోవడంతో మేము మంగుళూరుకు వచ్చి, అక్కడ ఆ పనిని కొనసాగించాము. నా తమ్ముడు వెంకటకృష్ణయ్య విషయంలో రీడ్ గారికి మెక్కెరెల్‌గారు సిఫార్సు చేయడంవల్ల, మద్రాసునుంచి నేను అతణ్ణి రప్పించాను. అతడు రీడ్‌గారి కచ్చేరీలో నెలకు 8 వరహాల జీతం మీద గుమాస్తాగా ప్రవేశించాడు. మంగుళూరులో వెంకటకృష్ణ కుదుపడినతరవాత నేనూ, యజమాని మెక్కెరెల్‌గారూ ఒనూరుకు తిరిగివచ్చాము.

నా యజమాని నా పట్ల ఎంత విశ్వాసం కనపరిచేవాడంటే, అతడి పను లన్నీ నేను చక్కపెట్టడమేకాక, మైసూరు ప్రాంతపు ప్రతి జిల్లానుంచి సోల్లు

సరి రాబడి ఎంత వస్తున్నదో వాస్తవికమైన వివరాలు సేకరించే ఉద్దేశంతో ఆ సమాచార సేకరణకుకూడా ఆయా ప్రాంతాలకు నన్నాయన పంపించేవారు. ఆయన కోరికమేరకు నేనుకూడా 8, 9 తాలూకాలు పర్యటించాను. కాని, కావలసిన సమాచారం సేకరించడం బహు కష్టసాధ్యమైంది. అంతటితో నేను ఒనూరు తిరిగివచ్చాను. దురదృష్టం వెంట తరుముతున్నట్లుగా మా అమ్మనుంచి నా కొక జాబు వచ్చింది. ఒంగోలులో నా భార్య మరణ వృత్తాంతం తెలియ జేస్తూ వచ్చిందా జాబు. మా అమ్మ, అమ్మమ్మలు అప్పుడు నా దగ్గర లేరు. ఎంతో దూరాన వున్నారు. అందువల్ల ఈ వార్త నన్ను మరింత కృంగదీసింది. దీనికితోడు నా ప్రాపకుడు మెక్కెంరెల్ గారికి చాలా ప్రమాదకరమైన జబ్బు చేసింది. పిటన్నిటితో నా మనస్సంతా వేదనతో నిండిపోయింది. ఇక దీనితో మద్రాసులోని నా స్నేహితు లందరినీ నా కేదైనా తగిన ఉద్యోగం చూపవల సిందిగా అభ్యర్థించాను. మంగుళూరులోనే నా భార్య ఆపరకర్మలన్నీ పూర్తిచేసి మెక్కెంరెల్ గారిదగ్గర సెలవు తీసుకొని ఒనూరు వచ్చాను. మెక్కెంరెల్ గారికి కూడా వ్యాధి ప్రబలుతూ రావడంతో, తన ఆరోగ్యం చక్కబడే పక్షంలో 15 నెలల తర్వాత మళ్ళీ ఇండియాకు తిరిగి వస్తాననీ, నా జరుగుబాటుకోసం అప్పటి వరకూ నెలకు 10 వరహాలు యిచ్చే ఏర్పాటు చేస్తున్నానని ఆయన నాకు చెప్పారు. మంగుళూరులోని నా శ్రేయోభిలాషులైన స్నేహితు లందరితోనూ సంప్రతించాను. మెక్కెంరెల్ గారు యిచ్చే ఈ కొద్దిపాటి ద్రవ్యంతో వేరే పని ఏదీ చూసుకోకుండా కూచోవడంకన్నా, ఏదైనా నౌకరీలో ప్రవేశించడం మంచి దని వాళ్ళు నాకు సలహా చెప్పారు. నేను ఈ సలహాను గత్యంతరంలేక అంగీక రించవలసి వచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని నా స్నేహితు లందరికీ అనేక రకాలుగా జాబులు వ్రాశాను.

1810 డిసెంబరు ప్రారంభంలో మద్రాసునుంచి కావలి వెంకటలక్ష్మ య్యనా కొక జాబువ్రాశాడు. అందులో ఆయన శ్రీరంగపట్నం జిల్లాకోర్టులో హెడ్‌ఇంగ్లీషు రైటరు మరణించినసంగతి తెలియజేస్తూ, ఆపనిలో ప్రవేశించడానికి తగినవిధంగా ప్రయత్నాలు చేయవలసిందిగా సలహా యిచ్చాడు. ఈ విషయం తెలిసినవెంటనే నేను శ్రీరంగపట్నంలో మేజిస్ట్రేటుగాను, జడ్జిగాను పనిచేస్తున్న జేమ్స్ కస్‌మైజర్ గారికినా అభ్యర్థిత్వాన్ని విన్నవించు కొంటూ ఒకజాబు వ్రాశాను. మొట్టమొదట నేనీ ఉత్తరాన్ని మెక్కెంరల్ గారివద్దకు తీసు కొనివెళ్ళి,

ఆపనికోసం సంప్రతించడానికి అనుమతించవలసిందిగా వేడుకొన్నాను. వెంటనే నాకోరికను మన్నించడానికి అయన ఎంతో సంకోచించినాడుగాని, పదే పదే, ఆయన పరిస్థితులూ, నాపరిస్థితులూ విన్నవించుకుంటూ, ప్రార్థించగా, చివరకు అంగీకరించక తప్పిందికాదు. నేనుశ్రీరంగపట్నం బయలుదేరిపోవడానికి ఆయన అనుమతించారు నేను ఒనూరు విడచిపెట్టిన మూడురోజులతర్వాత విపరీతమైన అస్వస్థతకు గురియిమెక్కెరల్ గారుకూడా ఒనూరు విడిచిపెట్టారు. యూరోపుకు తిరిగి వెళ్ళడానికిగాను, బొంబాయికి ప్రయాణమై వెళ్ళారు.

1810 డిసెంబరుమధ్యలో నేను శ్రీరంగపట్నంచేరాను. వెంటనే జిల్లాకోర్టులో నెలకు20 వరహాల జీతంమీద ఇంగ్లీషు రైటర్గాపై హెడ్గా పనిలో ప్రవేశించాను.నా జీవితచరిత్రలో తరవాత వివరాలు వ్రాయబోయేముందు, నేను చాలా సంవత్సరాలు కనరా ప్రాంతంలో గడిపాను కాబట్టి ఆ అందమైన దేశాన్ని గురించి, అక్కడి ప్రజల సుఖసంతోష జీవనాన్ని గురించి కొంత తెలియజేయడం ఉచిత మనుకుంటాను.

కనరా ప్రాంతపు దక్షిణ సరిహద్దు బెకుల్ జిల్లా; ఉత్తరసరిహద్దు సూపజిల్లా; పడమటిదిక్కున సముద్రమూ, తూర్పున సాధారణంగా కనుమలూ, దాని భౌగోళిక సరిహద్దులు. ఉత్తర ప్రాంతంలో ముఖ్యంగా మంచిగంధపు కలప, తమలపాకులు, వరి, మిరియాలు, కొబ్బరి, వీలకులు, ఉత్పత్తి అవుతాయి. ఈప్రదేశంలో సాధారణంగా జనసాంద్రత తక్కువగానే వుంటుంది. దట్టమైన అరణ్యాలు ఉన్నప్పటికి ఆరోగ్యకరమైన ప్రదేశం ఇది. ఇక్కడ నివసించే ప్రజలు వివిధ తెగలకు చెందినవారు. అయితే మలబారులో కనిపించే స్వచ్ఛంద ప్రవృత్తిగలవారుకారు.

ఇక్కడ చెరువులుకాని, జలాశయాలు కాని ఏవీలేవు. భూమిచాలా సారవంతమైనది; విలువైనది, మైసూరు కర్ణాటకంవలె కాకుండా, భూమిమీద ప్రభుత్వ యాజమాన్యంలేదు. ఇక్కడ భూమికి సంబంధించిన హక్కులైతుదే. భూమి యజమానులు ఇక్కడి భూస్వాములు. అత్యంత ప్రాచీనకాలంనుంచీవారికి దానహక్కులున్నాయి. జాగీరుగా భూమిని ఇతరులకిచ్చే హక్కు లున్నాయి. ఈ హక్కులు ఎప్పుడుఏ కాలంలో ప్రభుత్వం వీరికి సంక్రమింప చేసిందో నిశ్చయంగాచెప్పే ఆధారాలు వెతకటం చాలాకష్టం. కాని పరంపరా గతంగా

వస్తున్న అచారాన్నిబట్టి, ఒకటి ఊహించవచ్చు. అన్ని భూములపైన కొంత ఆదాయం శిస్తుగా విధించబడిందనీ, ఆది వసూలుచేసి యివ్వడానికి ముందుకు వచ్చినవారికి ఆభూమిని యివ్వడం జరిగిందనీ, ఈవిధంగా ప్రతిసంవత్సరమూ క్రమంతప్పకుండా ఈశిస్తు చెల్లిస్తూవచ్చి నందువల్ల, ఆ భూములపై రైతుకు హక్కు భుక్తాలు ఏర్పడివుండవచ్చు. భూపరిగ్రహీత రాజుకుగాని ఆయన పరివారానికిగాని ఏవైనా బహుమానాలు, ధనమూ ఇచ్చాడేమో తెలియదు. పూర్వపు పరిపాలనా యంత్రాంగానికి సంబంధించిన సమాచారం తెలియజేసే పుస్తకాలు, యీప్రస్తావన చేయలేదు.

ఏవిధంగా రైతు ఆధీనంలోకి ఆభూమి వచ్చివున్నప్పటికీ, ఇప్పుడు వాళ్ళ హక్కులను ప్రశ్నించడానికే అవకాశంలేదు. వార్షికమైన స్వల్పమొత్తాలు చెల్లించడంతో ఆ హక్కులు వారికి ఏర్పడ్డాయి. సొంత దారులేని భూములన్నీ సర్కారువారిపరమై పోతాయి. అవి ఇతరులకు శాశ్వతంగాగాని సాలుకు, కొలుకు చెల్లించేవిధంగాకాని ఇవ్వ డంజరుగుతుంది ప్రప్రథమంగా హక్కులు సంపాదించిన అసలు భూస్వాముల వారసులను 'మూలగనీ' లనీ, వారిపై ఆధార పడినవారిని' 'చలగనీ'లనీ అంటారు. చాలామంది బ్రాహ్మణులుకూడా శిస్తు చెల్లించకుండ భూములను అనుభవించేవారున్నారు. గుడిగాని, గోపురంగాని. హిందువులదైనా మహమ్మదీయులదైనా భూరూపకమైన అస్తిలేనిదికనిపించదు. మూండ్రాంతంలో తరిభూముల యాజమాన్యపు హక్కు ప్రభుత్వానికే సంక్రమించి వుంటుంది. ఈ భూములన్నిటికీ శాశ్వతపద్ధతిలేని సనదులుంటాయి. యజమానిని తొలగించడం కాని ఎస్టేటును ఇతరులకు ఇవ్వడానికి సంబంధించిన హక్కుగాని, సర్కారువారి ఆధీనమే వ్యక్తిగతమైన ఋణాలకోసం భూమిని అమ్మకోవడమనేది కనరా ప్రాంతంలో జరగనేజరగదు. ఎస్టేటును తాకట్టు పుంచి అటువంటి అవాంతరాలు తీర్చుకుంటారు. మళ్ళీ వాటిని తిర్చి, తిరిగి తమకు దఖలుపరుచుకుంటారు. ఇంతకు ముందు సర్కారు శిస్తు జమకట్టడంలో కొన్ని అవకతవకలు జరిగాయి. అటువంటి సందర్భాలలో ఆ భూములపై హక్కులు వారినుంచి తొలగించటం జరిగింది. పాతబాకీనికూడా చెల్లించి ఆభూములను స్వాధీనపరచుకోడానికి ముందుకు వచ్చిన వాళ్ళకు వాటిని ఇవ్వడం జరిగింది. వాళ్ళు క్రమంగా సాలుసరి అద్దెను చెల్లించే హామీ ఇవ్వాలి. కనరాప్రాంతంలో దాయాదులు భూములను పంచుకోవడం సర్వసామాన్యం. హిందూసంప్రదాయం ప్రకారమేయూ

పంపకాలు జరుగుతాయి. సర్కారువారికి తెలియచేయకుండానే రైతులమధ్య భూముల బదలాయింపులు జరుగుతుంటాయి. ఈప్రదేశంలో పంట రెండు కార్లు పండుతుంది. మొదటికారు పంట నవంబరులోనూ రెండవకారు మేనెలలోనూ పండుతుంది. సూండా ప్రాంతంలో తమలపాకుతోటలు మిరియాలు, ఏలకులు విస్తారంగా ఉత్పత్తిచేస్తారు. ఈ పంటలన్నిటికీ ఈ ప్రాంతంలో తగినంత వర్షాధారం వుంటుంది. ఇక్కడ మేనెలలో వర్షాలు ప్రారంభమై, డిసెంబరు చివరదాకా కురుస్తూనేవుంటాయి. మొదటిమూడు నెలలు నిరంతర ధారాపాతంగా వర్షాలు కురుస్తాయి. అటుతరవాత వర్షతీవ్రత కొంచెం తగ్గుతుంది.

1788లో మొట్టమొదటిసారిగా యీజమీల సుంకం విధించడం జరిదింది. ప్రప్రథమంగా దానినే శిస్తుగా నిర్ణయించి నారు. ఘనత వహించిన కంపెనీవారి ప్రభుత్వం దానినే ప్రామాణికమైన అద్దెగా నిర్ణయించింది. ఫలసాయపు నికరాదాయంలో 2/7 వంతులు సర్కారువారికి 5/7 వంతులు భూస్వామికి చెందుతున్నది పరిపాటిగా. కనరాప్రాంతంలో సర్కారుశిస్తు చెల్లించడంలో బకాయి ఎప్పుడూ సంభవించలేదు. 1809 నుంచి నేటిదాకా ఘనతవహించిన కంపెని ప్రభుత్వంవారి హయాంలో ఇటువంటిది జరగనేలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇక్కడిప్రజలు బాగా ధనవంతులనే చెప్పాలి. ఎంతబీద వాడైనప్పటికీ ఈ ప్రాంతంలో ఎవరూ యాచనను ఆశ్రయించరు. జీవికకోసం ధనవంతులను ఆశ్రయించడం జరగవే జరగదు. అన్నిరకాల మెట్టధాన్యమూ కనరాలోనూ, సూండాలోను పండిస్తారు. సర్వసాధారణంగా కనరాలో రైతులు తమక్షేత్రాలలోనే ఇళ్ళు కట్టుకొంటారు. సూండాజిల్లాలో వ్యవసాయకులు తమలపాకుల తోటల్లోనో, లేదా గ్రామాలలోనో ఇళ్ళు కట్టుకుంటారు. మైసూరు లేదా కర్ణాటకంలోకంటే కనరాలో జీవితావసర వస్తువులన్నీ చాలా చౌక.

శ్రీరంగపట్నానికి నేను రాకడానికి కొన్నినెలలుముందు మైసూరు ప్రభుత్వం దివానైన పున్నయ్యను అధికారంనుండి బర్తరఫుచేశారు .ఘనతవహించినమహారాజావారు తమరాజ్యాన్ని తాముస్వాధీనపరచు కోగానే ఈపనిజరిగింది. ఈ రాజావారి ఆధీనంలో 125 తాలూకాలున్నాయి. ఈయన రాజ్యాదాయం 50 లక్షల వరహాలు. నేను శ్రీరంగపట్నానికీ వచ్చిన కొన్నినెలలతర్వాత మంగుళూరులోవున్న నాతమ్ముడు వెంకటకృష్ణమ్మను నాదగ్గరకు పిలిపించుకున్నాను. అతడికి నెలకు 8వరహాల జీతంపైన ఇంగ్లీషు రైటరుపనిని సంపాదించాను.

అటుతరవాత కొన్నాళ్ళకు మాఅమ్మ, నాచెల్లెలు, ఆమెభర్త, మాఅమ్మమ్మ ఆదెమ్మ, నాజ్ఞాతిసోదరుడు భద్రయ్య అంతా మద్రాసునుంచి బయలుదేరి శ్రీరంగపట్నం వచ్చిచేరారు. భద్రయ్యను వెంటనే శ్రీరంగపట్నంకోటలో కొత్వాలుదగ్గర నాయబుగా, నెలకు ఐదుపరహాల జీతంమీద పనిలో కుదిర్చాను. అప్పుడిక మాఅమ్మ నేనూ మరెండో పెళ్ళినిగూర్చి ఆలోచనచేశాము. దీనికోసంగా ఒంగోలు వెళ్ళటం అవసరమైతే వెళదామని అనుకున్నాము కాని శ్రీరంగపట్నంలోనే పేమేస్టరు ఆఫీసులో అకౌంటెంట్‌గావున్న మా బంధువు భీమరాజు సీతారామయ్యగారు, తమకూతురునిస్తామని తెలియపరచారు. మాఅందరికీ అదిసమ్మతం కావడంతో, శ్రీరంగపట్నంలోనే నాద్వితీయవివాహంజరిగింది. ప్రజోత్పత్తినామ సంవత్సర చైత్రశుద్ధ షష్టికి సరిఅయిన 1811 ఏప్రిలీలో పెళ్ళిజరిగింది. అటుతరవాత కొద్దినెలలకు 'పేమేస్టర్ ఆఫిస్' బెంగుళూరుకు మార్చడం జరిగింది. మామామగారు సకుటుంబంగా బెంగుళూరుకు వెళ్ళారు. నాభార్యకూడవాళ్ళతోనే వెళ్ళింది. నాయజమాని ఆయిన జేమ్స్ కసమైజర్ నేను పనిలో ప్రవేశించేటప్పుడు నాగురించి ప్రభుత్వంవారికి గట్టిగా సిఫార్సుచేశారు. నావేతనం చాలా తక్కువగా వుండటంచూసి, అదనంగా నాకు ఇంకా 25 వరహాలు వచ్చే ఏర్పాటు చేశారు. ఇదివీ విధంగా చేశారంటే, అప్పుడు మైసూరులో బ్రిటిష్ రెసిడెంటుగావుండే గౌ. అర్థర్ హెూస్రీకోల్‌గారికి ఆయన వ్యక్తిగత, అంతరంగిక సేవలకుగాను ఈఏర్పాటుచేశారు. ఘనతవహించిన మహారాజావారు అదేమొదటిసారిగా శ్రీరంగపట్నం దర్శించి నప్పుడునాకు జోడుశాలువలు బహుమానం చేశారు. శ్రీరంగపట్నంలోని భయంకరమైన విషజ్వరంతోనా ఇంటిల్లిపాదీ జబ్బున పడ్డారు. నేనుకూడా తీవ్రమైన అస్వస్థతకు గురిఅయినాను. దండు (సైనిక పటాలం) వైద్యుడు డాక్టర్ పీటర్ సన్ నాకు రోగనిదానం చేశారు కాని రోజురోజుకూ నాస్థితి దిగజారిపోతూ వచ్చింది. ఈలోపున మద్రాసు సదర్‌కోర్టులో ట్రాన్స్‌లేటర్‌గావున్న నాస్నేహితుడైన నాగరాజు శేషగిరయ్య, నాపూర్వపు యజమాని జాన్ మెక్కారెల్ యూరపు నుంచి ఇండియాకు తిరిగి రావడం, మద్రాసు చేరుకోవడం నాకు తెలియజేశాడు. ఈసమాచారంవల్ల నాకు కొత్తగా ఒంటికి బలంపట్టి నట్లయింది. నాకు ఆయనను దర్శించాలనే బలమైన కోర్కితోపాటుగా, వైద్యసలహా కూడా అందుకు అనుగుణంగానేవుంది. అనారోగ్య కారణాలు చూపి (సిక్ సర్టిఫికెట్ దాఖలాచేసి) జిల్లాకోర్టు వారిచేసెలవు మంజూరు చేయించుకొని, తూర్పుతీరప్రాం

తానికి బయలుదేరాను. అప్పుడక్కడ మేజిస్ట్రేటూ, జడ్జిగానూఉన్న జాన్ రిడెల్ గారు మూడునెలలపాటు నేను సెలవు పెట్టటానికి అనుమతించారు.

1812 జూన్ నెల నుంచి నాకు సెలవు మంజూరైంది. నేను శ్రీరంగ పట్నం నుంచి మద్రాసుకు ప్రయాణమై పోయినాను. మద్రాసులో జాన్ మెక్కె రెల్ గారిని దర్శించాను. ఆయనలో నాకు చాలా మార్పు కనిపించింది. నన్ను చూసి ఆయన చాలా ఆనందించారు, కాని ఆయనవద్ద ఏమీ ఉద్యోగం లేకపోవ డంవల్ల నా కేమీ పని కుదర్చలేకపోయినారు. అటు తరువాత ఆగస్టులో నా బంధు బలగాన్ని అంతా చూడడానికి నేను నెల్లూరు బయలుదేరి వెళ్ళాను. ముఖ్యంగా ఓంగోలువారి కుటుంబాన్ని చూసి చాలారోజులు కావడంతో, వారిని చూద్దామని వెళ్ళాను. ఆ కుటుంబానికి గడచిన కొద్ది సంవత్సరాలలో చాలా ఆపదలు సంభవించాయి.

నెల్లూరుకు రావడంతో నా ఆరోగ్యం కొంత కుదుటపడినందుకు నేను సంతోషించాను. సెప్టెంబరులో నా సెలవు అయిపోతున్నది కాబట్టి, నేను శ్రీరంగపట్నం బయలుదేరి పోవడానికి సిద్ధపడుతున్నాను. కాని ఏంచెప్పను! నా దురదృష్టంకొద్దీ నాకు హఠాత్తుగా చాలా పెద్దజబ్బు చేసింది. సర్వాంగాల లోనూ భరించలేని నొప్పి మాత్రమే కాక, చాలా ఆశ్చర్యకరంగా ఒక రాత్రి నా సర్వావయవాలు చచ్చుబడిపోయాయి. ఒక్కమక్కలో చెప్పాలంటే, నా అంతట నేను పక్కమీదినుంచి కదలలేని పరిస్థితి ఏర్పడింది. ఇతరుల ఆసరాతో లేవడానికికూడా, ఇద్దరు మంచి బలశాలుర సహాయం అవసరమైంది. ఆయుర్వేద వైద్యుడు పి. వెంకటాచారి నాకు నాలుగు రోజులలో స్వాస్థ్యం కలిగించాడు. మళ్ళీ నాకు బలం చేకూరింది.

ఒక సాయంకాలం నేను దండు వైద్యాధికారి దగ్గరకు వెళ్ళాను. ఆయన డాక్టర్ సట్టన్. గొప్ప వైద్యుడు. అనారోగ్య ప్రదమైన శ్రీరంగపట్నం వాతా వరణాన్ని బట్టి, నేను అక్కడకు వెళ్ళడం మంచిదా? కాదా! అని సలహా అడగ టానికి వెళ్ళాను. ఆయన నా పరిస్థితిని సాకల్యంగా పరిశీలించి నన్ను అక్క డకు వెళ్ళవద్దని సలహా ఇచ్చారు. అయితే ఈ సలహా మాత్రమే ఇవ్వటం కాకుండా, తమ పలుకుబడిని వినియోగించి, కలెక్టరుగారైన థామస్ ఫ్రేజర్

గారికి ఆయన కచేరీలో నా కేదైనా ఉద్యోగం దొరికేటట్లు తప్పక సిఫార్సు చేస్తామనికూడా చెప్పారు.

మళ్ళీ అటుతరవాత నేను డాక్టరుగారినీ, జిల్లా జడ్జీ హగ్‌లార్డ్‌గారిని కూడా దర్శించాను. డాక్టరుగారు, నా గూర్చిన పరిచయ లేఖ, కలెక్టరుగారికి వ్రాసి ఇచ్చారు. వెంటనే కలెక్టరుగారు నన్ను వారి హుజూరు కచ్చేరీలో ట్రాన్స్ లేటరుగా నియమించారు. నెలకు 20 వరహాల జీతం ఏర్పాటుచేశాడు. ఇక అప్పుడు నేను శ్రీరంగపట్నం జిల్లా జడ్జిగారైన రిడ్డెల్‌గారికి లేఖ వ్రాస్తూ, నా రాజీనామా పత్రాన్నికూడా అందుతోబాటు పంపాను. ఆ లేఖ నకలు ఈ క్రింద పొందుపరుస్తున్నాను.

శ్రీరంగపట్నం జిల్లా యాక్టింగుజడ్జి, మేజస్ట్రేటువారికి:

అయ్యా,

శ్రీరంగపట్నంలో తరచు తీవ్రమైన అనారోగ్యానికి గురి అవుతున్నందు వల్ల గడచిన జూన్ 25వ తేదీన నేను సెలవు మంజూరు చేయించుకొన్నాను. ఆరోగ్యం చక్కబరచుకోడానికి సముద్రతీరానికి వెళ్ళాలనే ఉద్దేశంతో మూడు నెలలపాటు సెలవు తీసుకున్నాను. ఈ 25వ తేదీతో నా సెలవు ముగిసిపోతున్నందువల్లనూ, నేను మళ్ళీ అక్కడకు చేరుకోగలనని నా కేమాత్రమూ ఆశ లేకపోయినందువల్లనూ, నా ఆరోగ్యం పూర్తిగా బాగుపడక పోవడంవల్లనూ, ఇంకా నా వొంట్లో సుస్తిగానే వున్నందువల్లనూ నా పదవికి రాజీనామా చేయడానికి అనుమతిని ప్రసాదించి, నేను జిల్లా కోర్టులో హెడ్ రైటర్ పదవీ బాధ్యతల నుండి తప్పుకొనడానికి వీలు కలిగించవలసిందిగా వేడుకొంటున్నాను.

మీ వీలును అనుసరించి 'ది రెగ్యులేషన్ ఫర్ ది నేటివ్ ఫండ్'కు సంబంధించిన 6వ ఆర్టికల్ తాలూకు సర్టిఫికేటును నాకు పంపవలసిందిగాకూడా వినయపూర్వకంగా అర్థిస్తున్నాను.

నెల్లూరు
22 సెప్టెంబరు 1812.

మీ యొక్క
(సం.) వి. సుబ్బారావు.

ఈ లేఖ చేరగానే నా రాజీనామాను అంగీకరిస్తూ, జిల్లా జడ్జిగారైన రిడ్డెల్ గారు, నేను కోరిన ఆ సర్టిఫికెట్‌ను నాకు పంపించారు. థామస్ ఫ్రేజర్‌గారు రివిన్యూబోర్డువారికి 1812 నవంబరు 17 వ తేది వ్రాసిన లేఖలో, తమ కచ్చేరీలో నా ట్రాన్స్‌లేటర్ నియామకాన్నిగూర్చి ఈవిధంగా సిఫార్సుచేస్తూ వ్రాశారు.

పేరా II : కొత్తగా ఒకరిని ఇక్కడ నా సిబ్బందిలో ట్రాన్స్‌లేటర్ పదవిలో నియమించడంగూర్చి మీకు వివరించడం సబబుగా వుంటుందని, ఉచిత మని నేననుకొంటున్నాను. దీనివల్ల ప్రత్యక్షంగా సిబ్బంది సంఖ్య ఏమీ పెరగక పోయినప్పటికీ మీకు వివరించడం ఉచితమని భావిస్తున్నాను. ఈ వ్యక్తి కచ్చేరీలో పనిచేయడం చాలా అవసరం. ఇతడు రెగ్యులేషన్స్ అన్నిటినీ, న్యాయ సంబంధమైన సర్వవ్యవహారాలనూ బాగా తెలిసినవాడు. కలెక్టరుగారి సిబ్బంది లోని అముల్దారులకు, ఇతరులకూ ఈ విషయాలను చక్కగా వివరించి చెప్పడంలో సర్వసమర్థుడు. ఇదివరకటి నా లేఖలో నేను వ్రాసినట్లు ఆయా ఉద్యోగస్థులు ఈ విషయాలలో చాలా వెనకబడివున్నారు. ఇతడు మంచి యోగ్యతతో పాటు తగిన సామర్థ్యంకూడా వున్నవాడు. ఇదివరకు పనిచేసిన ఉద్యోగాలలో సత్ప్రవర్తనకు సంబంధించి మంచి యోగ్యతాపత్రాన్ని పొందాడు. ఈ విషయాలన్నీ పురస్కరించుకొని బోర్డువారు ఇతని నియామకానికి అడ్డుచెప్పరని నా విశ్వాసం. ఈయన సేవలవల్ల ప్రజాసేవకు మేలు కలగగలదని సంపూర్ణంగా తృప్తిచెందాను.

-(సం.) టి. ఫ్రేజర్, కలెక్టర్.

1812 నవంబర్ మాసాంతంలో (అంగీరసనామ సంవత్సరం కార్తీక మాసం) నేను ఒంగోలుకు వెళ్ళాను. అక్కడ, ఆ చుట్టుపట్టలవున్న నా పాత కాలపు స్నేహితులందరినీ దర్శించాను. సుమారు నాలుగునెలలు తరవాత నెల్లూరు తిరిగివచ్చాను. 1812 సెప్టెంబర్‌లో రిడ్డెల్ గారికి నా రాజీనామాలేఖను పంపిన రెండుమూడు రోజుల తర్వాత, నా చెల్లెలి పెనిమిటి నందిగామ భూపిరాజు శ్రీరంగపట్నంలో అంగీరస సంవత్సర భాద్రపద బహుళ సప్తమినాడు చనిపోయినట్లు వాకు సమాచారం అందింది. 1813 ఆరంభంలో, అక్కడున్న కుటుంబ సభ్యులందరినీ వెంటతీసుకొని నెల్లూరు రావలసిందిగా శ్రీరంగపట్నంలో వున్న

నా తల్లిగారికి వ్రాశాను. నేను వ్రాసినట్టుగానే ఆమె, నా జ్ఞాతిసోదరుడు వెంకట కృష్ణయ్య, అతడి భార్య, నా చెల్లెలు వెంటరాగా నెల్లూరు చేరుకొంది. అటు తరవాత కొద్దిరోజులకు నెల్లూరులోని జడ్జి, మేజెస్టేట్ అయిన హగ్‌లార్డ్‌గారి ఆఫీసులో నా తమ్ముడు వెంకటకృష్ణయ్యకు నెలకు 8 వరహాల జీతంమీద ఉద్యోగం సంపాదించాను. అద్దె ఇల్లు తీసుకొని 1813 అంతా ఎటువంటి వొడుదుడుకులూ లేకుండా సుఖంగా మేమంతా కాలక్షేపం చేశాము.

1814 జనవరిలో ఫ్రేజరుగారూ, ఆయన కచ్చేరి సిబ్బంది శింగరాయ కొండలో వున్నప్పుడు నేనూ అక్కడ వున్నాను. ఆ సమయంలో నా శ్రేయోభిలాషి, అత్యంత ఆప్తమిత్రుడు నాగరాజు శేషగిరయ్య నుంచి నాకొక లేఖ వచ్చింది. ఈయన మద్రాసు సదర్ కోర్టులో ట్రాన్స్‌లేటర్‌గా వుండేవారు.

ఆ లేఖలో తాను ఘనతవహించిన చక్రవర్తిగారి సుప్రీమ్‌కోర్టు అనే న్యాయస్థానంలో ఇంటర్‌ప్రిటర్ పదవికి నియుక్తుడనైనానని, పూర్వం సదర్ కోర్టులో తనస్థానం పొందటానికి నాకు అంగీకారమవుతుందా అని అడుగుతూ వ్రాశాడు. నేను వెంటనే ఫ్రేజర్‌గారితో సంప్రదించి, ఆయనకు అంతగా ఇష్టంలేకపోయి నప్పటికీ కష్టపడి ఎట్లానో వొప్పించి హుటాహుటి అంచె బోయీల సాయంతో జనవరి 14న మద్రాసు చేరుకున్నాను. మొట్టమొదట శేషగిరయ్యను చూశాను. ఆయన చాలా సంతోషించాడు. ఆయనతో ఆరాత్రి గడిపాను. కాని మర్నాడు పొద్దుననే నాకు తీవ్రమైన మూర్ఛవంటిది వచ్చి పడిపోయినాను. అందువల్ల నామిత్రుడు శేషగిరయ్య నాకుకొంచెం నెమ్మదికలగగానే వెంటనే నెల్లూరుకు తిరిగివెళ్ళి పూర్తిగా స్వస్థతపొందిన తరవాతనే మద్రాసుకు రావలసిందిగా కోరాడు. నెల్లూరుకు నేనురావడం ఫ్రేజర్‌గారికి చాలా సంతోషాన్నే కలగజేసింది. ఆయన నాకు అదనపు పనినికూడా కల్పించారు. సైదాపూరుజిల్లా అమీనుపని అది. ఈపనికి 25 వరహాల అదనపుజీతం కూడా నాకు ఏర్పాటైంది. ఈవిధంగా నా నెలరాబడి మొత్తం 45 వరహాలకు పెరిగింది. మా అమ్మతోను, ఇతర కుటుంబసభ్యులతోను కలసి నేను సుఖంగా కాలం గడిపాను. నా పూర్వపు యజమానిని అయిన మెక్కెంజీ దొరగారినుంచి ఈ రోజులలో నాకు ఒక జాబువచ్చింది. దాని సకలును ఈకింద పొందుపరుస్తున్నాను.

ఫోర్టు సెయింట్ జార్జ్, 23 ఫిబ్రవరి 1814

సుబ్బారావుకు.

మెక్కెంజీ, సుబ్బారావుకీవిధంగా తెలియజేయడానికి సంతోషిస్తున్నాడు. గుడ్‌హోప్‌అగ్రం నుంచి 13 వ తారీకున, పూర్తిగా బాగుపడిన ఆరోగ్యంతో, భారతదేశంలో ఇదివరలో తానున్న రోజుల్లో ఎప్పుడూలేనంత మంచిఆరోగ్యంతో తాను తిరిగివచ్చాడు.

మెక్కెంజీ ఇక్కడికి రాకతో సుబ్బారావు తన చిరునామాకు వ్రాసిన రెండు ఉత్తరాలు చూసుకున్నాడు. అవి ముందు ఫ్రెంచిద్వీపానికి (Isle of France) అతడికోసం వెళ్ళాయికాని, తాను ఆ సెటిల్‌మెంటును విడిచి గుడ్ హోప్‌అగ్రానికి ప్రయాణమై బయలుదేరడంతో ఆ ఉత్తరాలు మద్రాసుకు తిరిగి వచ్చి తనకుచేరడం జరిగింది.

మొదటి ఉత్తరంలో సుబ్బారావు ఎంతో మర్యాదగా మెక్కెంజీగారిని తను విడిచిపెట్టడంలో తప్పుచేశానన్న విషయం గాఢంగా నమ్ముతున్నట్టు ప్రకటించాడు. అంతేకాక మెక్కెంజీగారి అసంతృప్తికికూడా తాను ఇందువల్ల గురిఅయినట్టుగా భావిస్తున్నట్టు కనపడుతున్నది. ఇందువల్ల అత్తడు పశ్చాత్తాపం చెందుతున్నట్టుకూడా అగపిస్తున్నది. మెక్కెంజీ తన అభిప్రాయాన్ని ఇదివరకే సుబ్బారావుకు వ్యక్తంచేసివున్నందునల్ల, కొత్తగాఇప్పుడు మళ్ళి తిరిగిచెప్పాల్సిన పనిలేదు. తానుచేసిన తప్పేమిటో సుబ్బారావు తెలుసుకొన్నట్టు ఇప్పుడు స్పష్టంగా కనపడుతున్నది కనక, ఇదివరలో మెక్కెంజీ దగ్గర పనిచేసిన రోజుల్లో ప్రతిమొక్క సందర్భంలోనూ, అయనకు అత్యంతము తృప్తికలిగించే విధంగా నేర్పుతో ఉన్నతంగా ఉద్యోగవిధులన్నీ నిర్వహించి వున్నందువల్ల, జరిగిపోయిన విషయాలన్నీ మరచిపోయేందుకు ఇప్పుడు మెక్కెంజీ అంగీకరిస్తున్నాడు. ఇంతేకాక సుబ్బారావు కనక వెంటనే ఇది అందగానే నెల్లూరును వదిలిపెట్టి, వీలైనంత త్వరితగతిని మద్రాసుకు చేరుకొనేటట్లయితే మెక్కెంజీ, ఆలివర్‌గారి సౌజన్యంద్వారా, సుబ్బారావుకు సదర్‌అదాలత్ ట్రాన్స్‌లేటర్‌గా నెలకు 40 వరహాల జీతంమీద పని ఇప్పించగలనని ఆశిస్తున్నాడు. అంతేకాక సాధ్యపడేపక్షంలో తనదగ్గరకూడా పనిఇప్పించే ఉద్దేశ్యంతో వున్నాడు. ఆలివర్‌గారి అభిప్రాయాన్ని బట్టి ఇది జరగవచ్చు. సుబ్బారావు రెండుఉద్యోగాలు

నిర్వహించడంలోని ఉచితానుచితాలను నిర్ణయించిన తరవాతనే, అవకాశాన్నిబట్టి మాత్రమే, ముందుముందు ఈవిషయం సాధ్యపడగలదు.

ఏతా వాతా, చివరకు మెక్కెరెల్ చెప్పదలచుకున్న దేమంటే, సదర్ కోర్టులోని అనువాదపు పని చాలా చాలా బకాయిపడి వున్నందువల్ల, సుబ్బారావు మద్రాసు చేరడానికి ఎంతమాత్రంకూడా ఆలస్యం చేయకూడదు. ఎందుకంటే ముఖ్యంగా ఉద్యోగంలో చేరేముందు అతడు పరీక్షకు నిలవాలి. మెక్కెరెల్‌కు, సుబ్బారావు ఈ పరీక్షలో తప్పకుండా వుత్తీర్ణు డవుతాడనడంలో, ఈ ఉద్యోగాన్ని సజ్ఞాఘ్యంగా నిర్వహిస్తాడనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పైన పేర్కొన్న ఉత్తరానికి, దిగువ పొందుపరచిన సమాధానాన్ని నేను వ్రాశాను.

"నెల్లూరు, 28 ఫిబ్రవరి, 1814.

జాన్ మెక్కెరెల్ 'ఎస్కైర్' గారికి

అయ్యా,

29వ తేదీగల మీ అనుగ్రహ పూర్వకమైన లేఖ చేరింది. హృదయ పూర్వకంగా ఎంతగానో, మీ ఆరోగ్యం చక్కబడినందుకు సంతోషించాను. నా గూర్చి మీరు వ్యక్తంచేసిన దయాదాక్షిణ్యాలకు ఎంతగానో సంతోషపడ్డాను. కాని నా నెల రాబడి ఇటీవల హెచ్చించబడటమూ, నా ఉద్యోగం నాకు చాలా తృప్తికరంగా వుండటమూ, అంతేకాక క్రిందటిసారి నేను మద్రాసు చేరగానే తీవ్రమైన అస్వస్థతకు నేను గురికావడం, వీటన్నిటివల్ల నేను నెల్లూరులోనే ఉండిపోవాలని అభిలషిస్తున్నాను. ఇది నా స్వస్థలం.

ఇదివరలో నా విధి నిర్వహణలో, ప్రవర్తనలో మీకు ఎప్పుడైనా అసంతోషం కలిగించివున్నానేమో, అందుకు చాలా ఆందోళన చెందుతున్నాను. అది ఎంతమాత్రమూ నా ఉద్దేశంకాదు. ఇదివరలో తాము నాయందు చూపిన దయకు ఏనాటికి మీకు కృతజ్ఞుడను. ఏది ఏమైనా సదర్ కోర్టు ట్రాన్స్‌లేటర్ పనికి నేను అంగీకరించలేకపోతున్నందుకు నన్ను క్షమించగలరు. యథార్థం మీకు విన్నవించుకుంటున్నాను. ఇటీవల మద్రాసు వెళ్ళినప్పుడు నాకు తెలిసింది. చాలా స్వల్పమొత్తంతో ఇక్కడ కాలక్షేపం చేయడమే నాకు సౌకర్యంకాని, రాజ

ధానిలో చాలా వెద్దమొత్తమే అయినా లాభం లేడనుకుంటున్నాను. అక్కడ కాపురం చేయడంలో అనివార్యమైన పెద్ద ఖర్చులు తప్పనిసరి కావడమే ఇందుకు కారణం.

తమయొక్క,
(సం.) వి. సుబ్బారావు.

పైన పేర్కొన్న ఉత్తరానికి నా కెటువంటి ప్రత్యుత్తరమూ రాలేదు. దానితో మెక్కెరెల్‌గారూ, ఆలివర్‌గారు, నేను మద్రాసుకు వచ్చే ఆశ వదులుకున్నారని తేల్చుకున్నాను. అటుతరవాత కొద్దిరోజులకే ఫ్రేజర్‌గారు నన్ను సర్వేపల్లి డివిజన్‌కు ఆక్టింగు తాసిల్దారుగా నియామకం గావించారు. ఈ పనికై ప్రత్యేకించి జీతం నిర్ణయించకపోయినా ఆగస్టు, సెప్టెంబరు నెలలకుగాను నాకు నెలకు 50 వరహాలు ముట్టాయి. అంటే హుజూర్ ట్రాన్సలేటరుగా 25 వరహాలు, సైదాపూరు తాలూకా అమీనాగా 25 వరహాలు అన్నమాట. సైదాపూరు తాలూకా తిరిగి జమీందారుకు అప్పగించడం జరిగింది. కాబట్టి అక్టోబరు నెలలో నాకా పని కాస్తా పోయింది. అంతేకాక ఆక్టింగు తాసిల్దారుగిరికూడా నిలిచిపోయింది. ఏమంటే హుజూరు ట్రాన్సలేటర్‌గా కచ్చేరీలో ఎప్పుడూ నేను హాజరుగా వుండవలసి వచ్చేది. ఈ పరిస్థితు లన్నిటివల్లా ట్రాన్సలేటర్‌గా నాకు నెలకు 25 వరహాల జీతం మాత్రమే లభిస్తూ వచ్చింది. నెల్లూరు చాలా ఆరోగ్యప్రదమైన స్థలం కాబట్టి, అక్కడ పెన్నానది ప్రవహించడంబట్టి, దానిని ఆనుకొనే విష్ణుక్షేత్రం, శివక్షేత్రాలు ఉండటంబట్టి, నా శేషనివాసానికై ఇదివరలో నేను చూసిన ప్రాంతా లన్నిటిలోనూ నెల్లూరునే నేను మంచి ప్రాంతంగా ఎంచుకున్నాను. ఈ సంకల్పం తోనే 1814 సెప్టెంబరునెలలో జిల్లాజడ్జిగారైన లార్డుగారి, కలెక్టరుగారైన ఫ్రేజర్ గారి, కోటతాలూకు కమాండింగ్‌ఆఫీసరైన కెప్టెన్ మూర్‌గార్ల అనుమతితో కోటకు తూర్పుదిశగా కొంత నివేశన స్థలం సంపాదించాను. నివాస గృహాన్ని అక్కడ కట్టటానికి ప్రారంభించాను. నాకు, మా కుటుంబానికే కాకుండా తగినంత విశాలంగా, వసతిగా వుండేటట్లు నిర్మాణం ప్రారంభించాను.

1815 మార్చినెలలో కట్టుబడి పూర్తిచేసి, అందులో నేను ప్రవేశించాను.

సదర్ అదాలత్ కోర్టు ట్రాన్సలేటర్ ఉద్యోగం నేను కాదనడంతో ఆలివర్‌గారు, అభ్యర్థులను ఆహ్వానిస్తూ ప్రకటన గావించారు ఆ ఖాళీ నింపటానికి. ఎందరో ఆపనికోసం పరీక్షకు హాజరై నారు. రాజధానిలోనుండే ఎందరోగా,

వారికి కోర్టులో పరీక్ష జరిపారు. 1814 ఏప్రిల్ నెలలో నరసింహాచారి అనే అతన్ని ఆపనిలో నియమించుకొన్నారు. అతడు పనిలోచేరాడు. 1815 ఫిబ్రవరి దాకా అతడా ఉద్యోగంలో వున్నాడు. మద్రాసు కలెక్టరు అతన్ని శిరస్తాదారు పనిలోచేరమని కోరినందువల్ల మళ్ళీ సదర్‌కోర్టు ట్రాన్స్‌లేటర్ ఉద్యోగానికి ఖాళీ ఏర్పడింది. ఈపరిస్థితుల్లో రిజిస్ట్రారైన ఆలివర్‌గారు ఫ్రేజర్‌గారి కొక లేఖ వ్రాశారు. దాని నకలు ఇది.

మద్రాసు, మార్చి 10, 1815.

అత్యంత ప్రియమైన ఫ్రేజర్

కొద్దిరోజుల్లోనే, సదర్‌కోర్టులో మలబారు, జెంటూ (తెలుగు) ట్రాన్స్‌లేటర్ తనపనికి రాజీనామా చేస్తున్నాడు. మీరుకనక సుబ్బారావును పంపటానికి వొప్పుకోకపోతే ఇంకొకరు నాకుదొరకట దుర్లభం. సుబ్బారావును ఇక్కడికి పంపించడం మీవల్లనే కావాలి. అతడి విషయంలో చాలా ఔదార్యం తప్పక నేను కనపరుస్తాను. నేను అతడికి వ్రాయలేదు, ఎందుకంటే, ఇది జరగడమంటూ తటస్థిస్తే మీ ద్వారానే అతడికీ విషయం తెలియడం ఉచితం.

నమ్మకంగా
మీ
(సం) ఆలివర్.

పైన పేర్కొన్న ఉత్తరం, కోటలో నాతోను, కొంత కచ్చేరిసిబ్బంది తోను, సంచారార్థం విడిదిచేసిఉన్న ఫ్రేజర్‌గారి ఎప్పుడైతే అందిందో, ఈ ఉద్యోగాన్ని అంగీకరిస్తావా ? అని నన్ను వారు అడిగారు. వారు మొట్టమొదటి సారే అడిగినప్పుడు, నేను నా అసమ్మతినే రెండోసారికూడా వ్యక్తంచేయవలసి వచ్చింది.

ఎందుకంటే మద్రాసు వాతావరణం నాకు నచ్చలేదు. దీనికితోడుగా నెల్లూరులో నేను అంచమైన ఇల్లు కట్టుకున్నాను. అందులోనే స్థిరంగా ఉండి పోవాలని కోరుకుంటున్నాను. కాని ఫ్రేజర్‌గారు, ఆలివర్‌గారికి అత్యంతా ప్ర మిత్రుడు కావటంవల్ల, నన్ను ఎంతగానో వొత్తిడి చేశారు, ఈ ఉద్యోగంలో చేరటానికి అంగీకరించమని. విధిలేక నేను చివరకు అంగీకరించవలసి వచ్చింది.

నన్ను అంగీకరింపజేసిన తరవాత, ఫ్రేజర్‌గారు ఆలివర్‌గారికి ఈ విధంగా లేఖ వ్రాశారు.

కోట, మార్చి 14, 1815

ప్రియమైన ఆలివర్,

సుబ్బారావుకు సంబంధించిన మీ ఉత్తరానికి సమాధానంగా నేను గట్టిగా, అతణ్ణి ఈ ఉద్యోగానికి వొప్పుకొమ్మని నొక్కిచెప్పాను. అయితే ఈ మధ్యనే అతడిక్కడ చక్కటి ఇల్లు కట్టుకొన్నాడు. అతడికిక్కడ సర్వ సౌకర్యాలు లభిస్తున్నాయి. అందువల్ల అతడు వెంటనే అంగీకరించలేదు. నేను ఆ విధంగా అతడంటాడని అనుకోలేదు. అతడి నెల రాబడి ఇక్కడ 25 వరహాలే. ఇట్లా కాదని, భవిష్యత్తులో అతడు పొందబోయే ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని చూడవలసిందని గట్టిగా నొక్కి చెప్పడంతో అతడు బయలుదేరుతున్నాడు. 8 రోజులలో అక్కడి కాయన చేరుకోగలడు. అతణ్ణి అక్కడే మీరు ఖాయంగా నిలుపుకోగలరని అనుకుంటున్నాను. అతడైతే ఇక్కడి అతని ఖాళీని నింపవద్దనీ మీ దగ్గర స్థిరంగా కుదురుకున్నదాకా, ఆ ఖాళీని అట్లానే ఉంచవనసిందనీ గట్టిగా కోరడంవల్ల నేనూ అంగీకరించాను. ఇతడితో ఉద్యోగం భర్తీచేయడం ఆపక పోయినట్లయితే లార్డు ఆఫీసులో చిన్నవాడైన బ్రాహ్మణుడొకడున్నాడు. అతడు మద్రాసులోనే పెరిగినవాడు కావటంవల్ల, లార్డు, అతణ్ణి వదులుకోవటానికి ఇష్ట పడితే, సుబ్బారావులాగానే ఇతడుకూడా ఇంగ్లీషు బాగా అర్థం చేసుకోగలడు. అంతేకాక ఇతడు పర్షియన్, హిందూస్థానీలలో సుబ్బారావుకన్నా ప్రజ్ఞగలవాడు. కాని మీకు ఇప్పుడు కావలసిన ఇతర భాషల విషయంగా సుబ్బారావే ప్రజ్ఞావంతుడు.

సుబ్బారావును వదలిపెట్టుకోవడం నాకెంతమాత్రమూ సౌకర్యంకాదు. అయితే మీకు అవసరమైనంతగా అతడు నాకిక్కడ అవసరంలేదు. అంతేకాక అతడికి లాభించే విషయకంగా చూసినా, మీ ఆఫీసులో కొంతకాలం విశ్వాస పాత్రుడుగా అతడు పనిచేస్తే, అతడిస్థానంలో తగిన అభ్యర్థిని సంపాదించుకొని అతడు ఇంకా మంచి ఉన్నతమైన స్థానాన్ని పొందడంలో సాయపడగలను. ఇతడికి పూర్వం ఇదేఉద్యోగం చేసినప్పుళ్ళ విషయంలో ఇదే జరిగించికదా,

"ఏమంటారా. అతడంటున్నాడు, మద్రాసులో నెలకు 40 వరహాల జీతం, నెల్లూరులో 25 వరహాల జీతంకన్నా ఏమాత్రం చెప్పుకోదగినది కానేకాదు.

ఉంటాను

మీ నమ్మకంగా

(సం) టి. ఫ్రేజర్.

1815 ఏప్రిల్ 1వ తేది నేను నెల్లూరు వదిలిపెట్టి 4వ తేది సాయంకాలం మద్రాసులో ప్రవేశించాను. నాప్రయాణంలో తమిళం మున్షీని కుదుర్చుకొని అతడి సహాయంతో పూర్వమెప్పుడో వదిలిపెట్టిన తమిళం నేర్చుకోవడం మళ్ళీ ప్రారంభించాను. అనెల 5వ తేదిన నాపూర్వపు యజమాని అయిన మిస్టర్ మెక్కెరెల్‌ను, అటు తరవాత మిస్టర్ ఆలివర్‌ను కలుసుకున్నాను. 1815 ఏప్రిల్ 6వ తేది సదర్‌కోర్టులో, బహిరంగంగా నాచేత పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. ట్రాన్సలేటరూ, ఇంటర్‌ప్రిటరుగా నేను చార్జి తీసుకున్నాను. నాజీతం 40 వరహాలేకాని, నామేలుకోరి నాకీ ఉపకారంచేసిన ఆలివర్‌గారు నాజీతం పెంచటానికి వాగ్దానంచేశారు. చాకలిపేటలో తంజావూరు రంగయ్య నాయకులవారి స్త్రీకానికెదురుగావున్న ఒక ఇంట్లో నేనుండేవాడిని. ఆఫీసులో ప్రవేశించగానే పని చాలాచాలా పేరుకొనిపోయి వుండటం నేను చూశాను. ఆ బకాయి పడినపని అంతా నేను పూర్తిచేయాలనే ఉద్దేశంతోనే నన్ను నియమించారు. అది చాలా కష్టసాధ్యమని నాకనిపించింది. ముఖ్యంగా నాకు క్రింది ఉద్యోగిగాని, సహాయకుడుగాని, కనీసం లేక్‌రిగాని, ఎవరూలేరు. ఒక సంవత్సరమంతా నిర్విరామంగా పనిచేయవలసి వచ్చింది -ఆ బకాయిపడినపని అంతా ఒక కొలిక్కి తేవడానికి!

1815 ఆగస్టులో నాభార్య తన అవ్వగారితో శ్రీరంగపట్నం నుంచి మద్రాసు వచ్చింది. మద్రాసుకు దగ్గరగానేవున్న పెంగవూరులో మాకు పునస్సంధానం జరిగింది. అటు తరవాత నవంబరులో ఆమెతలిదండ్రులను చూడటానికి శ్రీరంగపట్నం వెళ్ళింది. 1816 మార్చిలో, యువనామ సంవత్సర ఫాల్గుణ శుద్ధత్రయోదశి, ఆమె మృతిచెందినట్లు నాకు విచారకర మైనవార్త చేరింది. మద్రాసులోనే ఆమె అపరకర్మలు నిర్వర్తించాను. ఈవిపరీత దుఃఖంతో, మనోవ్యాధితో నేను కొన్నాళ్ళుమంచం పట్టాను. తరవాత మేనెల అనుకుంటాను,

ధాత సంవత్సర వైశాఖ బహుళపాడ్యమి, నాపిన్రియమాత, వెంకమ్మగారు నెల్లూరులో మరణించింది. నాఅదృష్టదశాత్తూ నేనారోజు నెల్లూరులో వున్నాను. అంతకుపూర్వమే మాఅమ్మ జబ్బునుగూర్చి నాకు మద్రాసులో తెలిసింది. అందువల్ల నేను నెల్లూరు చేరుకోగలిగాను. నెల్లూరులో మాఅమ్మకు కర్మలవీచేసి, ఓంగోలుకు సమీపగ్రామం కొనిజేడుకు వెళ్ళాను. ధాతనామ సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ సప్తమినాడు రాయసం సీతారామయ్యగారి కనిష్ఠపుత్రికతో నాకు తృతీయ వివాహం జరిగింది. తరవాత మద్రాసువచ్చి ఆఫీసుపనిలో ప్రవేశించాను.

1817 జనవరి 13 తేదిన సదర్అదాలత్ కోర్టువారు ప్రభుత్వం వారికి నాజీతం పెంచలసిందిగా సిఫార్సుచేస్తూ పత్రాలుదాఖలుచేశారు. దీనికథలు ఈవిధంగావుంది.

1817 జనవరి 31 వ తేదితో సదర్ అదాలత్ వారి ప్రొసీడింగ్సులోనుంచి సముద్ధృతం.

సదర్ అదాలత్ వారి జనవరి31, 1817 ప్రొసీడింగ్సులో నుంచి తమిళం, తెలుగు, కన్నడ భాషలకు ట్రాన్స్లేటరూ, ఇంటర్ ప్రిటరూ అయిన వెన్నెలకంటి సుబ్బారావు ఈదరఖాస్తునుకలిపి చదవండి.

1817 వ సం రిజిస్టరులో కోర్టువారు దాఖలుచేసుకొన్న లెటరు నెం.108.

విలియం ఆలివర్ ఎస్క్వార్గారికి రిజిస్ట్రార్ టుది కోర్ట్ ఆఫ్ సదర్ అండ్ ఫౌజుదారి అదాలత్ కోర్టుట్రాన్స్లేటరూ, ఇంటర్ ప్రిటరూ అయిన వి.సుబ్బారావు వినయపూర్వకమైన విజ్ఞాపనము:

అత్యంత విధేయపూర్వకముగా కనపరచునది ఏమంటే, మీదరఖాస్తుదారు అత్యంత వినయపూర్వకముగా ఈవిషయములు తమదృష్టికి తీసుకొని వచ్చుటకు అనుజ్ఞ వేడుకుంటున్నాడు.

ఈపనిలో ఏనాటినుంచి ఈదరఖాస్తుదారు నియుక్తుడైవున్నాడో, ఆనాటి నుంచీ ఈ ఉద్యోగపు నెలసరి జీతం చాలాతక్కువ కావడంతో అనేకమైన ఇబ్బందులకు గురిఅయినాడు. ట్రాన్సలేషన్ డిపార్టు మెంటులో అతిముఖ్యమైన పనులను నిర్వహించడంలో అగుసిత్యం ఎంతటి అధికమైనశ్రమ ఎదురవ్వతుందో

తమకు తెలియనిదికాదు. గడచిన కొన్ని సంవత్సరాలుగా బాయిపడిన తర్జుమాపనిని దరఖాస్తు దారుడు ఎంతటి శ్రమకోర్చి నిర్వహించి నాడో మీరు ఎరుగుదురు. మీదరఖాస్తు దారుడు అత్యంత వినయపూర్వకంగా ఈవిషయం మీదృష్టికి తీసుకొని రావడానికి అనుజ్ఞ వేడుకుంటున్నాడు. సుప్రీమ్‌కోర్టులోని ట్రాన్సలేటరూ, ఇంటర్‌ప్రిటరూ అయిన ఉద్యోగికి, అమాంబాపతు ఇతర ఫీజులసంగతి అట్టావుంచి, నెలకు స్థిరమైన వేతనం, మీదరఖాస్తుదారుని వేతనం కన్నా చెప్పుకోతగినంత అధికమే, అయితే ఆ ఉద్యోగికి విధి నిర్వహణలోని శ్రమఅంత ఎక్కువేమీకాదు. పోలికగల ఇతర ఉద్యోగాల శ్రమతో తూచిచూస్తే, రాజధానిలో ఇతరత్రా కోర్టులోను, ఆఫీసులలోనూ ఇంటర్‌ప్రిటర్లకూ, మేనేజర్లకిచ్చే వేతనంకూడా దరఖాస్తుదారునికిచ్చే జీతంకన్నా ఎక్కువే.

కాబట్టి మీదరఖాస్తుదారుడు ఏలినవారి చిత్తానికితెచ్చేదేమంటే, నాఅర్జీని పూర్తిగాలోతుగా పరిశీలించి, అర్జీదారుడు కోర్టుసంబంధమైన విన్నపములు, వివిధరకాల అర్జీలు, ఇతరపత్రాలు వివిధభాషలలో కోర్టువారికి దాఖాలుచేసిన వాటిని తర్జుమాచేయవలసి రావటంలో అతని గురుతరమైన బాధ్యతను గుర్తించి, ఇంకా కోర్టువారు పరిష్కరించి జారీచేసిన డిక్రీలు, ఇతర ఆజ్ఞాపనలు మొదలై నవాటి తర్జుమా విషయాన్నిగూడా పరిశీలించి, దయతో, అనుగ్రహంతో, అతడి జీతం విషయంలో పెంపుదలకు న్యాయాధీశులు పరిశీలించేందుకుగాను సిఫార్సు చేయవలసిందిగాను, దయాపూర్వకమైన మానవత్వపు ఉపకారానికి సర్వదా బద్ధుడై అర్జీదారుడు, ఎల్లప్పుడూ మిమ్మల్ని ప్రార్థిస్తున్నాడు.

(సం) వి. సుబ్బారావు,
ట్రాన్సలేటరూ, ఇంటర్‌ప్రిటరన్నా.
ఫోర్ట్ సెయింట్‌జార్జి,
కోర్టు ఆఫ్ సదర్ అదాలత్,
2, జనవరి 1817.

కోర్టువారు పైన పేర్కొన్న అర్జీని, ఘనతవహించిన గవర్నరుగారికి కౌన్సిలులోఅయనఅనుకూలమైనఉత్తరువులకోసం సమర్పించడానికితీర్మానించారు.

అర్జీదారుడైన సుబ్బారావు, వెనక పనిచేసిన తర్జుమాదారు నరసింహాచారి తరవాత 1815 ఏప్రిల్ 1 తేదిన పనిలో ప్రవేశించాడు. ఆరోజునుంచికూడా

విరామమెరుగని పరిశ్రమతో, తన ఉద్యోగపు విధులన్నిటినీ నిర్వహించుకుంటూ వస్తున్నాడు.

ఉద్యోగ విధులలో ఆయన ప్రవేశించగానే, పని ఎంతో బకాయిపడిన వైనంఆయన గ్రహించి, ఆపని అంతా పరిష్కరించాడు. అయినప్పటికీ అనుదినం నిర్వహించవలసిన తర్జుమా వ్యవహారాన్ని ఏమాత్రమూ ఆయన వెనక్కు నెట్టలేదు. ఏరోజు కాగితాలు ఆరోజు కోర్టువారికి అందిస్తూవచ్చాడు. దిగువ చూపిన పనివివరాల పట్టికద్వారా శ్రమించి పనిచేసే ప్రభుత్వోద్యోగి నిర్వహించిన మొత్తంపని తెలియచేస్తున్నది. దీనినిబట్టి ఆయన యోగ్యతలెటువంటివో విశదపడగలవు.

అప్పీలు కాజుల రెగ్యులర్ ప్లీడింగ్స్		50
మనవి అర్జీలు, చిల్లర పిటీషనులు		
1811, 1812, 1813 స్నూ, 1814 తాలూకు బకాయిలు		100
,, 1815 వి		125
,, 1816 వి		33
		318
పిటీషనుల తాలూకు అనుబంధ పత్రాలు		600
		918
డిక్రీలు 1815 లో		24
1816 లో		25
		49
ఆజ్ఞాపనలు 1815, 1816 సంవత్సరాలలో		200
మొత్తం		1,217

ఈ ఆర్జీలు (పిటీషనులు), అనుబంధ పత్రాలు (ఎన్‌క్లోజర్స్) చాలావరకు 15 మంచి 20 పుటల ఫూల్‌స్కేప్ టావుల పరిమితితో వున్నాయి. 15 పేజీల లోపున వున్నవి చాలాతక్కువ.

నిర్దుష్టమైనను సుడికారంతో కూడిన వి. సుబ్బారావు ఇంగ్లీషు భాషాపరిజ్ఞానానికి, పైన పేర్కొన్న విజ్ఞాపనం మచ్చుతునక వంటిది. ఆయన తర్జుమాలన్నీ కూడా అదేశైలిలో వుంటాయి. నిరంతరమూ భాషాపరివర్తన కోసం వి. సుబ్బారావు సర్వసంసిద్ధుడుగా వుండటమూ, అతడు అసాధారణ ప్రతిభావంతుడు కావడమూ కోర్టువారు గ్రహించారు.

కోర్టువారు తమ తర్జుమాదారుని నిరంతరోత్సాహము, సామర్థ్యము గుర్తిస్తూ, అతడి అర్హతకు తగిన పురస్కారం అతడికి తప్పక లభించవలెనని తహతహతో వున్నారు. ఇతడు చేస్తున్న ఉద్యోగంకన్నా అప్రధానమైనవీ, ఇంత శ్రమలేనివీ అయినయితర ప్రభుత్వోద్యోగాలు చేసేవారి రాబడితోపోల్చి చూసినప్పుడు, ఇతని వేతనం చాలా స్వల్పమేనని కోర్టువారు అభిప్రాయపడుతున్నారు.

గవర్నమెంటువారి అజమాయిషీలోని సివిల్, క్రిమినల్ అధికారాలలో సర్వోన్నతమైన కోర్టులో అత్యంత సమర్థుడైన తర్జుమాదారు ప్రాముఖ్యమూ, ఆ ఉద్యోగంలో ఇప్పుడు పనిచేస్తున్న వ్యక్తి నిరుపమానమైన యోగ్యత, ఆయన జీతం 80 వరహాలకు పెంచవలసిన ఆవశ్యకత, ఘనత వహించిన గవర్నరుగారి కౌన్సిలుదృష్టికి తీసుకొనిరావడమూ, ఇందుమూలమైనతమ హృదయపూర్వకమైన సిఫార్సుచేయడమూ, కోర్టువారు తమ బాధ్యతగా భావిస్తున్నారు. ఈమొత్తమైనా ఆయన అర్హతలకు ఎంతమాత్రమూ మించినది కాదని భావిస్తున్నాము. ఆయనకు ఇవ్వదగినంత ఇవ్వడమేనని మాభావన. ఈజీతం విశ్వాసపాత్రుడు, సమర్థుడు, నేర్పరి అయిన దేశీయుడు, గౌరవార్హమైన ప్రముఖమైన అధికారస్థానంలో పొందవలసిన దానికి మించిన జీతమేమీకాదు అనిభావిస్తున్నాము.

పైన పేర్కొన్న అర్జీని, ఇది అమలుచేయడానికి కావలసిన చర్యలాగితాలను ప్రభుత్వ న్యాయశాఖవారిసెక్రెటరీకి, కౌన్సిలులో రైటానరబల్ గవర్నరుగారిముందుంచడానికి ఆజ్ఞ జారీచేయడమైనది.

(సరిఅయిన నకలు) (సం) ఆర్. క్లార్క్ డిప్యూటి రిజిస్ట్రార్

పైన పేర్కొన్న చర్యపత్రాలకు సమాధానంగా గవర్నమెంటువారు దిగువ ఉదాహరించిన నెం. 151, 1817 సంవత్సరం పత్రం, జారీ చేసినారు-

అయ్యా,

సదర్, ఫౌజుదారీ అదాలత్‌కోర్టువారి తమిళ, తెలుగు, కన్నడ భాషల ట్రాన్సలేటరూ, ఇంటర్ ప్రిటరూ అయిన వి.సుబ్బారావుకు సంబంధించిన జీతం హెచ్చింపు దరఖాస్తుతో జతచేసి, మీరు పంపిన 31వ తేది లేఖ మాకు అందిన సమాచారం మీకు తెలుపటానికి నేను ఆదేశితుడనైనాను. సదర్‌అదాలత్ అర్జీదారుని విన్నపం విషయమై మీరు గట్టిగా వాంఛించినవిషయాన్ని పరిశీలించి కోర్టువారు సిఫార్సు చేసినట్లుగా నెలకు 80 వరహాల మొత్తంగా అయన జీతాన్ని పెంచటానికి గవర్నరుగారి కౌన్సిలువారు తీర్మానించినారు.

అయ్యా, మీయొక్క అత్యంత విధేయ సేవకుడిగా గౌరవాభ్యర్థన గలిగిన

(సం.) డి. హిల్
ప్రభుత్వ సెక్రెటరీ

ఫోర్ట్ సెయింట్ జార్జి
ఫిబ్రవరి 3, 1817

పైవిధంగా మంజూరైనందువల్ల నాకు 1817, ఫిబ్రవరి 3వ తేది నుంచి 80 వరహాల జీతం యిచ్చారు.

1817 మేనెలలో, నేను సెలవు సంపాదించుకొని, కొనిజేడుకు ప్రయాణమైనాను. నాభార్యను అమె తల్లిదండ్రులతో మద్రాసుకు తీసుకొనివచ్చాను. ట్రిప్లికేనులో అక్టోబరులో ఆమె కాపరానికివచ్చే శుభకార్యం జరిపించారు. నాభార్య అప్పటికి వ్యక్తురాలైంది.

నాతమ్ముడు వెంకటకృష్ణయ్య తనకుటుంబంతో మద్రాసువచ్చి నాతో కొన్ని నెలలపాటున్నాడు. ఇంకో సోదరుడు భద్రయ్య (1813) లోమాఅమ్మ, ఇంకాఇతరులూ నెల్లూరుబయలుదేరివచ్చినప్పుడు, ఇతడు శ్రీరంగపట్నంలోనే నిలిచిపోయినాడు) శ్రీరంగపట్నం వదిలి 1814 లో నెల్లూరుచేరుకున్నాడు. 1815కో మద్రాసు వచ్చాడు. నాసిఫార్సువల్ల మెక్కెంరెల్‌గారు ఇతణ్ణి 1817లో నెలకు 5 వరహాల జీతంమీద ఇంగ్లీషు రైటరుపనిలో కుదిర్చారు.ఆప్పటివరకూ అతణ్ణి కాలేజిలో చేర్పించి, ఇంగ్లీషు చదివించాను. 1818లో భద్రయ్యకు ప్రమాదకరమైన జబ్బుచేసింది. ఒళ్ళంతా నొప్పులూ, జ్వరంతో నెలల తరబడి అతడట్లానే వున్నాడు. 1818 చివరి రోజులలో అతడి వ్యాధి ఎంత ప్రబలిందంటే, ఇక అతడి ఆశ వదులు కోవడంకూడా జరిగింది. ఇంతకాలం ఉద్యోగంలో

సెలవుపెట్టివుండడంవల్ల, ఆప్రభుత్వోద్యోగంకూడా పోయింది. వైద్యసలహానను సరించి ఆతణ్ణి నెల్లూరుకు పంపించవలసిన అగత్యం ఏర్పడింది. అతడికీ, కుటుంబానికీ పోషణార్థంక్రింద నెలకు 7 రూపాయలు, నేను నివువచేసుకున్న సొమ్మునుంచి అందే ఏర్పాటు చేశాను (ఈమొత్తం భూమిరూపంగా మార్పుచెందింది). అతడు, చెల్లెలు, అతని భార్య, నేను ఏర్పాటుచేసిన సొమ్ముతో అప్పటినుంచి వేరుగా వుంటూ వచ్చారు.

పెత్తండ్రిగారికి పెంపుడిచ్చిన పాతమ్మాడు వెంకటకృష్ణయ్య, భార్య గర్భవతి అయి పురిటికి నెల్లూరు వెళ్ళవలసి వచ్చింది. 1818 డిసెంబరులో పురిటినొప్పులవల్ల ఆమె మరణించినదన్న సంగతి నాకు తెలియవచ్చింది. బహుధాన్య సంవత్సరం కార్తిక శుద్ధ విదియనాడు ఆమె మరణించింది. 1819 మే నెలలో నేను నెల్లూరు వెళ్ళి వెంకటకృష్ణయ్యకు మళ్ళీ వివాహం జరిపించాను. కామరాజు అనంతయ్యగారి కుమార్తె వధువు. ఈపెళ్ళికి నాకు పెమ్మిరూపాయల పైగానే ఖర్చయింది.

1819 ప్రారంభంలో ఉదయగిరి వెంకటరమణయ్య పురఫ్ అప్పాస్వామి, మద్రాసు సుప్రీంకోర్టులో తమిళ, తెలుగు భాషల్లో ఇంటర్ ప్రిటర్‌గావుండేవారు, చనిపోయినారు. అప్పుడాపనిలో నన్ను ప్రవేశించమని అభ్యర్థించారు కాని ఆరోజుల్లో నన్ను విడువకుండా పట్టిపీడిస్తున్న అనారోగ్యమూ, మాటిమాటికి నెల్లూరు, ఒంగోలు వర్తించవలసిన తప్పనిసరి పరిస్థితులు-ఈ అవకాశం నేను నిరాకరించటానికే ప్రేరేపించినవి. అందువల్ల మా బంధువైన వీనుగుల వీరాస్వామయ్యను, అన్నివిధాల అర్హుడైన ఇంటర్‌ప్రిటర్‌గా నేను సిఫార్సుచేశాను. అందుకనుగుణంగా ఆతని విద్యాయోగ్యతలను పరీక్షించిన తరవాతనే అయినా, ఆయన నియామకం జరిగింది.

1819 సెప్టెంబరులో చాలా ముఖ్యమైన క్రిమినల్ కేసు ఒకటి సుప్రీం కోర్టులో విచారణకు వచ్చింది. ఇందులో కవ్వడం డాక్యుమెంట్లకు, సాక్ష్యులకు సంబంధించినపని వచ్చింది. అందువల్ల హానరబిల్ కోర్టువారు ఆ విషయాల సంబంధంగా నన్ను ఇంటర్‌ప్రిట్ చేయవలసిందిగాకోరారు. గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తి సర్ జాన్ హెచ్. న్యూబోల్ట్ కె. టి. దిగువ కనపరచిన పత్రాన్ని దాఖలు చేయవలసిందిగా సలహానిచ్చారు. సదర్ అదాలత్

కోర్టువారి అనుమతినిముందుగా పొందిన తరవాతనే, వారు కోరినట్లుగా నేనాతేళి దాఖలు చేశాను.

దివానరబిల్ సర్ జాన్ న్యూబోల్ట్, కె.టి.
సుప్రీమ్‌కోర్టు ప్రధాన న్యాయాధిపతి, మద్రాసు న్యాయశాఖ వారికి-

మైలార్డ్,

ఘనమైన మీకోర్టువారికి అప్పుడప్పుడు, కన్నడం, లేదా మహారాష్ట్రానికి మాత్రమే సంబంధులైన సాక్షులకు, పార్టీలకూ, వ్యక్తులకు సంబంధించిన కేసులలో ప్రొసీడింగ్సులో మీకు కాలయాపనము, కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలిసి (ఈ రెండు భాషలకుచెందిన చాలాపని మీ ఆజమాయిషి క్రిందవున్నది) ఈభాషలకు సంబంధించి ప్రస్తుతం మీకు ఇంటర్ ప్రిటర్ లేని విషయం తెలుసుకొని, ఈ రెండు భాషలలో ఇంటర్ ప్రిటర్‌గా తగిన అర్హతలు నాకున్నాయని నాఅభ్యర్థిత్వాన్ని ఈపని నిమిత్తం విన్నవించుకుంటున్నాను. ఇందులో కన్నడభాషకు సంబంధించి నేను తర్జుమాలుకూడా నిర్వహించగలను. కోర్టువారికి అర్హమని తోచిన ప్రతిఫలం నిర్ణయించి నన్ను ఇంటర్ ప్రిటర్‌గాను, ట్రాన్స్‌లేటర్‌గాను సిఫార్సు చేయమని మిమ్ములను ప్రార్థిస్తున్నాను.

ఇంతకుపూర్వం జుడిషియల్, రెవెన్యూడిపార్టు మెంటులలో కనరా ప్రాంతంలో చాలా సంవత్సరాలు నేను ఉద్యోగిగాపని చేశాను, ఘనత వహించిన మీకోర్టువారికి సంతృప్తి నివ్వగల యోగ్యతాపత్రాలు, నాఅర్హతలు గుణగణాలు తెల్పేవి, నేను మీకు నివేదించగలను.

ప్రభువులవారియొక్క మిక్కిలి విశ్వాస పాత్రుడు, వినయ విధేయతలు గల సేవకుడు అనే గౌరవార్హత వహించియున్న,

మద్రాసు — మీ
30 సెప్టెంబరు 1819. — (సం.) వి. సుబ్బారావు.

పూర్వోదాహృతమైనలేఖ, సదర్ కోర్టు డిప్యూటీ రిజిస్ట్రార్ రిచర్డ్ క్లార్క్‌గారు సర్ జాన్ న్యూబోల్ట్‌గారికి వ్రాసినలేఖతోపాటు జతచేసి పంపించటం జరిగింది. క్లార్క్‌గారి లేఖకు నకలు ఈ క్రింద పొందుపరుస్తున్నాను.

మైడియర్ సర్‌జాన్,

ఇక్కడి ట్రాన్సులేటరూ, ఇంటర్‌ప్రిటరూ అయిన నా స్నేహితుడు వి. సుబ్బారావు కోరికపైన, మీ కోర్టులో కన్నడ మహారాష్ట్ర భాషలలో ఆయనను నియామకం చేయగలందులకుగాను, ఆయన దరఖాస్తును జతచేసి పంపిస్తున్నాను, అతని అనితరసాధారణమైన యోగ్యతను మీరు విశ్వసించవచ్చు. నాకు తెలిసినంత వరకూ నిర్దుష్టంగానూ, నుడికారసహితంగానూ తర్జుమాచేయడంలో, త్వరితంగా చేయడంలో, ఇతనిని మించినవారు నాకు కనిపించలేదు. అంతేకాదు. సర్వదా సంసిద్ధంగా, ఆనందంగా, మీకెప్పుడైనా అవసరం కలిగినప్పుడు, సుప్రీమ్‌కోర్టులో తమిళ, తెలుగు, హిందూస్థానీ ఇంటర్‌ప్రిటర్ ఎవరైనా హాజరుకాలేకపోయిన సందర్భంలో సహకారాన్ని అందించగలడు. కాని ఈవిషయంగా తప్పనిసరిగా స్పష్టంగా వాగ్దానపూర్వకంగా ప్రకటించలేదు. ఎందువల్లనంటే మీరు కోరినప్పుడు అదేసమయంలో అతడికి ఇక్కడి విధినిర్వహణ తటస్థించవచ్చు. అందువల్ల సుప్రీమ్‌కోర్టు, సదర్ కోర్టులకు పోటీరాకుండా వుండాలని అభిలషించడంలోని ఔచిత్యం మీరు అంగీకరిస్తారనుకుంటాను. ఇప్పటి న్యాయమూర్తుల పదవీకాలంలో ఇది సంభవించక పోవచ్చునేమోకాని, భవిష్యత్తులో నాప్రియమిత్రుడు ఇద్దరు యజమానులను సేవించవలసిన పక్షంలో అటువంటి ఘర్షణకు అవకాశంలేకపోలేదు. అయితే సుప్రీమ్‌కోర్టులో కన్నడం ట్రాన్సులేటర్ నియామకానికి గవర్నమెంటువారు అంగీకరించి, ఆపదవికి స్థిరవేతనం నిర్ణయిస్తే, కోర్టువారికి ఇంతకన్నా అర్హతముడైన, ప్రజ్ఞాశాలి అయిన, సర్వదాసహకరించే వ్యక్తిమాత్రం దొరకడనటంలో నాకుఎంతమాత్రమూ సందేహంలేదు. ఇక్కడి అతడిపనికి, కన్నడం ఇంటర్‌ప్రిటర్‌గా మీ కోర్టులో పనికి ఏమాత్రమూ అడ్డురాదు. కాని ఇతరభాషలకుకూడా ప్రాతినిధ్యం వహించి పనిచూడవలసివస్తే అటువంటి అవకాశాలు ఏర్పడే అవకాశంవుంది. అందువల్ల అవసరం పడినప్పుడుమాత్రమే ఆయనచేత పని చేయించుకోవడం బాగు. ఈ మధ్యనే ఆయన జీతం కోర్టువారు దెట్టింపు చేయడంవల్ల, ఇక్కడి ఆఫీసు పనుబడ్డాయ్, మీరు కోరినప్పుడల్లా ఆయన హాజరుకాకీగా ఉండటం సంగతం కాదేమో.

ప్రియమైన సర్‌జాన్, మీయొక్క అత్యంత విశ్వాసపాత్రుడైన,

30 సెప్టెంబర్ 1313 (సం.) ఆర్. క్లార్క్.

ఇప్పుడిక సుప్రీంకోర్టువారు నెలకు 1౯ వరహాల జీతంమీద కస్నడ, మరాటా ఇంటర్‌ప్రిటర్‌గా నన్ను నియమించవంసిందని గవర్నమెంటువారికి సిఫార్సు చేశారు. గవర్నమెంటువారు సమ్మతించడంతో 1819 అక్టోబరు 4వ తేదీన ఈ నియామకం జరిగింది. ఆ రోజునుంచీ సదర్, సుప్రీమ్ కోర్టులలో కలిపి నా నెల జీతం 95 వరహాలైంది.

అత్యంత ప్రేమాస్పదురాలైన మా అమ్మ చనిపోయిన సరిగ్గా నాలుగు సంవత్సరాలకు, ఆమె తల్లి అంటే మా అమ్మమ్మ ఆదెమ్మగారు, ట్రిప్లికేన్‌లో విక్రమనామ సంవత్సర వైశాఖ బహుళ పాడ్యమినాడు మరణించింది. అక్కడే వేములపాటి ఉద్దండప్ప ఆమె అపర కర్మలన్నీ నిర్వహించాడు. దీనికోసం అయిన సమస్తమైన ఖర్చు నేనే భరించాను.

1821 ఫిబ్రవరిలో నేను సెలవుతీసుకొని, నా భార్య తమ్ముడు కోటీశ్వరం పెళ్ళి చేయడానికిగాను కొనిజేడు బయలుదేరివెళ్ళాను. ఈ పెళ్ళికి నాకు రు. 800 లకు పైగానే ఖర్చయింది. ఈ పెళ్ళి జరిపించిన తర్వాత నా పాతకాలపు స్నేహితు లందరినీ చూడటానికి, గుంటూరు మీదుగా మచిలీపట్నం వెళ్ళాను. ఈ ప్రయాణం దారిలో గుత్తికొండ అనే చోటికి వెళ్ళి, కొండలోపల చీకటి గుయ్యారంగావున్న బిలాన్ని దర్శించాను. అందులోకి వెళ్ళి విశేషం చూశాను. ఆ బిలంలోకి పోవడానికి నేను చాలా శ్రమ పడవలసి వచ్చింది. కాగడాల వెలుతురు సహాయంతో అత్యద్భుతమైన ఈ గుహలో ప్రవేశించాను. కొండ లోపల ప్రవహిస్తున్న వొక నది అక్కడ కొలనుగా ఏర్పడింది. ఆ కొలనులో స్నానం చేసిన తరువాత గుంటూరు వెళ్ళాను. అక్కడ ఉన్న మా బంధువు లందరినీ చూశాను. అక్కడనుంచి మచిలీపట్నం బయలుదేరి వెళ్ళాను. మచిలీపట్నంలో తొమ్మిది రోజులు గడిపాను. స్నేహితులంతా విందులకు, వినోదాలకు, సాని మేళాలకు నన్ను ఆహ్వానించారు. 1821 ఏప్రిల్ 26వ తేదీన నేను తిరిగి మద్రాసు చేరుకున్నాను.

ఇంతకుముందు భూమి రూపకంగా మా తండ్రిగారు నాకు ఆస్తి ఏమీ ఇవ్వకపోయినందువల్ల, నెల్లూరు జిల్లాలో కొంత భూమిరూపకమైన ఆస్తి సంపాదించాలన్న కోరిక నాకుకలిగింది. ఇందుకు తగినట్లు మద్రాసునుంచి, నెల్లూరులో వున్న నా తమ్ముడు వెంకటకృష్ణయ్యకు 1820 ప్రారంభంలో, తగిన సందర్భం

వచ్చినప్పుడు నాకు తెలియజేయవలసిందిగా నేను వ్రాశాను. ఆ సంవత్సరం ఏప్రిల్‌లో 27 గొర్రుల మాగాణి, మెట్ట భూములు కలిసివున్న ఖండ్రిక నాక దానిని, నెల్లూరు జిల్లా కోడూరు ముఠాకు చెందినదానిని కలెక్టరు వేలంపాటపైన కొట్టివేసి అమ్మివేయించేటట్లు తెలిసింది. అది యజ్ఞమూర్తి అప్పాస్వామిగారికి చెందింది. ఆయనమీద ఉత్తర ప్రాంతం, మధ్యప్రాంతపు కోర్టులు జారీచేసిన డిక్రీలను అమలుపరచే నిమిత్తం కలెక్టరిట్లా చేస్తున్నట్లు తెలుసుకొని, వెంటనే నా సోదరుడు వెంకటకృష్ణయ్యకు నా పేరుమీద పాట పెట్టవలసిందిగా తెలియజేశాను. 1820 మే 15 నాడు సదరు ఖండ్రిక నా కోసంగాను రు. 1616 లకు కొనడం జరిగింది. మద్రాసునుంచి బ్యాంకు నోట్లద్వారా ఈ సొమ్ము నేను పంపించాను. నా ఏజెంటు వెంకటకృష్ణయ్యకే ఖండ్రిక స్వాధీనం చేయడం జరిగింది. కాని దురుద్దేశ్యంతో వెంకటకృష్ణయ్య సర్కారు లెక్కలలో దీనిని తన పేరున నమోదు చేయించుకున్నాడు. వెంకటకృష్ణయ్య చేసిన మోసం నాకు తెలిసి, అతణ్ణి బాగా చీవాట్లుపెట్టి, దాన్ని నా పేర రిజిష్టరు చేసేట్లుగా చేయమని కోరాను. 1820 అక్టోబరు 10వ తేదీన కలెక్టరుగారి రికార్డులో అది నా పేరున నమోదుకావడం జరిగింది. ఈ భూమిని బాగుపరచడానికి రు. 400 లు ఖర్చు చేశాను. దీనిమీద సాలుసరి నాకు రు. 100 ల ఆదాయం వచ్చేది. సర్కారుకి చెల్లించే మొత్తంక్రింది నిర్ణాయకమైన వాయిదాలలో తాసీల్దారు కచేరీలో చెల్లించి రసీదులు నా పేరుమీద తీసుకోవడం జరిగింది.

పైన సూచించిన 27 గొర్రుల భూమిలో $16\frac{3}{4}$ మాగాణి భూమి, మిగిలింది మెట్ట. నా భార్య కనక శాశ్వతంగా అనుభవించటానికి ఈ భూమిని ఆమె పేర పెట్టాను. ఇట్లాగే రెండోసారి ఇంకా కొంత భూమి సంపాదించాను. 1821 డిసెంబరులో బద్దెపూడి ముఠాకుచెందిన అనంతసాగరమనే శ్రోత్రియం గ్రామాన్ని సర్కారువారు రివిన్యూ పద్దుల బకాయిక్రింద స్వాధీనం చేసుకొంటున్నారని నాకు తెలిసింది. 10 సంవత్సరాలనుంచీ అది జప్తులోనే వున్నట్టుగా నాకు తెలిసింది. బకాయిపెట్టిన శ్రోత్రియందారులు వచ్చి నన్ను కలుసుకొని ఆ ఆస్తిని అమ్మడానికి, అందులో ఒక సగం వంశ పారంపర్యంగా శాశ్వతంగా నాకు సంక్రమింపజేయడానికి అర్థించారు. దీనికి ప్రతిఫలంగా సర్కారువారి బాకీ రు. 516-12-0 నేను చెల్లించి, ఆస్తిని విడిపించాలి. ఇందులో సగం మొత్తానికి ఆ శ్రోత్రియం భూమి కిమ్మతుగా లెక్కచెప్పి, మిగిలిన సగం మొత్తం, తమ

భాగంమీద వచ్చే ఆదాయంమీద వడ్డీ యిచ్చుకోకుండా, ఏటేటా కొంత స్థిరమైన మొత్తాన్ని నాకు చెల్లించేటట్లు వారు చెప్పారు. ఈ ఏర్పాటు సబబై నదీ, న్యాయ మైనదిగా నాకు తోచింది. ఈ ఒప్పందాన్ని కలెక్టరు ప్రేజర్‌గారికి తెలియపరిచి, ఆయన ప్రెజరీలో నేను రు. 516-12-0 లు చెల్లించి, వెంటనే అ శ్రోత్రియం గ్రామం జప్తు విడిపించాను. నా సగం ఆస్తి నాకు వాళ్లు అప్పగించారు. ఐదు సంవత్సరాలు ఆ ఆస్తిని నేను అనుభవించాను. ఆటు తరువాత శ్రోత్రియం దారులు వచ్చి తమ నిప్పచ్చరపు సంసార పరిస్థితులు తెలియజేసి నేను ఆ భూముల్లో మూడోవంతు మాత్రమే అనుభవిస్తూ తక్కినది వాళ్లకే పదిలిపెట్ట వలసిందిగా ఆర్థించారు. వాళ్ల బీదతనమూ, చితికిపోయిన పరిస్థితులూ చూసి దీనికి నేను సమ్మతించాను. ఈ శ్రోత్రియం గ్రామానికి చెందిన మొత్తం భూమి 880 గొర్రులు. ఇందులో సర్వమాన్యంగా గ్రామోద్యోగులకు, కొందరు బ్రాహ్మణులకు ఉన్న వృత్తులు చేరలేదు. నా భాగంక్రింద 120 గొర్రులు వచ్చింది. సంవత్సరానికి సర్కారువారికి దీనికిగాను నేను రు. 164 లు చెల్లించ వలసి వుండేది. పేదవాళ్ళైన నా బంధువులు కొందరికి, నాపై ఆధారపడిన వాళ్లకు జీవనాధారంచూపే ఉద్దేశంతో ఈ భూమిని నేను కొనుగోలు చేశాను. ఇందు కనుగుణంగా ఈ విధంగా ఈ ఆస్తి పంపకం చేశాను.

52 గొర్రులు మాల్‌గుజారి మెట్టభూమి నా దాయాది సోదరుడు వెంకట కృష్ణయ్యకు.

13 గొర్రులు - డిటో - నా వితంతు సోదరి జానకమ్మకు జీవనార్థం.

24 గొర్రులు-డిటో- ఇంకోసోదరుడు భద్రయ్యకు ఇప్పుడిస్తున్న రొక్క రూపమైన సహాయానికి ప్రత్యామ్నాయంగా.

12 గొర్రులు -డిటో- వేములపాటి నారయ్యకు, ఈయన సోదరి, చని పోయిన నా తమ్ముడు లక్ష్మినరసు భార్య జీవనం నిమిత్తమై భరణం.

12 గొర్రులు మాల్‌గుజారి మెట్టభూమి వేములపాటి అయవారప్పకు, అతడి ఇద్దరి సోదరులకు - సాంబన్న కొమారులకు- నా తల్లిదండ్రుల లేమిలోను, అక్కరలోను సహాయం చేసినందుక్కుగాను.

8 గొర్రులు - లగకిరాజిగా మా పురోహితుడు దేవరపిల్లి వెంకటభట్టుకు.

5 గొర్రులు - నా జ్ఞాతి సోదరులలో మూడోవాడైన సింగారప్పకు, నా పెదతండ్రు లందరిలో పెద్దవాడైన వెంకటచలంగారి సంతానంలో జీవించి వున్న కుమారు డితడొక్కడే.

మొతం ... 120

ఈ విధంగా 120 గొర్రుల మెట్టభూమి యావత్తున్నూ 1880 లో పైన పేర్కొన్న బంధువు లందరికీ నేను సంక్రమింపజేశాను. అయితే రెండో అంశంగా పేర్కొన్న నా పితంతు సోదరి జానకమ్మ కిచ్చిన 12 గొర్రుల భూమి ఆమె తదనంతరం నాకుగాని, నా వారసులకుగాని చెందేటట్లు మరిచిపోగూడదు. సర్కారువారికి చెల్లించవలసిన పన్నులు మొదలైనవి వాళ్ళే తమ తమ వంతులకు సంబంధించి పైకం కట్టాలి.

మూడవది పటచువముఠాకు చెందిన చీకిరాలగుంట అనే శ్రోత్రియం గ్రామాన్ని దేవగూడూరు ముఠాకుచెందిన పేలేటిపండు అనే శ్రోత్రియం గ్రామాన్ని జప్తువిడిపించాను చెల్లించవలసిన బాకీ మొత్తాలు చెల్లించి. మొదటి దానిని వేములపాటి భద్రప్ప ద్వారాను, రెండోది మంచెళ్ళ రామకృష్ణమ్మ ద్వారాను పరిష్కారం చేయించాను. వీరి రెండుకుటుంబాలవారు ఆయా గ్రామాల మూడోవంతు భూమిని అనుభవించేటట్లు ఏర్పాటుచేశాను.

నాలుగోది బద్దెపూడిముఠా కంచెరగుంట శ్రోత్రియం గ్రామానికి చెందిన భూమిలో మూడోవంతు భాగం నేను పొందాను. చెల్లించవలసిన పన్ను చెల్లించక పోవడంతో ఈ శ్రోత్రియ గ్రామంకూడా జప్తులో వుండటంవల్ల, నేనుచెల్లించి విడుదల చేయించాను. నా మూడోవంతుకుగాను సంవత్సరానికి నేను 85 రూపాయల పన్ను సర్కారువారికి చెల్లించాల్సివచ్చింది. ఈ భూమి 50 గొర్రులది.

ఐదోది చివరది అయిన అంశం ఇది.

పైన పేర్కొన్న ఆస్తి వివరాలు, శ్రోత్రియంగ్రామపు భూములు వగైరా లన్నిటికీ స్టాంపు పేపర్లమీద కచ్చితమైన దస్తావేజులు వ్రాయించడం జరిదింది. కోడూరు కండ్రిక, అనంతసాగరం, కంచెరగుంటలో భూములు, శ్రోత్రియం భూములు నాపేరిట మీదుగాను, చీకిరాలగుంటకు చెందినవి, వేములపాటి భద్రప్ప

అతడి సోదరుడు బుచ్చయ్యల పేరుమీదను, పాలేటిపండు భూములు మంచెళ్ళ రామకృష్ణమ్మ పేరుమీదను వ్రాయించడం జరిగింది. చివరిమాటగా నేను చెప్పవలసిందేమంటే ఒక పదిసంవత్సరాలపాటు అంటే 1821 నుంచి 1830 వరకూ శ్రోత్రియం భూములకు సంబంధించిన లావాదేవీలలో నాదృష్టి ఎప్పుడూ వుంటూనే వచ్చిందన్నమాట.

1822వ సంవత్సరం ప్రారంభంలో మూత్రకోశ సంబంధంగా నాకు చాలా జబ్బుచేసింది. భరించరాని బాధతో నిలవలేకపోయాను. మోకాళ్ళదాకా భరించలేని నొప్పులతో బాధపడ్డాను. నా వైద్య మిత్రులు కొందరు అందులో ముఖ్యంగా డాక్టర్ విలియం స్కాట్ గాలిమార్పు నాకు అవసరమని సలహా చెప్పారు. దాని కనుగుణంగా నేను మూడు నెలలు సెలవుపెట్టి నెల్లూరుకు బయలుదేరాను. అక్కడా, ఒంగోలులోనూ ఘనవైద్యు లెందరికో చూపించుకొన్నాను. కాని వ్యాధి నెమ్మదించలేదు. శెలవు పూర్తికావడంతో మళ్ళీ మద్రాసుకు తిరిగివచ్చాను. నా దురదృష్టం అంతటితో విడవలేదు. మూత్రకోశంలో రాళ్ళవ్యాధితో, శరీరమంతటా భరించలేని నొప్పులతో, మూత్రనాళ్ళచ్చరోగంతో చాలా బాధపడ్డాను.

ఈ పరిస్థితులలో నా ఉద్యోగ నిర్వహణలో శెలవు పెట్టవలసి వచ్చేది. నా వ్యాధీ, మాటిమాటికి శెలవు పెట్టటమూ, పై అధికారుల వైముఖ్యానికి గురి కావచ్చునని తలచి అప్పటికే 22 సంవత్సరాలు ఉద్యోగం చేశాను, కాబట్టి పించను తీసుకొని ఉద్యోగ విరమణ చేదామని ఆలోచించుకొని, నా శ్రేయోభిలాషిన్ని, మేలుచేసినవారూ అయిన విలియం ఆలివర్‌గారినీ, ప్రత్యేకించి చెప్పుకోదగిన నా స్నేహితులు ఎ. నమశ్శివాయసెట్టిగారిని సంప్రదించాను. కాని యీ సన్మిత్రులు చక్కని సలహా చెప్పారు. అది ఏమంటే దూరప్రాంతాల వాతావరణంలో మరొకసారి గాలి మార్పుద్వారా ప్రయత్నించమని. నాకు మేలు చేసిన ఆలివర్ దొరగారికి నా యందున్న విశేషమైన సదభిప్రాయాన్నిబట్టీ, సదర్ కోర్టులోని జడ్జిలకు నా విషయంగా ఆయన చేసిన సిఫార్సువల్లా, మళ్ళీ నాకు ఆరు నెలల శెలవు మంజూరు అయింది. దూరప్రాంతాలకు వెళ్ళి అక్కడి వాతావరణంలో గాలిమార్పుకు సంబంధించిన మరో ప్రయత్నంచేసే అవకాశం లభించింది. ఈ అనుమతినీ, సుప్రీమ్‌కోర్టు జడ్జి అనుమతినిపొంది కుటుంబంతో మద్రాసును 1822 ఆగస్టు 8వ తేదీ గురువారం రాత్రి అంటే చిత్రభాను

సంవత్సర శ్రావణ శుద్ధ సప్తమినాడు వదిలిపెట్టాను. మద్రాసు వదిలిన ఐదు రోజులలో నెల్లూరు చేరుకున్నాను. నా ఆంతర్యమయితే కాశికి వెళదామనేకాని, అదిమాత్రం బయటపెట్టలేదు. నా జ్ఞాతిసోదరుడు వెంకటకృష్ణయ్యకుకాని, ఇతర సోదరులకుకాని యీ విషయం నేను తెలియపరచలేదు. నెల్లూరులో ఒక్కరోజు మాత్రమే ఉండి ఉత్తరంగా ప్రయాణం సాగించాను. కొనిజేడుకు, అక్కడి నుండి ఒంగోలుకు, ఆ పైన గుంటూరుకు వెళ్ళాను. గుంటూరులో తూము పాపయ్యగారనే ఆయన చనిపోగా, ఆయన భార్య ఆనాడు సహగమనం చేయడం నేను చూశాను. భర్త శవానికి ముట్టించిన చితిని ఆమె ఎక్కి సహగమనం చేసింది.

అక్కడినుంచి ఏలూరు మీదుగా రాజమండ్రి చేరాను. నా భార్యను వెంట బెట్టుకొని, ఆచంట జమీందారైన రాజా కొచ్చెర్లకోట వెంకటరావుగారితో, ఆయన మాకు బంధువవుతాడు, ఐదురోజులు అక్కడ ఉన్నాము. అక్కడి నుంచి ఇంకాపైకి పెద్దాపురం, పిఠాపురం, విజయనగరం, శ్రీకాకుళం, గంజాము మీదుగా 1822 అక్టోబరు 12వ తేదీన పూరీ జగన్నాథం చేరి అక్కడ నాలుగు రోజులున్నాము. అటుతరవాత 15వ తేదీన బయలుదేరి కొడన, పిప్పలి, బాలవంతి మీదుగా 1822 అక్టోబరు 18వ తేదీనాడు కటక్ ప్రవేశించినాము. అక్కడినుంచి అలివర్‌గారికి కటక్‌దాకా ప్రయాణం చేసినట్లు తెలియజేస్తూ లేఖ వ్రాశాను. కాని ఆరోగ్యంలో మార్పేమీ కనిపించ లేదు అనీ, కాశికి పోదామని సంకల్పిస్తున్నట్లూ, అక్కడికి చేరినతర్వాత గాలి మార్పును ప్రయత్నించదామనీ, హిందూదేశంలోని అక్కడి వాతావరణమైనా మేలు చేయవచ్చునేమోనని అయనకు వ్రాశాను. 1822 అక్టోబర్ 19న కటక్‌ను వదిలి, మహానదిని దాటి తగుయ, చెట్వా, సంకరాయ్, బ్రాహ్మణీకూడలి, వైతరణినది, రోతియ, బహారిపూర్, భద్రక్, సిమిలేయ, సూరంగ్‌ల మీదుగా అక్టోబరు 24వ తేదీని బాలేశ్వరం చేరుకొని, 27వ తేదీ వరకు అక్కడ గడిపాము. అటునుంచి పరక, బస్త (సువరవారక నదిని దాటి) దాటిలోని, రయినిసరాయ్, ధన్‌మురి, గోసపట్ట, చరకపూర్‌ల మీదుగా అక్టోబరు 31వ తేదీన మేదినిపూర్ చేరుకొన్నాము. అక్కడ నాకు చాలా జబ్బుచేసింది పెద్దపెట్టున జ్వరంతో. ఇక మద్రాసుకు తిరిగిపోదామన్న నిర్ణయంకూడా చేసుకున్నాము. అయితే అప్పటి పరిస్థితులన్నీ మళ్ళీమాడు ఆలోచించుకొని, మామూలు ఆరోగ్యం

ద్చష్ట్యా కొంత మెరుగు కనిపించి, కాశీదాకా వెళ్ళాలనే మళ్ళీ నిశ్చయించు కున్నాము.

మేదినిపూర్‌లో నవంబరు 2వ తేదీ మధ్యాహ్నం బయలుదేరి అనిల్ సరాయ్‌లో, మద్రాసువాడైన సింగర వెంకటరామాచారి చాలా జబ్బుపడగా ఆయన్ను డోలీలో ఎక్కించి ఆయనతోపాటుగా నానదేవు, హజిపూరు, మాయ పూర్. షిన్‌పూర్, చంద్రకోన, బెంకొడ, చింతన, ఆర, గౌరంగ్, రఘునాథ పూర్, చందన్‌క్యారి, భన్, అంగువల్లి. గూమెయ, డిగ్‌నరిల మీదుగా, 1823 నవంబరు 23 నాడు హజారీబాగ్‌లో అడుగుపెట్టాము. ఇక్కడ నా వ్యాధి ఎంత ప్రబలిందీ అంటే, ఒకరోజు మొత్తం నేను స్పృహ లేకుండా వుండి పోయినాను. మావాళ్ళంతా నేను కోలుకుంటాననే ఆశనుకూడా వదులుకున్నారు. లేదా ఏమైనా కొంచెం ఆశ వున్నదేమో వాళ్ళకు. ఇది దండువుండే ప్రదేశం. ఇక్కడి వైద్యాధికారిదగ్గరకు నన్ను తీసుకొనివెళ్ళారు. కావలసిన మందులు ఇస్తూ ఆయన ఒక కన్ను నామీదనే ఉంచి వైద్యం చేశారు వెంటనే. ఇక్కడ పన్నెండు రోజులు గడిపి, కొంచెం ఆరోగ్యం నెమ్మదించడంతో, ప్రయాణం సాగించాము. డిసెంబరు 3వ తేదీన హజారీబాగ్‌ను వదిలిపెట్టాము. కట్టకుము స్వామి, కాంచుట్టి, ధనగమ్, కోసల మీదుగా 1822 డిసెంబరు 8వ తేదీన గయ చేరాము. అక్కడ 1823 జనవరి 4వ తేదీవరకు వుండి, అక్కడ చేయ వలసిన కర్మలన్నీ నిర్వర్తించాను. ఈ పవిత్ర క్షేత్రంలో మేము గడిపిన రోజుల్లో నేనుమాత్రమేకాక, ఇంచుమించు మా పరివారమంతా కూడా, జబ్బుపడి పక్కమీదనే వుండిపోవడం జరిగింది. నా వ్యాధి చాలా ముదిరింది. జ్వరం, తలనొప్పి, తలమీద ఒక పుండు, పృష్టంమీద వ్రణం, మూత్రకోశంలో తరచు నొప్పులతో బాధపడ్డాను. ఈ ప్రదేశంలోని వైద్యాధికారి చాలా సజ్జనుడు. హజారీబాగ్ వైద్యాధికారినుంచి ఈయనకొక సిఫార్సు ఉత్తరం నేను తెచ్చాను. ఈ వైద్యుడు దయతో అప్పుడప్పుడు వచ్చి నన్ను చూస్తూవుండేవాడు. ఆయన దగ్గర పనిచేసే నేటివువైద్యులను, కావలసిన మందులతో పంపుతూ వుండేవాడు. ఇక్కడ నిత్యావసర పదార్థాలన్నీ చాలా చౌకగా లభించటంవల్ల అంతకుముందు ఇక్కడ ఖర్చవుతుందనుకున్న మొత్తం మించకుండా ఖర్చయింది మాకు ఇక్కడ. అయితే ఒకటిమాత్రం తప్పక చెప్పాల్సి ఉంటుంది. గయలో జరప వలసిన కర్మకాండ లన్నిటికి పూర్తిగా కలిపి సర్కారువారు 14½ రూపాయలు

చెల్లించాలని కట్టుబడి చేశారు- అన్ని ముఖ్య ప్రదేశాలలోనూ, ఇవన్నీ గయకు చుట్టుప్రక్కల ప్రదేశాల్లో వున్నవి- కర్మలన్నీ పూర్తిచేయడానికి. ఇందులో కొన్నిమాత్రమే నిర్వర్తించుకోవడానికి 3½ రూపాయలు సర్కారువారు నిర్ణయించారు. గయావళీలు నిర్బంధించే పెద్దమొత్తాలు, అక్రమ ప్రవర్తన, వితండవాదం, దూష్యమైన వారి నడవడి, చాలా కంటగింపుగా వుంటుంది. వాళ్లు దగ్గరుండి అవి చేయించేటప్పుడు చాలా బాధిస్తారు. నా విషయంలో ఇది చాలా అనుభవమైంది. నా గయావళికూడా నన్ను బాలా బాధించాడు. నా సొత్తు వివరాలు, నా ఉద్యోగం హోదా, ఆస్తిపాస్తులు మొదలైనవాటినిగూర్చి నన్ను ప్రమాణపూర్వకంగా ప్రకటించవలసిందని నిర్బంధించాడు. గయలో చేయవలసిన కర్మకాండనంతా ముగించుకొని 1823 జనవరి 4న గయను వదిలి కాశీ ప్రయాణమైనాము. పంచన్‌పూర్, గవ, దావూద్‌నగర్, అక్రూర్, శివసాగర్, ఫర్కబాద్, మహమ్మద్‌గంచా, మొగల్‌సరాయ్‌ల మీదుగా మేము ప్రయాణం చేశాము. ఈ ప్రదేశాలు ఒకదాని కొకటి సాధారణంగా వుండేటట్లు కాక, కొంత దూరంగా ఉన్నాయి. కాని మాకు ఒకందుకు సంతోషమైంది. ఏమంటే ఇక్కడి భూమి నెల్లూరు జిల్లా నేలమాదిరిగానే వుంది.

1823 జనవరి 13వ తేది అంటే చిత్రభాను సంవత్సర మాఘ శుద్ధ విదియ, సోమవారం ఉదయం 9 గంటలకు కాశి అనబడే వారణాసిలో ప్రవేశించాము. కాశీలో ప్రవేశించగానే మద్రాసునుంచి, నెల్లూరునుంచి నాకై వచ్చిన ఉత్తరాలు పోష్టాఫీసులో వుండటం, వెంటనే వాటిని నేను చూడటం నాకు చాలా సంతోషం కలగజేసింది.

కాశీ నగరంలో ప్రవేశించగానే, మా స్థానిమల్లుభొట్ల వెంకటరామన్న ఎంతో సంతోషంతో మాకు స్వాగతం చెప్పి క్షామేశ్వర ఘాట్‌లో వున్న తన ఇంటికి తీసుకొనిపోయినాడు. అక్కడినుంచి మేమందరమూ గంగా స్నానం నిమిత్తం మణికర్ణికాఘట్టానికి వెళ్ళాము. మధ్యాహ్నం 3 గంటలకు మా బసకు తిరిగి వచ్చి, తేలికగా భుజించాము. ఈ పుణ్యక్షేత్రంలో జనవరి 20వ తేది వరకు వున్నాము. అన్ని దేవాలయాలను, ముఖ్యమైన ప్రదేశాలన్నిటినీ దర్శించాము. ఇక్కడి వైద్యాధికారి అయిన డాక్టర్ వాట్‌సన్‌గారిని దర్శించాను. గయలో వున్న అసిస్టెంట్ వద్దనుంచి వీరికి పరిచయలేఖను తీసుకొనివచ్చాను నేను. వారణాసినుంచి నా ప్రాపకుడయిన ఆలివర్

గారికి, నా ఆరోగ్యం ఏమీ కుదుటబటలేదనీ మరి ఆరు నెలలు సెలవు పొడిగించి మంజూరు చేయవలసిందనీ వ్రాశాను. కాశీలోవున్న రోజులలో ఇంటా బయటా కూడా గయలో వున్నప్పటివలె ఖర్చులు విపరీతంగా లేవు. ఒక్కమాటలో చెబితే, ఇక్కడ రోజులు హాయిగా గడిచాయి అని చెప్పాలి. ఎంతకాలంనుంచో ఈ పుణ్యక్షేత్రం దర్శించాలని నా కోరికగా వుండేది. దక్షిణాదిన ఉద్యోగంలో వున్న ఎవరికైనా ఇది ఎంత కష్టసాధ్యమో నాకు తెలుసు. అందువల్ల ఈవిధంగా దీన్ని నాకు సిద్ధింపచేసినందుకు భగవంతునికి మనసారా నా కృతజ్ఞతలు తెలుపుకున్నాను. హిందువుల పవిత్ర గ్రంథాలనుబట్టి, హిందూవిశ్వాసాన్నిబట్టి వారణాసిని మించిన పవిత్రాతి పవిత్రక్షేత్రం ఇంకొకటిలేదు. గంగాస్నానం సర్వ పాపాలను హరించివేస్తుంది. భగీరథుని తపస్సువల్ల, ప్రార్థనవల్ల దివిజగంగ భూలోకానికి దిగివచ్చిందని హిందువుల విశ్వాసం. వారణాసివద్ద గంగలోతు ఈనాటికికూడా ఇదమిత్థమని చెప్పలేము. మహానుభావులైన శంకర భగవత్పాదులు, ఇంకెందరో స్వాములు, గంగ పవిత్ర్యాన్ని గూర్చి స్తుతించారు. అందరికీ గంగ అంటే ఎంతో భక్తిప్రపత్తులూ విశ్వాసమూ కలిగాయి. మా అందరికీ ఆ నమ్మిక వున్నది. హిందువులకు కాశి గూర్చి ఎట్లాంటి నమ్మకం వున్నదంటే కాశిని దర్శించినవారికి ఇక పునర్జన్మ అంటూ వుండదని, ఈ జన్మ కడతేరిన తరవాత భగవత్సాన్నిధ్యంలో అక్షయసౌఖ్యం అనుభవించడం జరుగుతుందనీ నమ్మకం.

జనవరి 2 న కాశిని వదలి అలహాబాద్ లేదా ప్రయాగ ప్రయాణమైనాము. బోటునెక్కి గంగలో ప్రయాణంచేశాము అలహాబాదుకు. మీర్జాపూర్ సమీపంలో అర్ధరాత్రివేళ మమ్మల్ని దొంగలు అటకాయించారు. కాని అదృష్టవశాత్తు వాళ్ళ బారినుండి మేము తప్పించుకున్నాము. మార్గమధ్యంలో మళ్ళీ నాకు జబ్బుచేసింది. వైద్యసహాయం లేదు. సాహార్య, పరిచారజనమూ అంతా ఇక నేను కోలుకోవటం జరగదని అనుకున్నారు. జనవరి 28న మేము ప్రయాగ చేరాము. అలహాబాదు కోట ఎడమవైపునుంచి ప్రవహించే గంగ, కుడివైపునుంచి ప్రవహించే యమునల సంగమస్థలాన్ని మేము దర్శించాము. ఇక్కడ నిర్వర్తించవలసిన విధులన్నీ నిర్వర్తిస్తూ ఐదురోజులు గడిపాము. ఒకరోజున తానుకూడా యాత్ర చేస్తూ సకుటుంబంగా వచ్చిన నా పూర్వస్నేహితుడు రేవు వెంకటనరసుకూడా ఇక్కడ వున్నాడని తెలిసి, వెళ్ళి ఆయన్ను చూసివచ్చాను. ఉడిపి దేవాలయానికి చెందిన

ఎనిమిది మంది పీఠాధిపతులలో ఒకరక్కడ వుంటే వారిని దర్శించాను. కనరా దేశంలో పడమటికనుమలలో పనిచేసినప్పుడు నేను వీరిని బాగా ఎరిగివున్నాను. పుటిగ మెంటుకు చెందినవాడాయన.

తెల్లనికాంతులీనుతూ గంగ, నీలనది యమున సంగమించే ప్రదేశం బహు సుందరమైనది. నా దృష్టిని ఈ దృశ్యం ఎంతగానో ఆకర్షించింది. ఉద్యోగ విధులు గనుక అనుమతిస్తే ఇక్కడ కొంతకాలం వుండిపోవాలని నాకు గాఢమైన కోరిక కలిగింది. 1823 ఫిబ్రవరి 1వ తేదీన ప్రయాగను వదిలిపెట్టి, తిరుగు ప్రయాణం ప్రారంభించాము. రామేశ్వరంవద్ద సమర్పించడానికి గంగను తీసుకొనివెళ్ళే ఆచారాన్నిబట్టి గంగ కావళ్ళు తీసుకొని, బోటు కుదుర్చుకొని మళ్ళీ ఫిబ్రవరి 5 వ తేదీన కాశిని ప్రవేశించాము.

కాశి చేరగానే నాకు మా అక్కాల్ల (అక్కాలక్ష్మమ్మ) కనపడింది. ఈమె నా తండ్రి సోదరులలో ఒకరైన సుబ్బన్నగారి రెండోకూతురు. మేము ఒంగోలు వదిలిపెట్టిన కొద్దిరోజులకే ఆమెకూడా బయలుదేరి మమ్మల్ని మార్గంలో కలుసుకోవాలని త్వరితంగా ప్రయాణంచేసింది. ఫిబ్రవరి 9 వ తేది, ఆదివారం, మహా శివరాత్రి పర్వదినం తటస్థపడింది మాకు. మహాదేవుని ఉత్సవదినమది. అటు వంటి పరమపవిత్రమైన పుణ్యాదినాన కాశిలో వుండే అదృష్టం లభించినందుకు మేమంతా పొంగిపోయినాము. మళ్ళీ అక్కడ డాక్టర్ వాట్సన్‌గారిని నేను దర్శించి ఆరోగ్యంగురించి అయన సలహాలు తీసుకున్నాను.

ఫిబ్రవరి 12 వ తేదిన ఉదయం ఫలహారం పూర్తిచేసుకుని బోటులో కాశినుంచి కలకత్తాకు ప్రయాణమైనాము. ముఖ్యమైన నదులు, నదీతీరప్రాంతాలైన గాజిపూర్, బక్సర్, గోదన, ముంజిపటన, బేణీపూర్, బందాలమీదుగా ప్రయాణం చేశాము. ఫిబ్రవరి 21 వ తేది ఆదివారం మేము గంగ వొడ్డునవున్న ముంగేరి చేరుకున్నాము. నా పనివాళ్ళలో వొకడైన బుచ్చెన్నకు చాలా జబ్బు చేయడం, నా రెండోభార్య శ్రాద్ధం నిర్వహించవలసిరావడంతో అక్కడ రెండు రోజులు విధిగా వుండవలసివచ్చింది. ఫిబ్రవరి 24 సోమవారం అంటే చిత్రభాను సంవత్సర ఫాల్గుణ శుద్ధ చతుర్దశినాడు నా వెంట వచ్చిన పనివాడు పొన్నూరు వాస్తవ్యుడు బుచ్చన్న చనిపోయినాడు. అప్పటికి 22 సంవత్సరాలు మాత్రమే అతడి వయసు. ఏడాది క్రిందటే అతడి పెళ్ళయింది. ఆ రోజున ఉదయం

9 గంటలకు బుచ్చెన్న చనిపోయినాడు. అతనికి అంత్యక్రియలు జరిపించి 25 వ తేది ముంగేరి విడిచిపెట్టాము. కలకత్తాకు ప్రయాణం సాగించాము.

1823 మార్చి 25 ఉదయం బోటులోఎక్కి కలకత్తాను వదిలిపెట్టి గంగానదిలో ప్రయాణం సాగించాము. ఫూలవైద్య, తమలక్, కోసరి, డెబ్రి, భద్రకాళి, రావన్ సరాయ్‌లమీదుగా 39 వ తేది జలేశ్వర పట్నం చేరుకున్నాము. ప్రసిద్ధికెక్కిన చాలానదులను మార్గమధ్యంలో దాటాము. ఐస్వర్ 2వ తేది చేరాము ఐస్తన్‌మీదుగా. అక్కడినుంచి సూరంగ్, భద్రక్, జాజిపూర్ (నవత్యాగ్‌లో అక్కడ చేయవలసిన పూజా పునస్కారాలు, నిర్వర్తించవలసిన విధులు పూర్తిచేశాము) కూర్‌సవ, అర్కపూర్, లక్రపూర్, పద్మపూర్‌లమీదుగా ఏప్రిల్ 8వ తేదిన కటక్ చేరుకున్నాము. 9వ తేదిన కటక్‌ను విడిచిపెట్టి బాలకట్, బాలమంతి, సత్యవాడి (సాక్షి గోపాలస్వామిపుండేచోటు) జగన్నాథ లమీదుగా ప్రయాణం చేశాము. 11వ తేదిన లోకనాథ్‌లోవుండి, 12వ తేదిన దానిని వదిలి స్వరాష్ట్రం ప్రవేశించాము. నరసింగపట్నం, మన్నికపటం, ములూడ్ పాయక, గంజామ్, భద్రపూర్, బర్హాంపూర్, ఇచ్ఛాపురం, కంచెర్ల గుండం. పలాసా, దేవపల్లిలమీదుగా ప్రయాణంచేసి ఏప్రిల్ 20వ తేదిన శ్రీకాకుళం చేరుకున్నాము. అక్కడ నా స్నేహితుడు బలిజేపల్లి సీతారామశాస్త్రి గారింట్లో మేం బసచేశాము. ఆయన అక్కడ జిల్లాకోర్టులో ప్లీడరుగా వున్నారు. 28వ తేది వరకు మేము అక్కడే వున్నాము. తరవాత బయలుదేరి సిరిపురం, రాజాం, నందిగాం, మీదుగా బొబ్బిలి చేరుకున్నాము. మే 4వ తేది వరకు బొబ్బిలిలోవున్నాము. దుత్తి, లొగిరసలద్వారా ప్రయాణంచేసి విజయనగరం చేరాము. అక్కడ ఐదురోజులుగడిపి మే 11వ తేది బయలుదేరి పద్మనాభం, గంగసన్నిల మీదుగా, సింహాచలంలో స్వామి ఉత్సవం చూడటానికి అక్కడికి చేరుకున్నాము. ఈ ఉత్సవం ఏడాదికోసారి జరుగుతుంది. అక్కడినుంచి లల్లపల్లి, అనకాపల్లి, కసింకోట, ఎలమంచిలి, ఉప్పాక, సత్యవరం, వంటి మామిడి, రమణక్కపేట, పిఠాపురం, పెద్దాపురం, రాజానగరంల మీదుగా ప్రయాణంచేసి 1828 మే 22వ తేది రాత్రి, కాశీ విడిచిపెట్టిన తిరుగు ప్రయాణంలో రాజమండ్రి చేరుకన్నాము. ఇక్కడ ఒక్కరోజు మాత్రమే గడిపి, అచంటవెళ్ళాము- బహుకాల స్నేహితుడు, మాబంధువు అయినరాజా కొచ్చెర్లకోట వెంకటరావు జమీందారు గారిని చూడటానికిగాను. ఈప్రయాణంలో పవిత్రమైన గోదావరి వివిధపాయల గట్లమీదుగా,

ఱుడ్డిపెంటి, గోపాలపురంమీదుగా ప్రయాణించి ఆచంట చేరాము. మే 24వ తేది నుంచి 31 వరకు ఆచంటలోనే వుండిపోయినాము. వైశాఖబహుళ పాడ్యమినాడు మా అమ్మగారి తిధి అక్కడే జరిపాను. మే 25 నాడు వచ్చిందది. జూన్ 1వ తేది ఆచంటను విడిచి శృంగవృక్షం, ఏలూరుపాడు, డోకిపర్రు, మువ్వల మీదుగా ప్రయాణంచేశాము. జూన్ 3వ తేదిన కృష్ణానదిని దాటి కొల్లూరు చేరుకున్నాము. ఇక్కడ మేము బలిజేపల్లివారింట్లో దిగాము. మా తండ్రిగారి ఆబ్దికం జూన్ 3 న అంటే వైశాఖ బహుళదశమి, అక్కడ జరిపి 4వ తేదిన కొల్లూరు విడిచి కనగాల, చందవోలు, బాపట్ల, చీరాల, కడకోడూరు, అమ్మనబ్రోలు మీదుగా జూన్ 7 వ తేది రాత్రి ఒంగోలు చేరుకొన్నాము. బంధువులను, స్నేహితులను అందరినీ దర్శించాను. ఇక్కడ జానకిరామ సోమయాజులవారింట్లో రెండురోజులున్నాను. స్వభానునామ సంవత్సర జ్యేష్ఠశుద్ధ పాడ్యమి అంటే జూన్ 9 వ తేదీన క్షేమంగా కొనిజేడులో ప్రవేశించాను. ఆ జూన్ 9వ తేదీనుంచి 1823 జూలై 14 వరకు సకుటుంబంగా కొనిజేడులోనే వుండిపోయినాను. నా ఆరోగ్యం పూర్తిగా కుదుటబడనందున ఇంగ్లీషు వైద్యమూ, దేశీయ వైద్యమూకూడా ఆశ్రయించక తప్పలేదు. ఒంగోలులో వుండే ప్రెండర్‌గాస్ట్‌గారు కొన్ని మందులు ప్రాసిచ్చి నాకు వైద్యం చేస్తూ వచ్చారు. ఈయన ఒంగోలులో సబ్ అసిస్టెంట్ సర్జన్‌గా వుండేవారు. ఆసనంవద్ద లేచిన గడ్డ, గయలో వుండగా నన్ను ఎంతో బాధపెట్టింది పూర్తిగా నయమైపోయింది. కాని పార్శ్వపునొప్పిమాత్రం ఇదివరకటివలెనే బాధిస్తూవున్నది. ఇక్కడవున్న ఈ రోజులలో ఖర్చు విపరీతంగా పెరిగిపోయిందికాని, అది తప్పనిసరి అని నిర్ణయించుకున్నాను, జూలై 15 వ తేదీన సకుటుంబముగా కొనిజేడు వదిలిపెట్టి బాగూరు, రామాపట్నం మొదలైన వాటిమీదుగా ఆగస్టులో నెల్లూరు చేరుకుని అక్కడ సెప్టెంబర్ 6వ తేదివరకు వుండిపోయినాను. కాశీవంటి పరమపవిత్ర క్షేత్రం దర్శించి వచ్చినతర్వాత చేయవలసిన కాశీసంతర్పణం మొదలైనవన్నీ నిర్వర్తించాను. 7వ తేది నెల్లూరు వదిలి 10 వ తేది మద్రాసు చేరుకున్నాను. 11 వ తేదినాడు, సుప్రీమ్‌కోర్టు, సదర్ కోర్టులలో నా పనిలో నేను ప్రవేశించాను. 1828 సెప్టెంబరు 11వ తేదీన తిరిగి పనిలో ప్రవేశించానంటే పదమూడునెలల మూడురోజుల తర్వాత తిరిగి పనిలోకి వచ్చాననన్నమాట. 1822 ఆగస్టు 8వ తేదిన మద్రాసు వదిలాను. పూర్తిగా ఆరోగ్యం కుదుటబడకపోయినా కాశీనుంచి తిరిగివచ్చి నేను పనిలో చేరటం నా శ్రేయోభిలాషి ఆలివర్‌గారికి చాలా సంతోషం కలిగించింది. వంగ

దేశం వెళ్ళటానికి ముందు నేను కావూరం వుంటూ వచ్చిన బ్రిబ్లికేన్ ఆరోగ్యకర మైన ప్రాంతం కాదని ఎంచి రాజధానీ నగరంలోకల్లా మంచి ఆరోగ్యప్రదమైన మైలాపూర్ లేదా సెయింట్ థోమలో నివసించాలని అభిలషించి తదనుగుణంగా కపాలీశ్వరస్వామివారి ఆలయం దగ్గరగా వున్న రథ్యపడమటగా వొక చిన్న ఇల్లు కొన్నాను. దీనికిగాను నూరువరహాలకు పైగానే చెల్లించాను. కాని మరా మత్తులు, పైన ఒక గది, హాలు నిర్మించడం మొదలైనవాటికి నాకు వేయి రూపాయల పైనే ఖర్చయింది. 1824 ప్రారంభంలో నా ప్రాపకులు ఆలివర్‌గారికి సదరన్ ప్రొవిన్షియల్ కోర్టులో రెండవ జడ్జి పదవి లభించింది. విలియం హడల్‌స్టన్ గారిని సదర్ కోర్టు రిజిస్ట్రార్‌గా నియమించారు.

కటక్‌నుంచి నా శ్రేయోభిలాషి అయిన ఆలివర్ గారికి- ఇదివరలోనే ఈ లేఖను గూర్చి నేను ప్రస్తావించాను- నేను వ్రాసిన లేఖ పాఠకులు గ్రహించటానికి ఈ క్రింద పొందుపరుస్తున్నాను. ఈ ఉత్తరం చిత్తు ప్రతి కటకంలో తయారైంది. కాని బాలసూర్ నుంచి తారీకువేసి పంపించడం జరిగింది.

బాలసూర్,
24, అక్టోబరు 1822.

విలియమ్ ఆలివర్ దొరవారికి.....

అయ్యా,

నేను నాయాత్రను సాగిస్తూ ఈ ప్రాంతాలకు చేరుకున్న విషయం అత్యంత ఘనమైన విధేయతతో మీకు తెలియపరచు కుంటున్నాను. ఈ సంగతి వినిమీరు చాలా ఆశ్చర్యపడవచ్చు. ఏమంటే నేను మద్రాసు వదిలిపెడుతున్న ప్పుడు, ఇంత త్వరలోనే బెంగాలు ప్రయాణం చేస్తానని మీకు తెలియచేసివుండ లేదు. గడచిన ఆగస్టు 8వ తేదీన నేను మద్రాసును వదిలిపెట్టాను. ఒంగోలు చేరుకున్న తర్వాత నామాత్రకోశవ్యాధి ప్రబలింది. వైద్యమిత్రులతో సంప్రదిం చగా, గాలిమార్పే శీఘ్రమైన ఉపశాంతి కలిగించే ఔషధమని చెప్పారు. ఉత్తర దేశపు వాతావరణం, ఈ ప్రయత్నానికి అనుకూలంగా వుంటుందని చెప్పాను. ఇక ఏ మాత్రమూ కాలయాపన చేయకుండా రాజమండ్రివైపు ప్రయాణం సాగిం చాను. రాజమండ్రిలో కొద్దిరోజులున్నాను. కొంచెం స్వస్థత చిక్కినట్లనిపించి ఇంకా ముందుకు ప్రయాణం సాగించాను. జగన్నాథం చేరుకోగానే నా ఆరోగ్యం

చాలావరకు బాగుపడినట్లు అనిపించింది. కాని ఆ చుట్టుప్రక్కల కలరా వ్యాధి తీవ్రంగా ప్రబలివున్నదని తెలిసి, అక్కడ ఉండటం ఇక ఎంతమాత్రమూ మంచిదిగాదని తలచి ఇంకా ముందుకు సాగాను. కటకం చాలా అసహ్యకరమైన ప్రాంతం. ఆ మాటకువస్తే శ్రీరంగపట్నం కన్నాకూడాపనికిమాలినది. అందువల్ల కటకంలో నేను ఒక్కరోజుకన్నా ఎక్కువ నిలవలేదు. కలకత్తా ఇక్కడకు దగ్గరే కాబట్టి కలకత్తాకు వెళదామనుకున్నాను. కాని ఇంతకుముందుగా కాశీదాకా ప్రయాణం చేసిరావాలని అనుకున్నాను. కాశిని దర్శించాలని ఎన్నిరోజులనుంచో ఎంతగానో అభిలషిస్తున్నాను. అందువల్ల ఇంతకన్నా మంచి అవకాశం లభించదనుకున్నాను. ఇక్కడినుంచి వారణాసికూడా అట్టే దూరంకాదని అంటారు. అందువల్ల డిసెంబరు చివరకు బోటు ప్రయాణంద్వారా కలకత్తా చేరుకోవచ్చునని నేను నిర్ణయించుకున్నాను.

డిసెంబరు ఉత్తరార్ధానికి నా ఆరోగ్యం కుదుటపడే పక్షంలో, వారం రోజులకన్నా కలకత్తాలో వుండను. కాని అది జరగని పక్షంలో కెప్టెన్ లాకెట్ గారిని, సన్నివరికైనా మంచి వైద్యునికి సిఫారస్ చేయమని ప్రార్థించవలసి వుంటుంది. ఈ విషయంగానే మీ మిత్రులైన లాకెట్ గారికి నా గూర్చి నాలుగు వాక్యాలు వ్రాయవలసిందిగా మిమ్ములను అర్థించివున్నాను. ఈ ఉత్తరానికి మీరు నాకు వ్రాసే దయాపూర్వకమైన సమాధానంకూడా, లాకెట్ గారి ఉత్తరంతోనే జతపరచి వారికి పంపుతూ, నేను వారిని దర్శించినప్పుడు అది నాకు ఇవ్వవలసిందిగా వారిని కోరండి.

మీ

(సం.) సుబ్బారావు.

1820 లో మద్రాసులోని స్కూలుబుక్ సొసైటికి మెంబరుగా నన్ను నామినేట్ చేశారు. ఈ నియామకం గూర్చి సదర్, ఫౌజుదారీ అదాలత్ కోర్టు జడ్జీలలో ఒకరు నాకీవిధంగా తెలియజేసినారు.

సుబ్బారావు,

స్కూలుబుక్ కమిటీవారు చేసిన తీర్మానానికి అంగీకారం తెలియజేస్తూ ఆస్కూల్‌బుక్ సొసైటి సెక్రటరీ, ఆ కమిటీలో నిన్ను మెంబరుగా నియమిస్తూ వ్రాసినలేఖను ఇందుతోజతపరచి పంపుతున్నాను. మనం గురువారం కలుసు

కొన్నప్పుడు ఈవిషయం గూర్చి మాట్లాడుతాను. ఇది నాకెంతో సంతోషం కలిగిస్తున్నది.

8 ఆగస్టు 1820
7 ఆగసు 1820

నీ
(సం) ఇ.డి.సి. గ్రీన్‌వే.

మద్రాసు స్కూలుబుక్ సొసైటి సెక్రటరీ సదర్ అదాలత్‌కోర్టు ఇంటర్ ప్రిటర్ అయిన సుబ్బారావు కీవిధంగా తెలియజేయవలసిందిగా ఆదేశింపబడ్డాడు. దాని మేనేజింగ్ కమిటీ సభ్యులు కమిటి కార్యక్రమాలలో, గైకొనే చర్యలలో సుబ్బారావు సలహాలు, సహాయం పొందవలెనని వాంఛిస్తున్నారు. కమిటీ మీటింగులకు ఆయన హాజరుకావలసిందిగా అర్థిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఆయనకు ముందుగానే తెలియజేయడం జరుగతుంది. సుబ్బారావు స్వేశక్త్యానుసారంగా వారుకోరిన సహాయం, సమాచారం అందజేయవలసిందని కోరుతున్నాము. వచ్చే శుక్రవారం ఉదయం పదిగంటలకు కోటలోని ఎకౌంటెంటు జనరల్ ఆఫీసులో ఇటుతరవాత మీటింగు జరుగుతుంది.

1820 నవంబరు 22వ తేదీన మద్రాసు స్కూలు బుక్ సొసైటివారికి నేను సుదీర్ఘమైన లేఖ వొకటి వ్రాశాను. దీని నకలు ఈక్రింద పొందుపరుస్తున్నాను.

నాదేశీయులు, నాజాతి జనులు విద్యావిషయికంగా ఎంత లోపభూయిష్టమైన, అసంతృప్తికరమైన పరిస్థితులలో వున్నారో ఆవిషయికంగా నాలోని సంవేదన నన్ను ఈ ఉత్తరం వ్రాయడానికి ప్రేరేచినదని చెప్పడం ఇక్కడ ఉచిత మనుకుంటాను.

అయ్యా,

1. మిక్కిలి వినయపూర్వకంగా నేటి దేశీయ విద్యావిధానంలోని లోపభూయిష్టమైన పద్ధతులనుగూర్చి విన్నవించుకోవడానికి అనుమతించ వలసిందిగా అర్థిస్తున్నాను. స్కూళ్ళలోవాళ్ళు ఏవిధంగా విద్య నభ్యసిస్తున్నారో ఆ సమాచారం, ఆ పరిస్థితులను మెరుగుపరచే ప్రత్యామ్నాయ మార్గాలు సూచించడమూ ఇప్పటి నియమ నిబంధనలు తగినవిధంగా సవరించడమూ, ఈ లేఖ ఉద్దేశ్యం.

ఇప్పుడు నేను వెలువరించబోయే అభిప్రాయాలూ, సూచనలు భాషా సారస్వతాల అభివృద్ధికి, సక్రమావగాహనకు తోడ్పడతాయనుకుంటాను. వీటికి సొసైటీవారి అంగీకారం లభిస్తుందనుకుంటాను.

2. మద్రాసులో అధికసంఖ్యలోనే స్కూళ్ళు వున్నాయి. ప్రతివీధిలోనూ ఇటువంటి స్కూలొకటి కనపడుతుంది. ఈ స్కూలుకు ఒక ఉపాధ్యాయుడు పెద్దరికం వహిస్తాడు. హిందూసంఘంలోని వివిధ కులాల బాలురు కనీసం ముగ్గురికైనా తగ్గకుండానూ, యాభైమందికి మించకుండానూ ఈ స్కూళ్ళలో విద్యాభ్యాసం చేస్తుంటారు. ఈ స్కూళ్ళలోని ఉపాధ్యాయులు బ్రాహ్మణులు. సాధారణంగా వీరిని ఉత్తరజిల్లాలనుంచి ఆహ్వానించి తీసుకొనివస్తారు. ఏమంటే ఉత్తరప్రాంతీయభాషను దక్షిణాదికన్నా, పడమటివైపుకన్నా ప్రత్యేక ప్రాధాన్యంతో స్వీకారయోగ్యమైనదిగా భావిస్తారు. సెయింట్‌జార్జికోట అధికారం వహించే ఇతర ప్రాంతాలలోకూడా, స్కూలులేనిగ్రామం అంటూ ఎక్కడనో ఒకటిఅరా తప్ప లేనేలేవని చెప్పవచ్చు.

పిల్లవాడికి ఆరోసంవత్సరం రాగానే బళ్ళోకి పంపించటం అత్యంత ముఖ్య ప్రదంగా భావిస్తారు. అక్షరాభ్యాసపు వేడుకలవీ జరిపి తలిదండ్రులు తమతమ యథాశక్తి ఉపాధ్యాయుడికి కట్నం కానుకలు సమర్పించి పిల్లవాణ్ణి బడికి పంపుతారు. పిల్లవానిచేత ముందు ముందు ఇసుకలో బొటనవ్రేలుతో అక్షరాలు దిద్దిస్తారు. అక్షరాలన్నీ కంఠస్థమై, నేర్చుకోగానే కట్టి పలకమీద రాతి బలపంచేత వ్రాయిస్తారు. ఈ పలకను బొగ్గుమసి, కొన్ని ఆకుల పసరు మొదలైనవాటిని పూసి తయారుచేస్తారు. పిల్లవాడు అక్షరాలు గుర్తించడం నేర్వగానే, హల్లులు కూడా నేర్చి, గుణింతం, వర్ణక్రమం మొదలైనవన్నీ నేర్చుతారు. అటుతరువాత చిన్నచిన్న పేర్లు మనుషులవి, దేవుళ్ళవి వ్రాయటం నేర్చుతారు. విద్యార్థి చెప్పిన ఏ పేరునైనా వ్రాయటం నేర్చుకొన్న తర్వాత ఆ పైమెట్టు ఏమిటంటే తాటాకుల మీద గంటంచేత వ్రాయించటం. మొట్టమొదట పెద్దపెద్ద సున్నాలు ఆ ఆకులమీద వ్రాయటం నేర్చుతారు. ఇది బాగా నేర్చుకొన్న తర్వాత విద్యార్థిచేత బాల రామాయణం చదివిస్తారు. సంస్కృతమే ఇది. ప్రతి సాయంకాలం ఒక శ్లోకం చొప్పున నేర్చుకొంటూ మర్నాడు ఉదయం బడికి వచ్చేవేళకు దాన్ని కంఠస్థం చేయవలసి ఉంటుంది. ఉదయం ఆరుగంటలకు పాఠశాలకువచ్చి పిల్లలంతా, ఒకటి, రెండు లేదా ఇంకా ఎక్కువ వరసల్లో కూచుని పెనకటి పాఠాన్ని

చదువుతారు. అందరికన్నా తెలివితేటలుగల పిల్లవాడు బిగ్గరగా పాఠం చదువుతూ ఉంటే తక్కిన పిల్లలు తమ చేతుల్లోని పుస్తకాలను జాగ్రత్తగాచూస్తూ, ఆ పాఠాన్ని తిరిగి తాము చెప్తూవుంటారు. తొమ్మిది గంటలదాకా ఈ విధంగా పాత పాఠాలన్నీ చదివి, ఆటుతరువాత ప్రతి ఒక్కరూ నిన్నటి పాఠాన్ని వరసగా ఉపాధ్యాయుడికిగాని, లేదా ఆయన నియమించిన విద్యార్థి ప్రతినిధి అంటే బడి పెద్దకుగాని అప్పగిస్తారు. అటుతరువాత చద్దన్నం తినటానికి పిల్లలకు అనుమతి లభిస్తుంది. మళ్ళీ పది గంటలకు తిరిగివచ్చి, పలకలమీద, తాటాకుల మీద వ్రాయడం ప్రారంభించి 3 గంటలదాకా వ్రాస్తూనే ఉంటారు. అప్పుడిక మధ్యాహ్న భోజనానికి వాళ్ళను విడుస్తారు. నాలుగు గంటలకు క్రమం తప్పకుండా బడికివచ్చి ఉపాధ్యాయుడినుంచికాని లేదా ఆయన నియమించినవారినుంచిగాని కొత్త పాఠాలు నేర్చుకొంటారు. 5½ గంటలదాకా ఆ పాఠాలు చదువుతూనే ఉంటారు. అటుతరువాత మిక్కిలి భయభక్తులతో అందరూ లేచి ఉపాధ్యాయుడి ముందు నిలబడతారు. సంవత్సరాల పేర్లు అరవైయ్యిన్నీ, నెలలపేర్లూ, వారం రోజుల పేర్లూ, గ్రహాల పేర్లు, నక్షత్రాల పేర్లు, పండగల తిథులు, ఇంకా ఇత రత్రా గుర్తుంచుకోవలసిన రోజులు అన్నీ బిగ్గరగా చదువుతారు. బాల రామాయణంతో బాటుగా ఇంకా ఇతర పుస్తకాలుకూడా చదువుతారు. అమరకోశంలో దేవతల పేర్ల విభాగమూ, దిక్కుల విభాగమూ, వివిధ సంగీత వాయిద్యాలపేర్లు, నగరాల, వృక్షాల, జంతువుల మొదలైన పేర్ల పట్టికలన్నీ చదువుతారు. నీతి బోధలు, అంక గణితం, గణితాలకు సంబంధించిన కొంతభాగం, పవిత్ర గ్రంథాలనుంచి ఏర్చి కూర్చిన కొన్ని సంక్షిప్త గ్రంథాలుకూడా చదువుతారు. ఈ గ్రంథాలన్నీ చదవటమూ, తెలిసివుండటమూ గొప్ప యోగ్యతగా పరిగణిస్తారు. కొన్ని సందర్భాలలో వరుని యోగ్యతను నిర్ణయించటానికిగాను, ఆడపిల్ల తల్లిదండ్రులు, ఆ పిల్లవాడు చదవరి అవునా కాదా అనే విషయాన్ని పరీక్షిస్తారు. అతడికి పుస్తక పఠనంలో మంచి ప్రావీణ్యం ఉన్నది అని తెలుసుకొంటే చాలా సంతృప్తిపడడమేకాదు, తమ అల్లుడు మంచి చదువరి అని గర్విస్తారుకూడాను. పౌర్ణమి, అమావాస్య, ఆటుతరువాత వచ్చే పాడ్యమి రోజులు శుభ దినాలుగా నిర్ణయించి పిల్లలకు ఆటవిడుపుగా పరిగణిస్తారు. ఆ రోజుల్లో అనధ్యయనమే ఆచారం. ఆటలాడుకోవడానికి అనుమతి లభిస్తుంది.

పైన పేర్కొన్న పుస్తకాలైతే బళ్ళో పిల్లలు చదువుతారుకాని, అందులో ఏ భాగమూ, వాళ్లు అర్థం చేసుకున్నారనిమాత్రం చెప్పలేము. ఏమంటారా, అర్థం ఉపాధ్యాయుడే చెప్పలేడు. అయితే మరి ఈ విధంగా చదివించటం ఎందుకంటే, పత్రాలుకాని, లేఖలుకాని, పద్యాలుకాని తడుముకోకుండా స్పష్టంగా, విశదంగా చదవగలిగి ఉండటానికేకాని, మరేప్రయోజనమూ ఆశించిమాత్రం కాదు.

చాలా విచారకరమైన విషయం ఏమిటంటే ప్రాథమిక విద్యాభ్యాసపు రోజులలో బాలుడికి వ్యాకరణంకాని, నీతిపుస్తకాలుకాని ఈదేశంలో బోధించక పోవడమే. ఈ పుస్తకాలు గనుక అభ్యసిస్తే చదువు మెరుగెక్కడం, సాఫల్యం చెందడం నిస్సందేహంగా సంభవం. ఈవిధంగా జరగకపోయినందువల్లనే తరచు దేశీయుల వ్రాతలలోను, ఉత్తర ప్రత్యుత్తరాలలోను, వ్యాకరణ దోషాలు మనం చూస్తూవుంటాము.

దీన్నిబట్టి ఏంతేలుతున్నదంటే, ఏభాషలో నైనప్పటికీ నిర్దుష్టతకోసం వ్యాకరణం తప్పకుండా చదవాలిఅని. మరి ఈ పునాదినే ఉపేక్షిస్తే, భాషకు సంబంధించిన సరియైనజ్ఞానం ఏవిధంగా లభిస్తుంది ?

ఈదేశంలో పది, లేదా పదకొండేళ్ళ వయసున్న పిల్లవాడు బడిచదువు విడిచిపెట్టేస్తాడు. అటుతరవాత చదువునుగూర్చి ఏమాత్రమూ పట్టించుకోకుండా సాధారణంగా కులవృత్తినే చేపడ్తాడు. తండ్రిగనక ప్రభుత్వ కచేరీలో ఏదైనా ఉద్యోగం చేస్తూవుంటే, కొడుకు అక్కడకువెళ్ళి, వ్రాతాకోతా నేర్చుకొంటూ వుంటాడు. కాస్త పీటిల్లో చేయి గట్టిపడగానే, బంధువులంతా ఆ పిల్లవాడికేదైనా పని చూపవలసిందిగా వత్తిడిచేస్తారు. అంతేకాని, తనభాషనైనా సరిగ్గా చక్కగా వ్రాయగలడో లేడోకూడా చూడరు. భాషావిషయికంగా సాధారణంగా బళ్ళోకన్నా బయటనే తన శక్తిసామర్థ్యాలు మెరుగుపరచుకోవడ మనేది నిజమేకాని, అతడు పొందవలసిన సామర్థ్యంమాత్రం పొందడు. ఎందుకంటే ప్రాథమికదశలో, అతడి విద్యాబోధన అనేది జరగవలసినతీరులో జరగదు.

ఈవిధంగా అతడి భాషాజ్ఞానంలో లోపాలకు కారణాలు వ్యాకరణం చదివించకపోవడంవల్ల, నీతిపూరితములైన ఉద్గ్రంథాలు చదివించకపోవడంవల్ల తలెత్తుతున్నాయి అని చెప్పవచ్చు. ఆయా కులవృత్తులకు ఉపయోగపడేటట్లుగా ఈ

విద్యాభ్యాసం ఎంతమాత్రమూ వుండడంలేదు. సార్వత్రికంగా, అందరికీ, అన్ని కులాల పిల్లలకూ, ఒకేవిధమైన విద్యావిధానాన్నే అనువర్తింపచేస్తున్నారు. ఈ దేశంలోని దేశీయపాఠశాలల్లో, నేనిదివరలోనే పేర్కొన్నట్లు, అన్నికులాల పిల్లలూ చదువుకుంటున్నారు. ప్రభుత్వంవారు నడిపేబళ్ళలో బోగంవాళ్ళ ఆడ పిల్లలు చదువుతారు. మరి ఇతరత్రా ఆడపిల్లలు పాఠశాలలకుపోరు. బోగంవారి ఆడపిల్లలు చదవనూ రాయనూ నేర్చుకోవడం ఒకవిధంగా తప్పనిసరి. కచేరీలో అభినయించవలసిన పాటలు, పదాలు వాళ్ళు కంఠపాఠం చేయవలసివుంటుంది.

స్కూలుమాస్టరుకు నెలసరివచ్చే ఆదాయం చాలాతక్కువ. ఆయనపడవలసిన శ్రమకది ఎంతమాత్రమూ తగిన ప్రతిఫలంకాదు. నిత్యకృత్యాలు నెమ్మదిగా నిర్వహించుకోవడానికికూడా ఈమొత్తం ఎంతమాత్రమూ సరిపోదు. పిల్లవాడికి ఒక్కొక్కదానికి ఒక పావలా చొప్పున ఇతర ప్రాంతాలలోను, ఎక్కడైనా ఒక రూపాయికి మించి మద్రాసు స్కూళ్ళలోను, ఉపాధ్యాయుడికి లభించే అవకాశం వుంది. ఇంతకుపూర్వం పరిపాలించినవాళ్ళ హయాంలో బడిపంతుళ్ళకు రొక్కరూపంగా అప్పుడప్పుడు బహుమానాలు, ఇంకాబాగా స్థితిమంతులైనవారి వల్ల భూదానాలు మొదలైనవి లభిస్తూవుండేవి. శ్రీమంతుల పిల్లలు చదువు చాలించి బడి విడిచిపెట్టే సందర్భాలలోకూడా గురువుగారికి కట్నకానుకలు బహుసందర్భాలలో లభిస్తూవుండేవి.

పాఠశాలోపాధ్యాయునికి నెలకు స్థిరంగా కొంతరొక్కం ముట్టచెప్పగలిగిన సామర్థ్యం వున్నవాళ్లే తమపిల్లలను పాఠశాలలకు పంపుతారు. ఆ స్తోమతులేని వాళ్ళు పిల్లలు ఇంటిదగ్గర విద్యాభ్యాసం చేస్తారు. బళ్ళకు వెళ్ళినవాళ్ళ స్థాయితో పోల్చిచూస్తే వీళ్ళస్థాయి సామాన్యంగా తక్కువగానే వుంటుంది. కాని తరవాత ఇటువంటివాళ్లు ఏదైనా ఉద్యోగం సంపాదించి వాళ్ళకుండే అవకాశాన్నిబట్టి, విద్యాధికుడైన ఒక పై ఉద్యోగిని ఆశ్రయించి, స్వయంగా తమన్యూనతను భర్తీ చేసుకుంటారు. లెక్కలు వ్రాయటం బళ్ళో నేర్పటమైతేనేర్చుతారుకాని, ఒకస్థాయి మాట అనుకోనేకూడదు. నీతికి సంబంధించిన ఉద్గ్రంథాలమాట తలచనేకూడదు. దేశీయ పాఠశాలల్లో వాటి ప్రసక్తే వుండదు. విద్యార్థికి వాటినిగురించి తెలియనే తెలియదు. వాళ్ల చేత రోకటిపాటగా కొన్నిటిని చదివించడమైతే చదివిస్తారుకాని, వాటి అర్థంకాని, భావంకాని, వాటివల్ల వాళ్లు పొందవలసిన ప్రయోజనంగాని వాళ్ళ మనస్సులకు పట్టనేపట్టదు.

సంస్కృతాన్నిమాత్రం సక్రమంగానూ నిర్దుష్టంగానూ నేర్పుతారు. ఏమంటే ప్రాథమికదశలోనే వాళ్లు మూలసూత్రాలు నేర్చుకోవాలి. విభక్తి స్వరూపం, సంధినియమాలు, వాక్యనిర్మాణం వాళ్లు నేర్చుకొంటారు. ఈపద్ధతులే దేశీయభాషలు అభ్యసించడంలోనూ ప్రవేశపెడితే వివిధ వర్ణాలమధ్య భాషా సౌష్ఠవం నేటివరకూ పరిరక్షితమై వుండేదనడంలో ఎంతమాత్రం సందేహమూ లేదు. ఇతర భాషలవలె సంస్కృతం సంకరమై కలగాపులగమైపోలేదు.

ఈ దేశంలో స్తోమతగల కుటుంబాలలో ప్రత్యేకించి తమపిల్లలకు చదువు చెప్పటానికి ఆకర్షణీయమైన నెలజీతం యిచ్చి, ఉపాధ్యాయులను కుదుర్చుకోవటం జరుగుతుంది. ఇటువంటివారిని ఇంటివద్దనే నిలుపుకుంటారు. ఇతరుల పిల్లలకు చదువుచెప్పటానికి ఎంతమాత్రమూ పీళ్ళు ఇల్లుకదిలే వీలులేదు.

దేశీయభాషలు బోధించేపద్ధతి సర్వేసర్వత్రా ఒకేవిధంగావున్నది. తమిళంలో మాత్రం, అక్షర సమామ్నాయంలో తక్కువ అక్షరాలుంటాయి. ఈ భాషకు సంబంధించిమాత్రం ప్రాథమికస్థాయిలో తమిళపుస్తకాలలోనుంచే పాఠాలు బోధిస్తారు. సాధారణంగా సంస్కృతం దేవనాగరిలిపిలోనే బోధిస్తారు. కాని తెలుగు, కన్నడ, గ్రంథ మొదలైన లిపులలోకూడా దేవనాగరిలోనిలిపి సంకేతాలన్నీ వున్నాయికాబట్టి దక్షిణదేశంలో సంస్కృత పుస్తకాలు, ఆయా దేశభాషలలో, సంస్కృతభాషలోవలెనే సంపూర్ణోచ్చారణ విధేయంగానే వ్రాయబడతాయి. సంస్కృతభాషకు మాదిరిగానే తెలుగు, కన్నడ, తమిళ, మహారాష్ట్రాది భాషలకు వ్యాకరణాలున్నవనే విషయం సర్వజన విదితమే. ఆ వ్యాకరణాలు చదివితే చదువరి సౌష్ఠవమైన భాషాజ్ఞానం అలవర్చుకోవటంలో సందేహంలేదు. కాని సాధారణ పాఠశాలల్లో బోధించనే బోధించరు.

ఇప్పుడిక దేశీయ పాఠశాలల్లో దేశస్థులకు ఇంగ్లీషు ఏవిధంగా నేర్పుతారో వివరిస్తాను. స్వభాషను అభ్యసించడం ప్రారంభించిన తరవాత, ఫలానివయసున ఇంకోభాషను నేర్చుకోవడం ప్రారంభించవచ్చునని ప్రత్యేకించి చెప్పగల నియమమంటూ ఏదీ లేనేలేదు. ఈ దేశంలో అరవై ఏళ్లు దాటినతర్వాతకూడా కొందరు వ్యక్తులు ఇంగ్లీషు నేర్చుకోడానికి ఉత్కంఠ చూపిన సందర్భాలు కొన్ని నేను ఎరుగుదును.

కాబట్టి ఇంగ్లీషుస్కూల్‌లో ప్రవేశించినప్పుడు దేశీయుడెవరైనా ముందుగా వర్ణమాలను నేర్చుకుంటాడు. అచ్చయిన 'స్పెల్లింగ్‌బుక్'నుంచే అతడు దీనిని నేర్చుకుంటాడు. అటు తరవాత ప్రతిఉదయం ఉపాధ్యాయుడు అందులోంచి అతడికి ఒక పాఠం ఇస్తాడు. దీనితోపాటుగా, నేననుకుంటాను, మద్రాసులో వెనక ఎవరో దేశీయోపాధ్యాయుడు ఇంగ్లీషు నేర్చుకొనే వాళ్ళకోసం కూర్చిన 'ఒకాబ్యులరీ' 'డైలాగ్' పుస్తకాలనుంచి పాఠాలు ఇవ్వబడతాయి.

పందమాటలు నేర్చుకొని ఒకమో స్తరుగా దస్తూరి కుదుర్చుకొన్నతర్వాత ఉమేదువారుగా సర్కారు ఆఫీసులలో దేన్లోనో ముందుగా అతడు ప్రవేశిస్తాడు. ఆటుతరవాత క్రమక్రమంగా అతడి బంధువుల ఆసరాను పురస్కరించుకొని ఒక చిన్నపనిలో కుదురుకుంటాడు. రాజధానికాక ఇతరప్రాంతాలలో బడిలోచేరి ఇంగ్లీషు నేర్చుకునే విద్యార్థులు ఎరిగినవి, చదివేవి 'ఒకాబ్యులరీ' 'డైలాగ్' 'అరేబియన్ నైట్స్' అనే పుస్తకాలు మాత్రమే. వ్యాకరణానికి సంబంధించినంత వరకు వాళ్ళకు చాలా అల్పపరిజ్ఞానమే వుంటుందనుకుంటాను. నేను ప్రస్తావించిన 'ఒకాబ్యులరీ' 'డైలాగ్' అనే పాఠ్యపుస్తకాలుకూడా నిర్దుష్టంగా, వ్యాకరణ యుక్తంగా వుంటాయని చెప్పలేము. అంతేకాదు. వీటిద్వారా ఒక స్థాయిలో తప్పులులేకుండా ఇంగ్లీషు మాట్లాడటం నేర్చుకోగలగడంకూడా సాధ్యంకాదు. ఈ పుస్తకాలు విద్యార్థులకిందుకు సహాయపడవు. కాపట్టి ప్రస్తుతం ఇతర ప్రాంతాల లోని పాఠశాలల్లోనేకాక రాజధాని పాఠశాలల్లో సైతం ఇంగ్లీషునునేర్పే ఇప్పటి విద్యాబోధన పద్ధతులు, సక్రమమైన పద్ధతు లెంతమాత్రముకావని స్పష్టంగా బోధపడుతూనేవుంది. ఇంగ్లీషు నేర్పగల దేశీయులైన స్కూలు మాస్టర్లలో, వ్యాకరణ పరిజ్ఞానం అంటూ వున్నవారు బహుతక్కువ అని నా నమ్మకం. కొన్నాళ్ళక్రితం మద్రాసులో, అప్పుడు మూడు, నాలుగుకన్నా పాఠశాలలులేని రోజుల్లో, ఇంగ్లీషు చెప్పే స్కూల మాస్టర్ల ఆదాయం పరవాలేదు, చెప్పుకోదగినంతగానే వుండేది. కాని ఇప్పుడు వాళ్ళసంఖ్యకూడా బాగా పెరగడంతో వారి ఆదాయంకూడా తమ పోషణకై చాలకుండా వుంటున్నది.

ఇక ఇంగ్లీషు భాషోచ్చారణను గురించి చెప్పవలసివస్తే దేశీయులు ధారాళంగా నిర్దుష్టంగా మాట్లాడగలగటమన్న ప్రశ్నేలేదు. కాబట్టి దేశీయుల విషయంగా వాళ్ళు తప్పులు లేకుండాను, వ్యాకరణయుక్తంగాను వ్రాయగలిగితే చాలు. ఎందుకంటే విదేశీయ భాషను, స్వదేశీయులవలె నిర్దుష్టంగా, ధారాళంగా

ఇంకొకరు ఎవరూ మాట్లాడలేరనేది అందరూ అంగీకరించే విషయమే. ఉదాహరణకు సంస్కృతంలో 50 మించిన వర్ణాలున్నా, గొప్పసంస్కృత పండితునికైనా, ఇంగ్లీషులో ఇరవైఆరు వర్ణాలే వున్నప్పటికీ, ఇంగ్లీషు సుష్ఠుగా ఉచ్చరించటం సాధ్యపడదు.

కాబట్టి ఈ విషయంలో చెప్పుకోదగిన అభివృద్ధి సాధించటానికీ, వివిధ భాషల పరిజ్ఞానానికీ, ఈ క్రింద నేను పేర్కొంటున్న పుస్తకాల ప్రచురణ అత్యంతావశ్యకమని మనవి చేసుకుంటున్నాను. సొసైటీవారు ఈ విధంగా ప్రచురించే పుస్తకాలకు స్వల్పధరనే నిర్ణయించి ఆపుస్తకాలు అందించాలి.

దేశీయ పాఠశాలలకు (ఫర్ ది నేటివ్ స్కూల్స్)

1. ఇప్పుడున్న తెలుగు, తమిళ, కన్నడ, మహారాష్ట్ర వ్యాకరణాలను వచన రూపంలో ఆధునిక భాషల్లో వివరణాత్మకంగా సంక్షిప్తీకరించడం.

2. ఆధునిక భాషలో ముఖ్యంగా వివిధ గ్రంథాలనుంచి కూర్చిన నీతి కథలు.

3. అంకగణితము, గణితము ఆధునిక భాషలో వచనరూపంగా.

ఇంగ్లీషు పాఠశాలలకు (ఫర్ ది ఇంగ్లీష్ స్కూల్స్).

4. దేశభాషలన్నింటిలోనూ వివరణాత్మకమైన ఇంగ్లీషువ్యాకరణ సంగ్రహం.

5. పుట్టు పూర్వోత్తరాలతోసహా వర్ణించే ప్రపంచచరిత్ర–వివిధ భాషలలో దీని అనువాదం.

6. సాధారణంగా ఉపయోగపడగల ఇంగ్లీషు సంభాషణారీతులు–వివిధ భాషలలో దీని అనువాదం.

7. ఇంగ్లీషులోను, దేశీయభాషల్లోనూ శబ్దావళి.

8. ఆహ్లాదం కలిగించే కొన్ని కథలు–వాటి అనువాదాలు.

ఈ నివేదికను ముగించేముందు భాషలు అభివృద్ధి సాధించటానికి చేయ దగిన ప్రయత్నాలు ఇంకేమైనా నాకు తోస్తే తప్పక సొసైటీవారి దృష్టికి తీసు కొనివచ్చి విన్నవించుకొంటానని మనవి చేస్తున్నాను.

అయ్యా

తమ అత్యంత విశ్వాసపాత్రుడు,
విధేయుడైన ఉద్యోగి అనే గౌరవార్హతగల
(సం) వి. సుబ్బారావు

ట్రిప్లికేన్,
22 నవంబర్ 1820.

ఈ సుదీర్ఘమైన నివేదిక మద్రాసు స్కూల్‌బుక్ సొసైటిలోని విదేశీయులు స్వదేశీయులైన సభ్యులందరి సమ్మతినికూడా పొందింది. దీనిని ప్రజల దృష్టికి తీసుకొని రావడానికే '1829 వ సంవత్సరపు మద్రాసు స్కూలు బుక్ సొసైటి వారి ప్రథమ నివేదిక' అనే ప్రచురణగా ప్రచురించారు.

తరువాత దక్షిణదేశంలో దేశీయ విద్యావిధానంలోని లోపాలనుగూర్చి, ఇంకో నివేదికనుకూడా సమర్పించాను. ఈ నివేదిక ప్రతి ఎక్కడో పోయింది. ఇప్పుడు నా దగ్గరలేదు. దీనికి స్కూలు బుక్ సొసైటీవారు కృతజ్ఞత లంద జేస్తూ నాకు వ్రాసిన లేఖకు నకలు ఈ విధంగా ఉంది.

వి. సుబ్బారావుకు,

అయ్యా,

మద్రాసు స్కూల్ బుక్ సొసైటి నిర్వాహకుల దృష్టికి 6 వ తేదీగల మీ లేఖ తీసుకొనిరావడం జరిగింది. వారు కోరిన సమాచారం మీరు వెంటనే అందించినందుకు వారి కృతజ్ఞత మీకు తెలియపరచగల సదవకాశం నాకు లభించి నందుకు సంతోషిస్తున్నాను.

అయ్యా, మీ అత్యంత విధేయోద్యోగి అనే గౌరవార్హతగల
(సం.) ఎఫ్. మౌంట్‌ఫోర్డు,
సెక్రటరీ, ఎమ్. ఎస్. బి. ఎస్.
మద్రాసు, 24 జనవరి 1824.

ఈ సొసైటీ సభ్యులలో ఒకరైన శ్రీ జాన్ గ్వాట్కిన్‌గారినుంచి క్రింద పొందుపరచిన లేఖ నాకు చేరింది.

వి. సుబ్బారావుకు,

ప్రియమైన ఆర్యా,

నేను మీకు ఒక చిన్నపుస్తకం పంపిస్తున్నందుకు ఎంతగానో ఆనందిస్తున్నాను. ఇందులో ఉపయుక్తమైన, బోధాత్మకమైన శైలిలో పాఠశాలలకు బాగా పనికివచ్చే అనేక విషయాలున్నాయని నేను భావిస్తున్నాను. ఈ దేశానికి అనుగుణంగా వుండనివి, దేశస్థులకు ఆక్షేపణీయంగా తోచేవీ అయిన సంగతులు కొన్ని మార్చడము, పెన్సిలుతో పరిహరణ సూచనలుగా గుర్తు పెట్టడమూ జరిగింది. మీరు నా కొక చిన్న సహాయం చేయగలరా? దయతో నాయీ పుస్తకాన్ని పరిశీలించి, కాలేజీలో వచ్చే సోమవారం మళ్ళీ మనం కలుసుకొనేటప్పటికి మీ అభిప్రాయం తెలియజేయగలరా?

అత్యంత నమ్మకంగా,
(సం.) జె. గ్వాట్కిన్,
24 జనవరి, 1824,

పాఠశాలల పిల్లలకు ఉపయోగించే విధంగా అనేక పుస్తకాలు నేను అనువదించడం జరిగింది. అందులో కొన్ని అచ్చయి, ప్రకటితమైనవి. స్కూలు పిల్లలకు వీటిని విక్రయించడంకూడా జరిగింది. ఒక్క మద్రాసు స్కూలు బుక్ సొసైటీ విషయంలో పనిచేయడమేగాక, దీనితోపాటు ఇతర కార్యకలాపాలతో కూడా పాల్గొనేవాడిని. ఆ రోజుల్లో కొన్ని ఉద్యోగ నియామకాలకోసం పరీక్షలు జరిపేవారు. ఈ పరీక్షలేకాక, ఇంకా 'హిందూలా' 'గవర్నమెంట్ సివిల్ రెగ్యులేషన్స్'లలో జరిపే పరీక్షలకు. మద్రాసులోని కాలేజి నిర్వాహక బోర్డువారు నన్ను పర్యవేక్షకత్వం వహించవలసిందని అభ్యర్థించేవారు.

1825 జూలై మాసాంతానికి 2½ క్వారీల వైశాల్యంగల ఒకతోట కొన్నాను నేను. ఆ తోటలో 80 మామిడిచెట్లు, 50 కొబ్బరి చెట్లు వున్నవి. ఇవేకాక ఇంకా రకరకాల పూలచెట్లు వున్నాయి. మైలాపూరును ఆనుకొని దక్షిణంగా వుంది ఈ తోట. వెయ్యిరూపాయలకు పైగానే ఖరీదిచ్చి ఈ తోటను కొన్నాను. ఇందులో

మేడఇల్లు, ఇంకా ఇతరంగా పనివాళ్ళ ఇల్లు అవీ కట్టించడానికి నాకు దాదాపు పదివేల రూపాయలవరకు ఖర్చయినది.

1826 ఫిబ్రవరి నెలలో అంటే పార్థివనామ సంవత్సర పుష్యమాసం చివర, మూడునెలలు శెలవుపెట్టి, నేను తెచ్చిన కాశీగంగతో రామేశ్వరంలోని శివ లింగాన్ని అభిషేకించడానికి సకుటుంబంగా రామేశ్వరయాత్ర జరిపాను. మేము కుంభకోణంమీదుగా ప్రయాణం చేశాము-అక్కడి తీర్థంలో పవిత్ర స్నానం చేయ టానికి- పన్నెండేళ్ళకోసారి అంటే పుష్కరానికోమారు, యీ పవిత్ర తీర్థకుండలో మాఘమాసం అంటే ఫిబ్రవరిలో గంగాజలం చేరి ప్రవహిస్తుందని పరంపరా గత మైన విశ్వాసం. 1826 ఫిబ్రవరి అంటే పార్థిన సంవత్సర మాఘమాసంలో, ఈ పవిత్రోత్సవం వచ్చింది. అందువల్ల కుంభకోణంమీదుగా ప్రయాణంచేయటంఉచిత మని తలచాము. నా భార్య, పెత్తండ్రికి దత్తుపోయిన తమ్ముడు వెంకటకృష్ణయ్య, అతనిభార్య, నా చెల్లెలు, ఇంకా ఇతర బంధువులతో కలిసి, కావలసినంతమంది పనివాళ్ళను వెంటతీసుకొని, నాలుగు పల్లకీలు, ఆరుబండ్లు నెలఅద్దెకు కుదుర్చు కొని ప్రయాణం సాగించాము. 1826 ఫిబ్రవరి 8 న, రామేశ్వర పుణ్యక్షేత్ర సందర్శనం నిమిత్తం బయలుదేరాము. మద్రాసునుంచి బయలుదేరి గానుగల సత్రం, తిరుపాలూరు, లింగిచెట్టిసత్రం, తెంగలసత్రం, మరిళి సత్రం, కుండప్ప మొదలియార్ సత్రం, తుంబానాయకసత్రం, పుదుచ్చేరి, కడలూరు, మూరమన్ సత్రం, చిదంబరం, చెయలి, మాయవరం, మధ్యార్జునలల మీదుగా ప్రయాణచేసి, 1826 ఫిబ్రవరి 20 తేదిన కుంభకోణం చేరుకున్నాము. పుదుచ్చేరిలో దర్శనీయ మైన ఆనందరంగపిళ్ళ నివాససౌధాన్ని నేను దర్శించాను. దానిపై అంతస్తు ద్వారబంధాలు, బంగారుపూత పూసి వున్నాయి. కడలూరులోను, చిదంబరం లోను నా పూర్వకాలపు స్నేహితుడు దొనెగంటి కృష్ణపంతులతో ఉన్నాము మేము. కుంభకోణంలో బహుకాలంనుంచి నా సన్మిత్రులు మలేయలంరెడ్డి రావు ఉరఫు వెంకటరెడ్డిగారింట్లో బసచేశాను. ఫిబ్రవరి 22, బుధవారం అంటే మాఘశుద్ధ పూర్ణిమనాడు, మేమంతా మాఘ మహాస్నానాన్ని ఆ తీర్థకుండంలో నిర్వహించు కున్నాము. 24 వ తేది అక్కడేవుండి నా స్నేహితులైన మహీధర నరసింహశాస్త్రి గారింట భుజించాము. 25 వ తేదిన కుంభకోణం వదిలి ఘనాపాటిసత్రం, పంచ నదం (అంటే ఐదు వేరువేరు నదులు, అందులో కావేరి ఒకటి) సంగమించే స్థలం మీదుగా ప్రయాణించాము. ఈ పంచనదం బహుపవిత్ర క్షేత్రం. పావిత్ర్యంలో

కాశీక్షేత్రానికి తులతూగేది కావచ్చు. ఫిబ్రవరి 28 వ తేదిన తంజావూరు చేరుకున్నాము. అక్కడినుంచి బయలుదేరి వర్తనాడు, పుదుకోట, కట మగషలి, సేతుభవసత్రం, కుతుమైవాడిల మీదుగా మార్చి 2 వ తేదికి మనమలేకూడి సత్రం చేరుకున్నాము-శివరాత్రికి రామేశ్వరం చేరుకోవాలనే వేగిరిపాటుతో. ఆ ఏడు మార్చి 6 సోమవారంనాడైంది శివరాత్రి. ఒక బోటు కుదుర్చుకొని రామేశ్వరానికి అందులో ప్రయాణం చేయాలని వుద్దేశించాము.

ఇక్కడొక విషయం తప్పక చెప్పాల్సి వుంటుంది. ఈ సత్రానికి వెళ్ళే తోవలో పదిహేనుతలల తాటిచెట్టును మేము చూశాము, అందరికీ చాలా ఆశ్చర్యం కలిగింది. రాత్రి సగం గడిచిన తర్వాత బోటు ఎక్కాముగాని గాలివాలు అనుకూలంగా లేకపోవడంతో మళ్ళీ ప్రయాణం ఆపి దిగిపోవలసి వచ్చింది. పల్లకుల, బండ్లద్వారానే ప్రయాణం కొనసాగించాము. మెంబయి సత్రం, తొండిల మీదుగా మార్చి 6 వ తేది శివరాత్రినాడు నవపాషాణం, లేదా తొమ్మిది శిలలు, ప్రాంతం చేరాము. ఆ రోజంతా అక్కడే గడిపాము. ఆ మర్రోజు ఉదయం కొబ్బరితోపులో భోజనాలు పూర్తిచేసుకుని ఆ తర్వాతరోజు అంటే మార్చి 9 వ తేదిన బళ్ళు అక్కడే నిలుపుకొని సముద్రపు కయ్యలోని భాగమైన ఉప్పుటేరును దాటి తంగచీ సత్రంలో బసచేశాము.

1826 మార్చి 10వ తేదీ శుక్రవారము పదిగంటలకు రామేశ్వరం చేరుకుని, గొప్ప పుణ్యక్షేత్రమైన ఆ దేవాలయంలో ప్రవేశించి గంగాజలంతో స్వామి వారికి అభిషేకం జరిపాము. ఆ క్షేత్రంలో నిర్వర్తించ వలసినవన్నీ నిర్వర్తించి ఆ మర్రోజున సేతువుదగ్గరకు వెళ్ళాము. మూడురోజులు రాత్రింబవళ్ళు అక్కడే గడిపి, అక్కడ చేయవలసిన కలాపాలన్నీ జరిపి, పితృ ప్రపితామహులకు అర్పించవలసినవన్నీ అర్పించాము. ఇవన్నీ పూర్తిచేయటానికి నాకు చాలాడబ్బు ఖర్చయింది. రామేశ్వరానికి బోటుమీద తిరిగివచ్చాము. సముద్రంలో- అది తిమింగలంపిల్లో, పెద్దచేపో ఏమో కాని-మాకు తారసపడి, మమ్మల్నిఎదుర్కొని, మాపై దాడి చేసింది. కాస్తంతలో తప్పిపోయింది కాని లేకపోతే మునిగిపోయే వాళ్ళమే. అదృష్టవంతులం కాబట్టి ఆ క్రూరజలచరంబారిన పడి కూడా తప్పించుకున్నాము. పడవవేగంగా ప్రయాణంచేసి వొడ్డు పట్టటంవల్ల మధ్యాహ్నం ఒంటిగంటకు మళ్ళీ రామేశ్వరం దేవాలయం చేరుకున్నాము. అక్కడ పూర్తిచేయ

వలసిన నైమిత్తిక కార్యకలాపాలు పూర్తిచేసుకున్నాము. మార్చి 16వ తేదివరకు రామేశ్వరంలోనే వుండిపోయి, ఆ చుట్టుప్రక్కలవుండే పవిత్రప్రదేశాలు, క్షేత్రాలు అన్నీ దర్శించాము. ఇటువంటి వాటిలో గంధమాదన పర్వతంకూడా దర్శించాము. అక్కడ తపస్సుచేసుకొంటున్న వృద్ధసన్యాసిని ఒకరిని దర్శించాము.

16 వ తేది మధ్యాహ్నం రామేశ్వరం వదిలిపెట్టి పాంబన్ సరస్సుదాటి, అక్కడ మా బండ్లు, ఎద్దులు, గుర్రాలు, విడిసి వుండటం చూశాము. అక్కడే ఒక సత్రంలో ఆ రాత్రి గడిపాము. 7 రోజుల రామేశ్వరయాత్రశ్రమసంబంధమైన అలుపు తీర్చుకుంటూ ఆ మర్రోజుకూడా అక్కడే గడిపాము. 18 వ తేదిన ఆ ప్రాంతం వదిలి, అడవిగుండా ప్రయాణంచేసి, ఆ రాత్రి దర్భశయనం చేరుకున్నాము. అక్కడ మూడురోజులుండి, ఆచరించవలసిన పుణ్యకర్మలన్నీ పూర్తిచేసుకున్నాము. మార్చి 20 వ తేదీ ఆ ప్రదేశంవదిలి, భోజనంవేళకు రామనాధపురం చేరి, భోజనాలు చేశాము. మార్చి 21 తేదీన శెట్టిమఠం చేరుకుని అక్కడ నా రెండోభార్య(అకాలమృత్యువాత పడినదీమె) శ్రాద్ధం నిర్వహించాను. 22 వ తేది పరమంగుడి చేరుకున్నాము. 23 వ తేది వనమధ్యంచేరి అక్కడినుంచి 24వ తేది శుక్రవారంరాత్రి క్షేమంగా అందరమూ మధుర చేరుకున్నాము. మధుర అత్యంత పవిత్రక్షేత్రం కాబట్టి ఏప్రిల్ 3 వ తేదివరకు మేము ఇక్కడే గడిపాము. ఈ తొమ్మిదిరోజులు తరచు మేము మీనాక్షిఅమ్మవారిని, సుందరేశ్వర స్వామిని దర్శించుకున్నాము. రెండు మూడురోజులు నా స్నేహితుడు, బంధువూ అప్పుడక్కడ డెప్యూటీ శిరస్తదారుగా ఉన్న రావిపాటి రామస్వామయ్య నన్ను ఆహ్వానించి వారింట్లో ఉండజేశారు. ఒకరోజు రాత్రి విందుభోజనానికి, బోగంమేళానికి, వెళ్ళాను. కలెక్టరు కచేరీలో కాష్‌కీపరైన రోజ్ పీటర్‌గారిని దర్శించాను. అయన చాలాసంతోషంగా నాకు స్వాగతం పలికారు. ఏప్రిల్ 3 వ తేదిన మధుర విడిచి, మేలూరు, కొట్టంపట్టి, తొరంకురిచి, వెరలమల్లలమీదుగా 1828 ఏప్రిల్ 8 వ తేది, తెలుగు సంవత్సరాది పండుగనాడు, అంటే వ్యయనామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి నాడు తిరుచినాపల్లి ప్రవేశించాము.

తిరుచినాపల్లిలో నా మిత్రులు మానిక మొదలి, పరశురామనాయక్, అప్పాజీరావు వెంకటరావులు నన్ను తమ ఇళ్లకు ఆహ్వానించారు. శ్రీరంగంలో నా మిత్రులు సదరన్ ప్రొవిన్షియల్ కోర్టు పండితుడైన శేషాద్రిశాస్త్రి ఆహ్వానం చేశారు. ఇక్కడ మేము పదమూడు రోజులు గడిపాము. శ్రీరంగం, తిరుచినాపల్లి,

జంబుకేశ్వరపుణ్యక్షేత్రాలలో వున్న వివిధదేవాలయాలను సందర్శిస్తూ ఆ రోజులు గడిపాము. ఏప్రిల్ 20వ తేదిన తిరుచినాపల్లి వదిలి, మద్రాసుకు తిరుగు ప్రయాణమైనాము. ఉట్టుటూరు, వలిగొండపురం, తుటూరు టిటూగూడి, పెన్నాడ్, కీలమంగలం, (గ్రామస్తం పవిత్రక్షేత్రం), వృద్ధాచలం, వలందూర్ పేట, తిరువనల్లూరు, అగరం చందూర్, తిండివనం, అచరవాకం, మధురాంతకం, కరంగూలి, మామందూర్ చెంగల్పట్టు, నందివరం, బొందిలివాడి సత్రం మీదుగా ప్రయాణంచేసి 1828 మే 5వ తేదిన అంటే వ్యయనామసంవత్సర చైత్రబహుళ చతుర్దశి, శుక్రవారం, మద్రాసు సమీపంలోని మైలాపూర్ లేదా సెయింట్ థోం చేరుకున్నాము.

మద్రాసుకు చేరుకున్న వెంటనే నా స్నేహితులూ, సహోద్యోగులందరూ, నన్ను చూడటానికి రావడం నాకు చాలా సంతోషం కలగజేసింది. అన్నిటికంటే సంతోషం కలిగించిన విషయం, నా బావమరిది కోటీశ్వరయ్య మైసూరునుంచి అప్పుడేవచ్చి నాకు కనపడటం. ఇతడు ఆగిలివ్‌గారికి ప్రైవేట్ మున్షిగా ఇదివరలో అక్కడకు వెళ్ళాడు. ఈ ఆగ్లివ్‌గారు, గౌరవనీయులైన జె. హెచ్. డి. ఆగ్లివ్ గారి కొమారుడు. ఈయన మద్రాసు కొన్నిరోజు. ఆ మర్రోజునుంచి నేను కోర్టుకు వెళ్ళి, నా పనులన్నింటి వ్యవహారాలు చూసుకోసాగాను. అటుపిమ్మట మూడు నాలుగు రోజుల తర్వాత మైలాపూరుగుంట లేదా కుల్లంగట్టునవున్న నా చిన్న ఇంటిని వదిలిపెట్టి, ఒక మంచిరోజున 1825 జూలై నెలలో నేను క్రయంచేసిన తోట బంగళాలో నూతన గృహప్రవేశం చేశాను.

1827 మే నెలలో సదరుకోర్టు రిజిస్ట్రారు సహాయోద్యోగి అయిన అలెగ్జాండరు మెక్లీన్‌గారు, ప్రభుత్వం వారి మలయాళం అనువాదకుడిగా నియామకుడై ఒక స్వదేశీయుణ్ణి తనవద్ద సహాయకుడిగా నియమించవలసిందని కోరుకున్నాడు. రెగ్యులేషన్స్ మొదలైనవి ఆభాషలోకి అనువదించడంలో సహాయపడేందుకుగాను, ఈ సహాయకుడవసరమని ఆయన కోరుకున్నాడు. నా బావ మరిది కోటీశ్వరం ఇంగ్లీషు, తెలుగు, కన్నడం, తమిళం, హిందూస్థానీ, మలయాళ భాషలలో మంచి ప్రావీణ్యమున్నవాడు. వాటిపై అధికారం సంపాదించాడు. మొదటి మూడు భాషలకు సంబంధించి కాలేజి బోర్డువారి పరీక్షలు పాసైనాడు. అప్పుడింకా ఏ ఆఫీసులోనూ ఏ ఉద్యోగంలోనూ చేరలేదు. అందువల్ల పైన నేను పేర్కొన్న అధికారి ఇతణ్ణే కోరుకొని, తనవద్ద నియమించుకోడానికి వన్ను

అడిగారు, నాకీవిషయం అంగీకారమేనా అని. అప్పుడు నాఆంగీకారంతెలియజేశాను. మెక్లీన్‌గారునెలకు పదివరహాలజీతంపైన కోటీశ్వరంను ఉద్యోగంలోనియమించారు.

1827 జూన్ నెలలో హానరబిల్ గవర్నర్‌గారైన సర్‌థామస్‌మన్రో గారు దత్త మండలాలు పర్యటించవలెనని నిశ్చయించి మెక్లీన్‌గారిని తమవెంట రావలసిందిగా కోరారు. మెకీన్‌గారు నా బావమరిదిని తనవెంట రావలసిందిగా కోరారు. ఈ కోరికనుకూడా నేను అంగీకరించక తప్పిందికాదు. అందువల్ల మెక్లీన్‌గారితో కోటీశ్వరాన్ని వెంటపంపించాను. గవర్నరుగారి పరివారం గుత్తి చేరగానే, కలరా లేదా మశూచి జాడ్యం అక్కడ ప్రబలి యూరోపియన్‌లను, స్వదేశీయులను చాలామందిని కబళించింది. 1827 జూలై 6వ తేదిన గవర్నరైన సర్ థామస్ మన్రోగారుకూడా మరణించారు. అంతకు క్రిందటిరోజుననే అంటే జూలై 5వ తేదిన తన 22వ ఏట సర్వజితునామ సంవత్సర ఆషాడ శుద్ధ ద్వాదశినాడు, నా నిర్భాగ్యపు బావమరది కోటీశ్వరం, ఈ భయంకర దురదృష్ట వ్యాధికి గురిఅయి గతించాడు. ఈ విషాదవార్త అతడి సహాయోద్యోగి అయిన ఎమ్. రామయ్య అనే అతడిద్వారా నాకు చేరటంతో, 1827 జూలై 11వ తేదీన నేను శెలవు తీసుకొని, కోటీశ్వరం భార్యనువెంటబెట్టుకొని మద్రాసు నుంచి సకుటుంబంగా, నా నిర్భాగ్యపు బావమరిది తల్లిదండ్రులను ఓదార్చటానికి కొనిజేడుకు బయలుదేరి వెళ్ళాను.

రామేశ్వరం యాత్రచేసి మద్రాసుకు నేను తిరిగి వచ్చేనాటికి నా వయసు 42 సంవత్సరాలు. నా మూడో భార్య వయసు 20 సంవత్సరాలు. మాకు సంతానం లేకపోయెనే అని మేము ఉభయులమూ ఎప్పుడూ దిగులుపడుతూ ఉండే వాళ్ళము. పిల్లలపై మక్కువవల్ల, ఆపేక్షవల్ల ఎవరినైనా ఆడపిల్లనో, మగ పిల్లవాడినో పెంపుడు తెచ్చుకుందామా అనికూడా ఆలోచనలు సాగించాము. మా బంధువుల్లో ఎవరిద్వారానైనా అటువంటిది సందర్భపడుతుందేమోనని చూడసాగాము. దైవం మా పట్ల అనుగ్రహించి దానిని సిద్ధింపచేశాడు.

టంగుటూరు జగ్గయ్య అనే ఆయనకు (ఇతని తల్లి వెన్నెలకంటివారి ఆడపడుచు) ఇద్దరు ఆడపిల్లలున్నారు. పెద్దపిల్లకు మూడేళ్ళు ఉన్నాయి. రెండో పిల్లకు ఐదో నెల. ఈ చిన్నపిల్లను పెంపుడిస్తానని ఆయన స్వయంగా వచ్చాడు. ఈ కుటుంబంతో మాకు బంధుత్వం వుందికాబట్టి, పిల్లకు తల్లి చనిపోయింది

చనిపోయింది కాబట్టి తల్లిలేని ఆ పిల్లను పెంపుడు తీసుకున్నాము. ఆతండ్రి తన ద్వితీయవివాహంనిమిత్తం, నన్ను నూరురూపాయలుకోరాడు. నేనునిస్సంకోచంగా ఆమొత్తం అతడికి ఇచ్చివేశాను. పాపం ఈపిల్లకోసమే నేను ఋవ్వవలసివచ్చింది; అతను పుచ్చుకోవలసి వచ్చింది. ఈ పిల్ల 1826 సెప్టెంబరులో నాదగ్గరకు చేరింది. వ్యయనామ సంవత్సర చైత్రబహుళ తదియనాడు 1826 ఏప్రిల్ నెలలో ఈపిల్ల జన్మించింది. మేము సెప్టెంబరు నెలలో పెంపుడు తీసుకొన్నప్పుడు, పంచనద క్షేత్రంలోని అమ్మవారైన ధర్మసంపర్ధనిపేరు ఆ ఆడపిల్లకు పెట్టుకున్నాము. నాటినుంచి మాకడుపున పుట్టినబిడ్డలాగానే పెంచుకుంటూ వచ్చాము. నేనూ నాభార్యాకూడా ఎప్పుడూ లాలిస్తూ, ఈపాపాయితోటి ఆట పాటల్లో వినోదంగా కాలంగడిపాము. ఈ పాపకోసం నేనొక దాదిని కూడా కుదిర్చాను. ఈ పిల్లకు యుక్తవయసు వచ్చిన తరువాత నాభార్య చిన్నతమ్ముడైన పిచ్చయ్యకు ఇచ్చి పెళ్ళి చేదామనుకున్నాము. మా తదనంతరం మా ఆస్థిపాస్తులన్నికూడా ఈ పిల్లకే సంక్రమింపచేదామనుకున్నాము. అయితే నాకు మగగాని, ఆడగాని సంతానం కలగని పక్షంలో ఇట్లా చేదామనుకున్నాము. నాభార్యకింకా అప్పటికి 20 సంవత్సరాల వయస్సే కాబట్టి సంతానం కలుగుతుందనే గట్టి ఆశ మాఉభయులకూ వుండేది.

1827 జూలైలో కొనిజేడు చేరుకొని ఆ పల్లెటూళ్ళో, నాభార్య తల్లిదండ్రులకోసం వసతి అయిన ఒక ఇల్లు కట్టించాను.

నేను, నాభార్య, మా పెంపుడుబిడ్డ ధర్మసంపర్ధని, దాది, ఇంకా ఇతరపనివాళ్ళతో అక్కడ రెండునెలలపైనే వున్నాను. అప్పుడప్పుడు స్నేహితులను, బంధువులను వెళ్ళిచూసి వస్తూవుండే వాడిని. ఈ ఇల్లు కట్టించడానికిగాను నాకు దగ్గర దగ్గర వెయ్యిరూపాయలు ఖర్చయినవి.

1827 ఆగస్టులో సకుటుంబంగా నేను మద్రాసుకు తిరిగి వచ్చాను, సదర్ కోర్టులోను, సుప్రీంకోర్టులోను నాపనులు చూచుకోసాగాను. సుప్రీం కోర్టులో కన్నడం ఇంటర్ప్రిటర్గా నేను నియుక్తుణ్ణి అయిన నాటినుంచి ఒక్క కన్నడం ఇంటర్ప్రిటర్గా మాత్రమే కాకుండా, తెలుగు, తమిళాల ఇంటర్ ప్రిటర్గా కూడా, ఈ రెండుభాషలకు స్థిరంగా నియమించ బడిన ఉద్యోగస్థుడి స్థానంలో, అతడి అనారోగ్యం, ఇతరమైన స్వంతపనులకు సంబంధించి ఆయన

హాజరుకానప్పుడు, నేనే పనిచేయవలసివచ్చి, సుప్రీంకోర్టుకు హాజరవుతూవుండే వాడిని. ఇటువంటి సందర్భాలలో సుప్రీమ్‌కోర్టు రిజిస్ట్రార్ నాకు వ్రాసిన లేఖలలో ఒకదాని నకలు ఈ క్రింద పొందు పరుస్తున్నాను.

వి. సుబ్బారావుకు

అయ్యా,

సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తులు, ఇంటర్‌ప్రిటర్ వై. వీరాస్వామయ్యగారు పనిలో తిరిగిస్ని ప్రవేశించేవరకు, ఈ 'టరమ్' ముగిసేవరకు మిమ్మల్ని ప్రతిరోజు కోర్టుకు హాజరుకావలసిందిగా ఆదేశించమని నన్ను కోరినారు. కోర్టు ప్రతిరోజు ఉదయం 11 గం. లకు సమావేశమై పని చేస్తుంది.

మద్రాసు, రిజష్ట్రార్ ఆఫీస్
ఫిబ్రవరి 3, 1827

మీ విధేయోద్యోగి,
సి. హెచ్. క్లై
డిప్యూటి రిజస్ట్రార్

సదర్ కోర్టులో నాపై అధికారులుకూడా నాపట్ల, నాపనిపట్ల చాలా గౌరవం చూపుతూవచ్చారు. ప్రభుత్వ్యవహారాలలోకూడా నాతో సంప్రదించడం ప్రయోజనకరం అని వాళ్ళనుకొంటూ వచ్చారనడానికి తార్కాణంగా, 1828 అక్టోబరు నెలలో ఒక న్యాయమూర్తిగారు నాకు వ్రాసిన లేఖకు నకలు ఈక్రింద పొందు పరుస్తున్నాను.

1828 అక్టోబరు

సుబ్బారావు,

ఖూనీకేసులో కారాగారంలోవున్న ఒక నేరస్తుడు నిందితుడని తలచినప్పుడు 1818 ఒకటవరెగ్యులేషన్ క్రింద, ఫతవా ఒకాబత్ అయినప్పుడు, అతడికి మరణశిక్ష విధించే అవకాశం లేదా?-రెండోఫతవా అవసరంలేకుండానే?

మరి ఈ సందర్భం ఇట్లావుంటే నెం. 18 మొదటి సెషన్సు పడమటి డివిజన్ నాలుగో బంధితుని విషయంగా అది ఎందుకు కోరుకోవలసి వచ్చింది? అతడు ఒకాబత్‌కు పాత్రుడని నిర్ణయించడం జరిగిందికాదా?

ఫతవాలో ప్రకటించిన ఓకాబత్ శిక్షార్హతక్రింద 4-వ, 6-వ నేరస్తులైన బంధితులకు మరణశిక్షవేయడం జరిగింది. కాని 4-వ బంధితుని విషయంలో అతడు ఓకాబత్‌కు పాత్రుడని ఆదిలోనే నిశ్చితమైంది కనక, రెండవ ఫతవా అవసరం లేనట్లు కనిపిస్తుంది. కాని 4-వ నిర్బంధితునివిషయంలో కూడా అది అవసరంకాదా? ఈప్రొసీడింగ్సులో ఏదో పొసగని విషయం వున్నట్లు కనిపిస్తున్నది. అయితే మీరు మాత్రం దీనిని వివరించగ లరనుకుంటు న్నారు.

మీ మిత్రుడు

24 అక్టోబర్ 1828 జె. కాక్‌రెన్

దీనికి నా సమాధానం దిగువ విధంగా వుంది.

జేమ్సు కాక్‌రెన్ ఎస్క్వైర్‌కు-

అయ్యా,

న్యాయాధీశులచేత నాలుగో నెంబరు బంధితుడు హత్యకుట్రలో పాలుపంచుకొన్నా డనేదానికిగాను శిక్షార్హత పొందినట్లుగా కనపడుతున్నది. 6-వ నెంబరు అతడు హత్యలో ముద్దతుదారుడనే అభిప్రాయపడినారు. కోర్టువారు 4-వ బంధితుని పైన పేర్కొన్న నేరానికిగాను 1818 రెగ్యులేషన్ 1 క్రింద, అతణ్ణి శిక్షాపాత్రుని చేసినారు. అందువల్ల రెండోఫతవా అవసరమైనది. 6వ నెంబరు బంధితుని విషయంలో న్యాయాధీశులు నేరస్థాపనం స్థిరపరచినారు కాబట్టి రెండోఫతవా అక్కరలేకపోయింది. నాలుగో బంధితుడు, ఓకాబత్‌కు అర్హుడని రెండు సందర్భాలలోనూ ప్రకటితం కావడం ఏవిధంగా జరిగిందంటే మహమ్మదీయ న్యాయశాస్త్రంలో అతడిమీద నేరస్థాపనం జరిగిన రెండు విధానాలైన అపరాధాలకు ప్రకటితమైన జరిమానా ఉన్నది.

రెండోది - ఇద్దరు నిర్బంధితులు ఏ నేరానికిగాను శిక్షార్హులైనారో దానికి మహమ్మదీయ న్యాయశాస్త్రాన్నిబట్టికాని, చట్టాలక్రిందకాని నిర్ధారితమైన జరిమానా లేఖ్యమై లేనందువల్ల, 1803 రెగ్యులేషన్ XV సెక్షన్ 7, క్లాజు 3 ను బట్టి, ఉరిశిక్ష విధించడానికి వల్లకాకుండావుంది. మేరి అనిబర్ కేసు(బళ్ళారి)లో శిక్షాపాత్రతన నిర్ధరించేందుకుగాను కోర్టువారు ఈ సూత్రాన్ని ప్రధానంగా గుర్తించినట్లు కనపడుతున్నది. వ్యభిచార నేరానికి మహమ్మదీయ దండన తొలగించి

వేయడమేకాక, ప్రత్యేకంగా దీని ప్రత్యామ్నాయంగా రెగ్యులేషన్‌లలో దేని లోనూ వేరే ఏది చేర్చలేదు.

ఇట్లు
మీ అత్యంత విధేయోద్యోగి,
(సం.) వి. సుబ్బారావు.
కోర్టు, 24 అక్టోబర్ 1828.

1828 అక్టోబర్ మాసాంతంలో సదర్‌కోర్టు రిజిష్ట్రారైన జార్జి జె. కసమేజర్ నెల్లూరు జిల్లాజడ్జిగా నియుక్తులైనారు. ఆయన స్థానంలో కోర్టు రిజిష్ట్రారుగా ఎ. డి కాంప్‌బెల్‌గారి నియామకం జరిగింది. కసమేజర్‌గారు కోర్టును వదిలి వెళ్ళిపోతున్నప్పుడు, ముచ్చటైన ముక్కుపొడి డబ్బీని ఒకదానిని నాకు బహూకరించడమే కాకుండా, రెండు యోగ్యతా పత్రాలుకూడా దయచేసినారు. వాటి నకళ్ళు ఈ క్రింద పొందుపరుస్తున్నాను.

మిస్టర్ జార్జి కసమేజర్, వెన్నెలకంటి సుబ్బారావుపట్ల తన గౌరవం తెలుపుకొంటూ, దినితోపాటు అందజేస్తున్న వెండి ముక్కుపొడిడబ్బీని స్వీకరించ వలసిందిగా అర్థిస్తున్నాడు. ప్రభుత్వోద్యోగిగా ఆయన ప్రదర్శించిన మేలి గుణసంపదకు మిస్టర్ సి.కి అతనిపట్లవున్న గౌరవానికి చిన్న గుర్తింపు చిహ్నంగా దీన్ని బహూకరించుకొంటున్నాను.

ఈ ముక్కుపొడి డబ్బీపైన కసమేజర్ నామాక్షరాలు, సుబ్బారావు నామాక్షరాలు లిఖితమై వున్నాయి. 1828 నవంబరు 21.

ఇంచుమించుగా మూడేళ్ళపాటు సదర్ అదాలత్ కోర్టు రిజిష్ట్రారుగా పని చేసి వున్నందువల్ల ఈ వృత్తిలో వెన్నెలకంటి సుబ్బారావు (కోర్టువారి హెడ్ ట్రాన్స్‌లేటరు) అత్యంత సమర్థుడైన దేశీయోద్యోగి అని చెప్పడంలో నా కేమాత్రమూ సంకోచం లేదు. ఇంతటి సమర్థతను నే నిదివర కెక్కడా చూడలేదు. ఈయన స్థానంలో మరొకరి నెవరినైనా నియమించవలసివస్తే అది అతి దుస్సాధ్యం. ఈయన సేవలు, కోర్టువారి, ప్రభుత్వంవారి పరిగణనకు ఎంతగానో అర్హతమై వున్నాయి.

27 అక్టోబరు 1828. (సం.) జి. జె. కసమేజర్.

నేను ప్రచురించిన మనోకర్షకమైన కథల అనువాదం తాలూకు ముద్రిత ప్రతులు అధికసంఖ్యలో అవసరమై, మద్రాసు స్కూలు బుక్ సొసైటీవారు 1828 మార్చి నెలలో ఈ లేఖను నాకు పంపించారు.

సుబ్బారావుగారికి-

స్కూలు బుక్ సొసైటి మేనేజింగ్ కమిటీవారు మీరు తెలుగులోకి అనువదించిన వినోద కథలు (ప్లీజింగ్ టేల్స్) వెయ్యికాపీలు ఇంకా వారి కవసరమైనందువల్ల అచ్చు వేయించవలెనని తలచినారు. అచ్చుకివ్వబోయేముందు మీరు ఒకసారి దానినిచూస్తే బాగుంటుందనీ, రెండో ముద్రణలో మార్పులూ, చేర్పులూ చేసి మెరుగుపరచ దలచుకుంటే అట్లావేసే అవకాశం ఇందువల్ల లభిస్తుందనీ అనుకుంటున్నారు. నా వ్యక్తిగత అభిప్రాయమే చెప్పవలసివస్తే మార్పులూ, చేర్పులూ చేయాలనికాని, ఇంకా ఇంతకన్నా మెరుగులుదిద్దే అవకాశం వుందనికాని నేను అనుకోవడంలేదు. మీ పుస్తకం చాలా చక్కగా, సమగ్రంగా వుండే వుంటుందని నా గాఢమైన నమ్మకం. కాని గ్రంథకర్తలు ఇంకోరకంగా భావించవచ్చునుగదా!

మీ మిత్రుడు
(సం.) హెచ్. హర్క్‌నెస్
సెక్రటరీ.

కాలేజి
7 మార్చి 1828

ఈ లేఖకు నా సమాధానం ఈ క్రింద పొందుపరుస్తున్నాను.

కెప్టెన్ హెచ్. హర్క్‌నెస్,
కాలేజీ బోర్డు సెక్రటరీగారికి.

అయ్యా,

మీ దయాపూర్వకమైన 7 వ తేదీ లేఖ అందింది. వినోదకథల తెలుగు అనువాదం నిర్దుష్టంగానే వుందనీ, ఆశించిన స్థాయికి అనుగుణంగానే వుందనీ మనవి చేసుకుంటున్నాను. కాబట్టి మీ రాశించే ప్రయోజనం నిమిత్తంగా యీ పుస్తకాన్ని యథాతథంగా అచ్చుకివ్వవచ్చు.

ఉంటాను.

9 మార్చి 1828

మీ అత్యంత విధేయోద్యోగి.
(సం.) వి. సుబ్బారావు

1829 జనవరి 1 వ తేదీనాటికి నా వయస్సు నలభైనాలుగేండ్లపైన ఒక నెల గడిచింది. గడచిన ఎనిమిది సంవత్సరాలలో నా ఆరోగ్యం చాలా దెబ్బ తిన్నది. ఘనతపహించిన కంపెనీవారిని బహుదూరప్రాంతాలలో వివిధ ఉద్యోగ స్థాయిలలో ఇంచుమించుగా ఇరవై ఎనిమిది సంవత్సరాలు సేవించుకొని ఉన్నాను. అయితే ఏమీ సంపాదించి నిలవ చేసుకోలేకపోయినాను. అప్పుడు నేను తీసుకుంటున్న జీతం మొత్తంలో సగం జీవితపర్యంతంగా ఫించన్‌గా పొందే అవకాశం వుండటంవల్ల, ఉద్యోగ విరమణం చేయడం ఉచితమని నేను భావించుకొన్నాను. నా పై అధికారులు, శ్రేయోభిలాషులు ఇందుకు అంగీకరించ రని తెలిసినప్పటికీ ఉద్యోగ విరమణకోసం అనుజ్ఞను కోరుతూ దరఖాస్తు సమ ర్పించుకోవడం జరిగింది. నెలసరి ఫించన్ మంజూరు చేయించవలసిందని క్కోరుతూ, ఈ దిగువ ఉదహరించిన విజ్ఞాపన పత్రాన్ని 1829 ఏప్రిల్ నెలలో సదర్ కోర్టువారికి సమర్పించుకున్నాను.

ఎ. డి. కేంప్‌బెల్, ఎస్కైర్

రిజిష్ట్రార్ టు ది కోర్ట్ ఆఫ్ సదర్ అండ్ ఫౌజుదారి అదాలత్.

కోర్టువారి ట్రాన్స్‌లేటరు, ఇంటర్‌ప్రిటరు అయిన వెన్నెలకంటి సుబ్బారావు వినయపూర్వక విజ్ఞాపన.

అత్యంత వినయపూర్వకంగా తమ దృష్టికి తీసుకొని వస్తున్నదేమంటే ఈ మీ విజ్ఞాపనకర్త, అతడి ఉద్యోగవివరాలు, ఫించన్ కోరుతూ ఉద్యోగ విర మణ చేయవలె ననుకొంటున్న దానికి కారణాలు, మిక్కిలి వినయపూర్వకంగా తెలియజేసుకోవడానికి అనుజ్ఞ వేడుకొంటున్నాడు.

2. ఈ అర్జీదారు మొట్టమొదట 1801 ఏప్రిల్ నెలలో దత్తమండలా లలో వున్న మేజర్ జెనరల్ దగల్డ్ కేంప్‌బెల్ సైనిక పటాలం తాలూకు పే మేస్టర్స్ ఆఫీసులో, ఇంగ్లీషు రైటర్‌గా నియుక్తుడైనాడు. ఈ ఉద్యోగంలోనే ఇతడు 1803 ఆగస్టు వరకు వుండి పనిచేశాడు. ఆ నాటినుంచి 1806 వ సంవ త్సరం చివరవరకు కెనరా కలెక్టర్లక్రింద వివిధ ఉద్యోగాలు చేశాడు. 1805 డిసెంబరునుంచి 1808 వరకు ఉత్తర కెనరా జిల్లాకోర్టులో ట్రాన్స్‌లేటర్‌గానూ, హెడ్ రైటర్‌గానూ ఇతడు పనిచేశాడు. 1810 డిసెంబరునుంచి 1812 సెప్టెం బరు వరకు శ్రీరంగపట్నం జిల్లాకోర్టులో పైన పేర్కొన్న ఉద్యోగం నిర్వ హించాడు. 1812 సెప్టెంబరు నుంచి 1815 మార్చి నెలవరకు నెల్లూరు జిల్లా

కలెక్టరుక్రింద తహసిల్దారూ, ట్రాన్స్‌లేటరుగా నియుక్తుడైనాడు. 1815 ఏప్రిలులో ఇతణ్ణి మద్రాసుకు రాగోరి మీ కోర్టులో ఇతణ్ణి నియమించారు.

3. పైన పేర్కొన్న వివరాలవల్ల ఈ అర్జీదారు ప్రభుత్వంవారి ఉద్యోగంలో మొత్తం ఇరవైఆరు సంవత్సరాలు పనిచేసినట్లు స్పష్టపడుతూనే వుంది. ఇందులో సగంకన్నా ఎక్కువ సంవత్సరాలు అంటే 14 సంవత్సరాలుగా ఇప్పటి యీ పదవిలోనే ఇతడు పనిచేస్తున్నాడు. ఇతని అధికార పదవుల నిర్వహణం గురించీ, సచ్ఛీలానికి సంబంధించీ యోగ్యతాపత్రాలితనివద్దవున్నాయి. 1815లో ఇప్పుడు చేస్తున్న యీ ఉద్యోగంలో ఇతడు ప్రథమంగా ప్రవేశించినప్పుడు, ఐదు సంవత్సరాలుగా చేయవలసిన పని అంతా కుప్పబడి బకాయిపడి వుండటం జరిగింది. ఈ పని యావత్తున్నూ నిర్విరామంగా పనిచేసి ఇతడు వీలైనంత స్వల్పకాలంలో ఒక కొలికికి తెచ్చాడు. ఈ విషయం 1817 జనవరి 1వ తేదీ కోర్టువారి ప్రొసీడింగ్స్‌లో నమోదయ్యే ఉన్నది. యావచ్ఛక్తిని వినియోగించి నిరంతరం పాటుపడి ఇతడు పనిచేశాడు. ఉత్సాహంతోనూ, నమ్మకస్తుడుగానూ తన ముఖ్యమైన విధులన్నిటినీ నిర్వహించాడు. కేవలం తన ఉద్యోగపు విధులను మాత్రమే కాకుండా, కోర్టు శిరస్తదారుకు సంబంధించిన పనులనుకూడా ఇతడు నిర్వహించాడు.

4. ఈ ఉద్యోగంలోనే ఆజీవమూ పని చేయవలెనని ఈ అర్జీదారు అత్యంతమూ కుతూహలియై వున్నప్పటికీకూడా, దురదృష్టవశాత్తూ గత తొమ్మిది సంవత్సరాలనుంచిన్నీ వ్యాధిగ్రస్తుడై తరచు మంచం ఎక్కవలసిన పరిస్థితులు ఇతడికి దాపురించాయి. మూత్రకోశ సంబంధమైన దుర్భరమైన నొప్పులతో ఇతడు బాధపడుతూ వచ్చాడు. ఈ నొప్పులు ఇతణ్ణి మోకాళ్ళదాకా చాలా బాధ పెడుతూ వచ్చాయి. మూత్రకోశంలో రాళ్ళ వ్యాధితోకూడా చాలా హింసకు గురి అవుతూ వచ్చాడు. మూత్ర వ్యాధితో బాధపడుతూ మరిన్నీ గత ఏడాది నుంచి ఉద్యోగవిధులను నిర్వహించుకోవడానికికూడా చాలా అశక్తుడవుతున్నాడు. ఔషధ సేవనంద్వారాను గాలి మార్పుద్వారాను, ఈ జబ్బు నయం చేసుకోవడానికి చాలా ప్రయత్నించి విఫలుడైనాడు. ఈ విధంగా భగ్నమైన ఆరోగ్యంతోను, ఎప్పటికైనా ఆరోగ్యం కుదుటపడుతుందనే ఆశ ఇంచుమించుగా శూన్యం అని తెలిసిపోవడంతోను, ఈ విధంగా మిమ్మల్ని అభ్యర్థించుకోవలసి వచ్చింది. దీర్ఘకాలం నమ్మకస్తుడుగా ఇతడు పనిచేసిన విషయం పరిగణనలోకి తీసుకొని,

అర్థించినదానిని అనుగ్రహించగలరని ఇతడు విశ్వసిస్తున్నాడు. ఈ విజ్ఞాపనంతో పాటుగా వైద్యనిపుణుని ధ్రువపత్రంకూడా జతచేసి సమర్పించుకొంటున్నాడు. దీనిద్వారా, ఇతని దీర్ఘ వ్యాధి ఇతడికముందు ఉద్యోగ విధులు నిర్వహించడంలో ఏ విధంగా అశక్తుణ్ణిగా చేసిందో, మీరు చిత్తగించగలరు. ఈ వ్యాధి చికిత్సకు లొంగేది కాదు అనికూడా నిశ్చితమైపోయింది.

5. ఇంతేకాదు, ఈ మీ అర్జీదారుడు బహుకుటుంబీకుడు అనిన్నీ ఈ కుటుంబంలో కొంతభాగం స్వస్థలమైన ఒంగోలులో ఉంటున్నదని, ఇంకా కొంత భాగం మద్రాసులో ఉంటున్నదని తమకు ఎరుకపరచుకొంటున్నాడు. ఇంత కుటుంబాన్ని పోషించవలసిన ఖర్చులతో, తన జీతంలో ఏ కొంచెం భాగంకూడా అతడు వెనక వేసుకోలేకపోయినాడు.

6. ఇంతేకాకుండా 1813వ సంవత్సరం చాలాముఖ్యమైన ఒక పెద్ద క్రిమినల్ కేసు మద్రాసులో ప్రభువరేణ్యుల సుప్రీమ్ కోర్టు న్యాయస్థానంలో విచారణకు రాగా ఈ విచారణకు సంబంధించిన కన్నడ పత్రాలు, కన్నడం సాక్షులు విచారణ చేయవలసి వచ్చినప్పుడు, ఈ మీ అర్జీదారుని సేవలనే కోర్టు వారు పూర్తిగా వినియోగించుకోవలసి వచ్చింది. సదర్ కోర్టు న్యాయాధీశుల అనుజ్ఞతో సుప్రీమ్‌కోర్టులో కన్నడం ఇంటర్‌ప్రిటర్ బాధ్యతలనుకూడా ఇతడు నిర్వహించవలసి వచ్చింది. ఆనాటినుంచి అంటే అక్టోబరు 1819 నుంచి ఇతనికి ప్రభుత్వం ఇచ్చే నెలజీతం 95 వూలవరహాలు లభిస్తూవచ్చింది. ఏ విధంగానంటే మీ కోర్టువారు 80 వరహాలూ, సుప్రీమ్ కోర్టువారు 15 వరహాలు ఇస్తూ వచ్చారు. రెండు వేర్వేరు పద్దులక్రిందనే ఐనా ఈ రెండు మొత్తాలుకూడా నాకు ఒకే బ్రెజరీనుంచి ముడుతూ వచ్చినవి.

7. ఈ పై చెప్పిన పరిస్థితులన్నిటినీ పురస్కరించుకొని మీ అర్జీదారు కోర్టువారిని మిక్కిలి వినయంగా ప్రభుత్వంవారికి తన అభ్యర్థన విషయమై గట్టిగా సిఫార్సు చేయవలసిందిగా వేడుకుంటున్నాడు. తన నెలజీతమైన 95 వరహాల మొత్తంలో సగం 1827 ఏప్రిల్ 10వ తేదీతో ప్రకటితమైన ఉద్యోగ విరమణ నిబంధనల ప్రకారం, తన ఆజీవపించన్ ఏర్పాటు చేయవలసిందిగా వేడుకొంటున్నాడు. ఈ న్యాయాన్ని, మానవతాపూర్వక ఉపకారాన్ని తనపట్ల

అనుగ్రహించవలసిందిగా ఇది తన విధ్యుక్తధర్మంగా మీ యీ అర్జీదారుడు ఎంతగానో మిమ్మల్ని ప్రార్థిస్తాడు.

మద్రాసు
27 ఏప్రిల్ 1829

(సం.) వి. సుబ్బారావు,
ట్రాన్స్‌లేటరూ, ఇంటర్‌ప్రిటరున్నూ.

సదర్, ఫౌజుదారీ అదాలత్ కోర్టువారు పూర్వోదాహృతమైన విజ్ఞాపనను దయతో పరిగణించి గవర్నమెంటువారికి ఈ క్రింది లేఖను పంపించారు.

నెం. 61 గవర్నమెంటువారి న్యాయశాఖ వీక్లింగ్ సెక్రటరీగారికి-

అయ్యా,

సదర్, ఫౌజుదారీ అదాలత్ కోర్టు న్యాయాధీశుల ఆదేశంమేరకు యీ లేఖను మీకు పంపుకొంటున్నాను. కొన్నిలులో రైటానరబిల్ గవర్నరుగారి సమక్షంలో వారి దృష్టికి తీసుకొనితాగోరి దీనిని పంపుతున్నాను. ఈ కోర్టుకో ట్రాన్స్‌లేటరైన వెన్నెలకంటి సుబ్బారావు ఉద్యోగ విరమణ పింఛన్ అభ్యర్థనకు సంబంధించిన రిజిష్టరును ఇందుతో జతపరచడం జరిగింది.

2 ఈ అభ్యర్థన విజ్ఞాపనంగా సమర్పించడం జరిగింది. 27వ తేదీకల దీని తాలూకు ప్రతినికూడా జతపరుస్తున్నాము. దీనితో అర్జీదారుని ఉద్యోగ కాలపరిమితి వివరాలు, ఉద్యోగవిరమణకు తప్పనిసరిఅయిన ప్రౌద్బలకారణాలు, పేర్కొనడం జరిగింది.

3. ఈ విజ్ఞాపనపత్రాన్నిబట్టి దరఖాస్తుదారు 1801 ఏప్రిల్ నెలనుంచి ప్రభుత్వోద్యోగంలో వుంటూ వచ్చాడనీ, అయితే 1808 నవంబర్‌నుంచి 1810 డిసెంబరు వరకూగల మధ్యకాలాన్నిమాత్రం మినహాయించాలనీ తేలుతున్నది. 1802 ఆగస్టువరకూ దత్తమండలాలలోని మేజర్ జెనరల్ డగర్డ్ కేంప్‌బెల్ సైనిక పటాలపు పేమేష్టర్స్ ఆఫీసులో ఇంగ్లీషు రైటరుగా పనిచేశాడనీ, అటు తరువాత కాలంనుంచి 1806 అంతంవరకూ కెనరా జిల్లా కలెక్టర్లక్రింద వివిధ ఉద్యోగస్థాయులలో పనిచేశాడనీ, 1806 డిసెంబరునుంచి 1808 నవంబరువరకు ఉత్తర కనరా జిల్లా కోర్టులో ట్రాన్స్‌లేటరూ, హెడ్‌రైటరుగానూ నియుక్తుడైనాడని, 1810 డిసెంబరు నాటినుంచి 1812 సెప్టెంబరువరకు శ్రీరంగపట్నం జిల్లా కోర్టులో ఇదే ఉద్యోగంలో ఉన్నాడనీ తెలుస్తున్నది. 1812 సెప్టెంబరునుంచి

1815 మార్చివరకు నెల్లూరు జిల్లా కలెక్టరుక్రింద తహసీల్దారుగాను, ట్రాన్స్ లేటర్‌గాను పనిచేశాడు. 1815 ఏప్రిల్ నెలలో ఈ కోర్టువారి ట్రాన్స్‌లేటర్‌గా ఇతడు నియుక్తుడైనాడు. దీన్నిబట్టి ప్రభుత్వంవారి ఉద్యోగంలో ఇతడు మొత్తం ఇరవైఆరు సంవత్సరాలు పనిచేసినట్లు విశదమవుతున్నది. ఇందులో సగకాలం పైగా ఇతడు ఇప్పుడు చేస్తున్న ఉద్యోగ విధులనే నిర్వహిస్తున్నాడు.

4. కోర్టువారు పరిశీలించి యథార్థాన్ని తామే చూడగలందులకు ఈ విజ్ఞాపన పత్రంతో నియుక్తపత్ర సాక్ష్యాధారాలుకూడా జతపడి వున్నాయి. న్యాయమూర్తులందరూ, సుబ్బారావు తన ఉద్యోగ కాలపరిమితిలో నమ్మకస్తుడుగానూ, ఉత్సాహంతోను శ్రమపడి పని చేశాడనీ, తన ముఖ్యమైన ఉద్యోగ విధులన్నిటినీ చక్కగా నిర్వహించానని అతడు వ్రాసుకున్న యథార్థాన్ని ధ్రువీకరించగలరు.

5. 1817 జనవరి 31 వ తేదీ ప్రొసీడింగ్స్‌లో సదర్‌అదాలత్ కోర్టు వారు ఆ రోజువరకు అతడి సేవలను రికార్డుచేసినారు. అందులో అలసట ఎరుగని అతని పరిశ్రమ, 1815 ఏప్రిల్ 1 న అతడు పనిలో ప్రవేశించిన నాటినుంచి, పేరుకొనిపోయిన బకాయి పనిని (1811 నాటినుంచి ఈ పని పేరుకొనిపోయి వుంది) అతడు ఏవిధంగా పూర్తిచేసిందీ నమోదు చేసినారు. దీనితోపాటుగా స్వాభావికమైన ఉత్సాహము, శక్తి సామర్థ్యాలు, పదవికి అన్నివిధాల యోగ్యత, ఇంకా ఆ ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్న ఇతర పరిగణనలు, పరిశీలించి ఈ కోర్టువారు ప్రభుత్వంవారికి అతని నెలజీతం 80 వరహాలకు పెంచవలసిందిగా గట్టిగా సిఫార్సు చేసినారు. కౌన్సిలులో గవర్నరుగారు ఈ సిఫార్సును సంతోషపూర్వకంగా ఆమోదించారు. (చూ. మిస్టర్ సెక్రెటరి హిల్‌గారి 9 వ తేదీ ఫిబ్రవరి 1817 లేఖ)

6. ఈ గడచిన 12 సంవత్సరాలలో కోర్టులో ప్రవేశించిన తొలి కాలంలోనే సచ్ఛీలాన్ని మహత్తరంగా పాటించినాడు. ఏకాగ్రతతోకూడిన అతని విధి నిర్వహణ, మహత్తర సామర్థ్యము, సర్వకాల సంసిద్ధత, అతడి పై అధికారుల నుంచి నిండు మెప్పును అతడికి సంపాదించిపెట్టినవి.

7. తన ఆజీవమూ యీ ఉద్యోగంలోనే వుండి సేవ చేయవలెననే అమితమైన అభిలాషనే కలిగి ఉన్నప్పటికీ గడచిన తొమ్మిది సంవత్సరాలుగా

సౌఖ్యరహితమైన స్థితిలో, అనారోగ్యంతో బాధపడుతూ వచ్చినాడు. ఇటీవల తన ఉద్యోగవిధులను నిర్వహించడానికికూడా అతడికి చాలా కష్టసాధ్యమవుతున్నది. ఔషధ సేవనంద్వారాను, గాలిమార్పుద్వారాను, వ్యాధిని నిమ్మళింప చేసుకోవాలన్న అతడి ప్రయత్నాలన్నీ విఫలమైపోయినవి. అందువల్ల బాగా దెబ్బతిన్న యీ అనారోగ్య పరిస్థితివల్లనూ, తిరిగి ఆరోగ్యం పూర్తిగా కుదుటబడే అవకాశము ఏమాత్రమూ కనబడక పోవటంతోను, యీ విజ్ఞాపన గత్యంతరంలేని పరిస్థితుల్లో అతడు పంపుకోవలసివచ్చింది. సూపరింటెండింగ్‌సర్జన్‌స్కాట్ ఇతడి ఆరోగ్యాన్నిగూర్చి ఇచ్చిన సర్టిఫికెట్‌ను అర్జీదారుడు జతపరచినాడు. అందులో ఈవిధంగా పేర్కొనటం జరిగింది. సదర్‌కోర్టు ఇంటర్‌ప్రిటర్ సుబ్బారావును తాను ఎరుగుదునని, గత ఎనిమిది తొమ్మిది సంవత్సరాలుగా ఆయనకు వైద్యంచేశానని, ఈకాలంలో సుబ్బారావు తీవ్రమైన మూత్రకోశ సంబంధమైన నొప్పులతో బాధపడేవాడని, మూత్రకోశంలో రాళ్ళుచేరి బాధపడేవాడని, అతడి ఆరోగ్యం చాలా పాడైపోయిందని, ఇటీవల ఆయన వంటినిండా వ్రణాలుకూడా లేచాయని పేర్కొంటూ మొత్తంమీద తన ఉద్యోగవిధులను శక్తిసామర్థ్యాలతో ఆయన ఎక్కువకాలం నిర్వహించలేడని, తాను అభిప్రాయపడుతున్నట్లు" వ్రాశాడు.

8. ఈ కోర్టులో ఆయన తీసుకొనే 80 వరహాల నెలజీతానికితోడు, దరఖాస్తుదారుడు 1819 మొదలుకొని ప్రభువరేణ్యుల సుప్రీంకోర్టులో కన్నడం ఇంటర్‌ప్రిటర్‌గా 15 వరహాల జీతంకూడా తీసుకోవటం జరుగుతున్నది. అందువల్ల ఈయనకు నెలసరి మొత్తంజీతం 95 వరహాలు ముడుతున్నది. వీటన్నిటిని పురస్కరించుకొని అర్జీదారుడు కోర్టువారిని 95 వరహాల మొత్తంలో సగం మొత్తం తన ఆజీవఫించన్‌గా ఏర్పాటు చేయవలసిందని ప్రభుత్వంవారికి సిఫార్సు చేయవలసిందిగా 1827 ఏప్రిల్ 10వ తేదితో ప్రకటితమైన ఉద్యోగ విరమణ ఫించన్ నిబంధనానుసారంగా, తనకాపించన్ లభించేటట్లు చూడవలసిందని అర్థిస్తున్నాడు.

9. సుదీర్ఘకాలము, శక్తిసామర్థ్య సంపన్నము అయిన ప్రభుత్వోద్యోగి ఇరవైఆరు సంవత్సరాల కాలపరిమితిగల సేవలను పరిగణనలోకి తీసుకొని న్యాయమూర్తులంతా ఇతడు జీతపు సగం ఫించనుకు ఎంతగానో అర్హుడని అభిప్రాయపడుతున్నారు.

తీవ్రవ్యాధివలన ఉద్యోగ విరమణం చేయవలసిన తప్పనిసరి పరిస్థితులలో అతడు కోరుతున్న విధంగా ఫించన్ మంజూరు చేయవలసిందిగా సిఫార్సు జేస్తున్నారు. అయితే తమ సిఫార్సు 80 వరహాల జీతంమీద అంటే ఈ కోర్టులో అర్జీదారుని జీతంమీద, 140 రూపాయలు నెలనెలా పొందేట్లుగా మాత్రమే వర్తింపచేయాలని సూచిస్తున్నారు. ఇతడిప్పుడు తీసుకుంటున్న 95 వరహాల జీతంలో సంగం పొందడానికి అర్హుడనే భావిస్తున్నప్పటికీ, ఇంకో కోర్టులో ఉద్యోగం విషయమై సిఫార్సుచేసే అధికారం తమకులేదని భావిస్తున్నారు. ఆ కోర్టులోని ఉద్యోగస్థులకు ఈ ఉద్యోగవిరమణ నిబంధనలు వర్తించకపోవచ్చు.

అయ్యా, మీ అత్యంత విధేయోద్యోగి
అనే గౌరవార్హతనుపొందిన
(సం) ఏ. డి. కేంప్‌బెల్
రిజిస్ట్రార్.

సదర్ అదాలత్ రిజిస్టర్స్ ఆఫీస్
7 మే 1829.

పైన పేర్కొన్న తరఫాస్తుకు గవర్నమెంటు వారినుంచి సదర్‌కోర్టుకు వచ్చిన సమాధానం యీవిధంగా వుంది.

నెం 407 సదర్, ఫౌజుదారి అదాలత్‌కోర్టు న్యాయమూర్తులకు- ఆర్యా, సివిల్ సెక్షన్స్ సూపరింటెండెంటుగారిద్వారా 7వ తేదిగల రిజిస్ట్రార్ జాబు మాకు చేరినట్లు తెలియజేయమని నేను ఆదేశింపబడినాను. కొన్నిటిలో రైటానరబిల్ గవర్నరుగారు మిక్కిలి సంతుష్టితో సదర్ ఆదాలత్‌కోర్టు ట్రాన్స్‌లేటర్ వెన్నెలకంటి సుబ్బారావు ఉత్సాహము, శక్తిసామర్థ్యాలగూర్చి మీరు కనపరచిన యోగ్యతాపత్రాలు, ఆధారాలు పరిశీలించినారు. సంతోషపూర్వకంగా అతడి నెల జీతంలో సగం మొత్తమైన రు. 140 ని (నూటనలభై) మీ సిఫార్సుమేరకు మంజూరు చేసినారు. ఇది తెలియజేయడానికి నేను ఆదేశింపబడినాను.

ఆర్యా, మీ అత్యంత విధేయుడైన ఉద్యోగి
అనే గౌరవంగల
(సం) ఆర్. డి. క్రైవ్
చీఫ్ సెక్రటరీ

ఫోర్టు సెయింట్ జార్జి
5 జూన్ 1829

గవర్నమెంటునుంచి ఈపైన పేర్కొన్న జాబు, తదితరలేఖలు సూపరిం టెండెంట్ ఆఫ్ సివిల్ పెన్షన్స్ (మిస్టర్ ఆస్టన్) నుంచి పెన్షన్ సర్టిఫికెట్, సదర్ కోర్టువారికి యథావిధిగా చేరగానే కోర్టులో నాచార్జిని నా సహాయోద్యోగి అయిన తండాలం జోపనయ్య నాయుడికి అప్పగించాను. ఇతను ఇంతవరకు నా క్రింద సహాయోద్యోగిగా పనిచేస్తున్నాడు. నేను అతణ్ణి తరిఫీదుచేశాను.

1829 జూన్ 11వ తేది నేను ఉద్యోగంనుంచి విరమించుకొన్నాను. ఆరోజునుంచి నాకు నెలసరి పించన్ నూటనలభైరూపాయలు (140) నెల్లూరు జిల్లాకోర్టునుంచి ముడుతూ వచ్చింది. సుప్రీమ్‌కోర్టులో నేను తీసుకుంటున్న నెల జీతంతాలూకు పించన్‌కూడా రాబట్టవలెనని ప్రయత్నం చేశానుగాని, ఆ ప్రయత్నం ఫలించలేదు. నిజానికి సుప్రీమ్‌కోర్టు పించన్‌పొందే అవకాశం ఎంత మాత్రమూలేదని నాకుతెలుసు. నేను పదేళ్లుమాత్రమే ఈకోర్టులో పనిచేశాను. ఈ పదేళ్ళలోకూడా ఎప్పుడో అవసరమైనప్పుడుమాత్రమే కోర్టుకు హాజరై నాను. కన్నడం ఇంటర్‌ప్రిటర్‌గా ఏకొంచెమో ఎప్పుడో పనివుండేదిగాని, అట్టేఎక్కువ పని వుండేదికాదని చెప్పవచ్చు.

1829 జూలై నెలలో మైలాపూరులోని నాతోటను, ఇళ్ళను, సామానులను వేలంద్వారానూ, ఇతరత్రాను అమ్మివేశాను. ఆగస్టు 12న సకుటుంబంగా మద్రాసువదలి నెల్లూరు బయలుదేరాను. మద్రాసులో నాకున్న ఋణాలన్నీ తీర్చివేశాను. నాప్రాపకులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, బంధువులు, అందరివద్దా సెలవు తీసుకున్నాను. అయితే మద్రాసుపదిలి వచ్చేటప్పుడు నా దగ్గర ప్రయాణపు ఖర్చులకుకూడా డబ్బులేదని చెప్పడం సత్యదూరంకాదు.

ఆగస్టు 17వ తేది మేమంతా క్షేమంగా నెల్లూరు చేరాము. 1830 మార్చి 12వ తేదివరకు నెల్లూరులోనే వుండిపోయి, బంధువులను చూసిరావాలని కొనిజేడుకు బయలుదేరాము. అటుతరవాత సెప్టెంబరులో నెల్లూరు తిరిగి వచ్చాము. అక్టోబరులో నాజ్ఞాతి సోదరుడు భద్రయ్య ఒక్కగానొక్క మూతురి పెండ్లిజరిపించాను. నెల్లూరు కరణం వంకాయలపాటి గుడమూర్తి పెద్దకుమారుడు మూర్తిరాజుకు మాపిల్లనిచ్చి పెళ్ళి జరిపించాము. 1830 నవంబరులో నా జ్ఞాతి సోదరుడు వెంకటకృష్ణయ్య మా ఇంట్లోనుంచి తన కుటుంబంతో వేరుపడి పోయినాడు. ఇదేవిధంగా నాతోబుట్టువు, నాచిన్నతమ్ముడు చనిపోయిన లక్ష్మి

నరసు భార్యకూడా మా ఇల్లువిడిచి వేరే వెళ్ళిపోయినారు. వెంకటకృష్ణయ్యకు హక్కు ఏమీలేకపోయినా నెనరుతో రు. 400 లు విలువచేసే ఇల్లు, ఇత్తడి పాత్రలు, ఇంకా కావలసిన కర్రసామాను ఇచ్చాను. ఇంతేకాకుండా అనంతసాగరానికి చెందిన 6½ కుచ్చెళ్ళమెట్ట భూమినికూడా, స్వకుటుంబ పోషణార్థం అతడికి సంక్రమింపచేశాను. దీనివల్ల ఆతడికి సాలుకు నూరు రూపాయలు వస్తాయి. అయితే దురదృష్టంకొద్ది 1831 ఫిబ్రవరి 16వ తేది అంటే విక్రతినామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ చవితి, రాత్రి 8 గంటలకు ఆతడు అసువులు బాశాడు. ఇతడికి నాకూ, నా చిన్నతమ్ముడు లక్ష్మీనరసు వితంతువుకూ నాకూ మధ్య రాతకోతల దస్తావేజులు జరిగినవి.

నెల్లూరులో మాయింటి ముందటిభాగం పాతదై కూలిపోయేట్లువుండగా వెంటనే దాన్ని తీసివేయించి, వరండాలతో మంచికప్పుతో మరామత్తులు చేయించటం మంచిదని తోచింది. ఈకొత్త కట్టుబడికి ఇంచుమించుగా నాకు వెయ్యి రూపాయలదాకా ఖర్చయింది.

1830 డిసెంబరునెలలో నా మూడో భార్య కనకకు నెల్లూరులో వుండగానే గర్భలక్షణాలు పొడకట్టాయి. చిరకాలంనుంచి ఎదురుచూస్తున్న ఈ శుభవార్తకు స్నేహితులు, బంధువులు ఎంతగానో ఆనందించారు.

1831 మే 28వ తేది నేను, నాభార్య, పెంపుడుబిడ్డ ధర్మసంవర్ధని, నెల్లూరునుంచి కొనిజేడు బయలుదేరాము. తన తల్లి దండ్రులు, అక్కాచెళ్ళెళ్ళ మధ్య వారిదగ్గర పురుడుపోసుకోవాలని కనక కోరిక.

1831 జూలై 10వ తేది ఖరనామసంవత్సర ఆషాడశుద్ధ పాడ్యమి, ఆదివారం రాత్రి 9 గంటల 5 నిముషాలకు నాభార్య కనక నాకు ఔరసుణ్ణి, నా ఆస్థికి అధికారిని, నాకుమార్తణ్ణి సుఖంగా ప్రసవించింది. పురిటికి సంబంధించిన శుభాలన్నీ జరిపించాము. నా స్నేహితులందరికీ ఈ సంతోషకరమైనవార్త లేఖల ద్వారా తెలియపరచడం జరిగింది. మద్రాసు, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళాలలో, ఇంకా ఇతరచోట్ల చక్కెర పంచిపెట్టడం జరిగింది. కాని ప్రసవించిన పదోరోజున నిర్భాగ్యురాలైన నాభార్య కనకకు జబ్బుచేసింది.

1881 జూలై 20వ తేదిన పైనపేర్కొన్న అదే సంవత్సరం అదే మాసం, శుద్ధ ఏకాదశి బుధవారం సాయంకాలం 6½ గంటలకు ఇద్దరు పిల్లలను నాకు విడిచి నన్ను పుట్టెడు దుఃఖంపాలుచేసి నా కనక కన్నుమూసింది.

నాస్నేహితులు నాకు మగసంతానం కలగటానికి ఎంతగా సంతోషించారో ఈక్రింద పొందుపరచిన నామిత్రుడి లేఖద్వారా తెలుసుకోవచ్చు. మద్రాసు నుంచి నాకు ఆప్తుడు, అమూల్యమిత్రుడు అయిన చొక్కప్పచెట్టియార్‌నుంచి నాకు ఈ జాబు వచ్చింది.

మద్రాసు జూలై 18, 1881

ప్రియసోదరా (సుబ్బా)

అత్యంతాదరంతో దయతో నీవుప్రాసిన జాబు, మన అమూల్యమిత్రుడు టి. బాపనయ్య నాయక్‌ద్వారా, చక్కెరతోసహా నాకు అందింది. ఇంతకన్న ఆనందకరమైనవార్త ఏముంటుంది నాకు ! నాసోదరి సుఖంగా ప్రసవించిందని, కొడుకుపుట్టాడని, సుఖప్రసవం తరవాత తల్లీ పిల్లవాడూ క్షేమంగా ఉన్నారనీ తెలిసి ఎంతో సంతోషపడుతున్నాను. మళ్ళీ నీనుంచి లేఖవస్తూ వుంటుందని తల్లి పిల్లవాడు నీకు వినోదమాధుర్యం అందిస్తున్నారని ఆ జాబులో నేనువింటాననీ, నీ కొడుకు 'నాన్న' అని నిన్ను పిలిచినప్పుడంతా నీహృదయం అనిర్వచనీయమైన తృప్తితో పూగిసలాడుతుందనీ, నేనువచ్చి చూసినప్పుడు, అట్లా మీ అబ్బాయి నిన్ను 'నాన్న' అనిపిలుస్తూ వుంటాడని భావిస్తున్నాను.

నీకు మంచికుమారుణ్ణి అనుగ్రహించినందుకు భగవంతుని పరమకృపాళుత్వానికి, అనంతమైన మేధాసంపదకు మనం కృతజ్ఞులమై వుందాము. ఈ పిల్లవాడు గొప్ప విద్వాంసుడవుతాడు. మేమంతా ఈ అబ్బాయిని 'అనేకభాషల్లో గొప్ప ట్రాన్సలేటర్' అని ముద్దుగా పిలుచుకుంటాము. నాకృతజ్ఞతలు, నా కుటుంబం అభినందనలు పరమయోగ్యురాలైన సౌభాగ్యవతి నా చెల్లెలుకు అందజేయాలని కోరుతున్నాను. నీ చెల్లెలు (నా శ్రీమతి) వలెనే మాచెల్లెలుకూడా, ఇంకా ఇంకా నీకు సంతానాన్ని ఇవ్వాలని ఆశిస్తున్నాను.

నీ చొక్కప్పచెట్టి.

ఈ జాబూ ఇంకా వివిధ ప్రాంతాలనుంచి ఇటువంటి అభినందనలేఖలూ ఊరకముందే నిర్భాగ్యపు కనక కన్నుమూసింది. నేనెన్నటికి మరచిపోలేని ఆ విషాద ఘడియల్లో ఎంతో గుండెనిబ్బరంతో స్పష్టమైన స్వరంతో ఇట్లాచెప్పింది నాకు.

"ఏమండీ, నేను మీతో పడమోనేళ్ళు కాపరంచేశాను. బహుశా ఏనాడూ మీమనసుకి ఏమీ అసంతృప్తి కలిగించకుండానే మసలుకున్నాననుకుంటాను. మీరు నన్ను ఎట్లాచూడాలో అట్లానే చూసుకున్నారు. నేనుమిమ్మల్ని శాశ్వతంగా వదిలిపెట్టి వెళుతున్నాను. మీ పిల్లవాణ్ణి మీకు అప్పగించి దీనితో నాఋణం మీకు తీర్చుకుంటున్నాను. మనబిడ్డ (ధర్మసంవర్ధని)ని మీకు అప్పగింత చేస్తున్నాను. ఈపిల్లకు మీరు పెళ్ళిచేస్తారు. దిక్కులేని నా తల్లిదండ్రులను కనిపెట్టిపుండండి. మీకు ఇంకా నేను చెప్పాల్సించి ఏమీలేదు".

ఈ మాటలు మరణశయ్యమీదినుంచి చెప్పి నిర్భాగ్యురాలైన నాఇల్లాలు కన్నుమూసింది. ఆమెప్రాణంపోయేముందు నాకోరికపైన 'రామ' నామం మూడుసార్లు ఉచ్చరించింది. ఆమె కర్మాంతరాలన్నీ కొనిజేడులోనే జరిపాను. తల్లిలేని నా దురదృష్టపు కన్నకొడుకు ఆలన పాలనకు ఒకదాదినిపుదిర్చి, నా భార్య తల్లిదండ్రులకు, అక్కచెల్లెళ్ళకు పిల్లవాణ్ణి పెంచేభారం అప్పజెప్పాను.

నాకు పుత్రుడు, ఉత్తరాధికారి, వారసుడు జన్మించడంవల్ల, పెంచుకున్న పిల్లి ధర్మసంవర్ధనికి నా ఆస్తిపాస్తులపై తదనంతరహక్కు, స్థిరచరాస్తులకు సంబంధించినదేమీ లేకుండాపోయింది. ఏమంటే హిందూన్యాయశాస్త్రం అనుసరించి, మగపిల్లవాడి జననం తల్లిదండ్రులకే తమఆస్తి యథేచ్ఛగా అమ్ముకొనే హక్కును లేకుండాచేస్తుంది. ఆ ఆస్తియావత్తుకూ తదనంతరకర్తృత్వం ఆ పిల్లవాడికే చెందుతుంది.

1881 ఆగస్టునెల మొదట్లో కొనిజేడునుంచి మా పెంపుడుకూతురు ధర్మసంవర్ధనిని వెంటతీసుకొని మావస్తువులన్ని తీసుకొని, మాబంధువులందరినీ చూద్దామని ఒంగోలుకు బయలుదేరాము. 1881 ఆగస్టు 11వ తేది ఒంగోలునుండి పొందూరు బయలుదేరివెళ్ళాము. ఖరనామ సంవత్సర శ్రావణశుద్ధ పంచమి శుక్రవారం 12వ తేది పొందూరులో నానాలుగోవివాహంజరిగింది. పెట్లూరి రామదాసుగారి ఏకైక పుత్రిక మహలక్ష్మితో నాయీ వివాహం జరిగింది. పెళ్ళి

టాగానే జరిగిందని చెప్పవచ్చు. ఆగస్టు 17వ తేది బుధవారంనాడు నాభార్యను ఆమె తల్లిదండ్రులను ఆమెసోదరుణ్ణి, ధర్మసంవర్ధనిని వెంటతీసుకొని 1881 సెప్టెంబరులో నెల్లూరు చేరాను.

కనక అకాలమరణం నన్ను చాలా క్కుంగతీసింది. నేను ఆ దుఃఖంనుండి తేరుకోలేక పోయినాను. ఈ దుఃఖంతో నెల్లూరులో నేను కొన్నాళ్ళు మంచంపా లై నాను. కనక చాలా చక్కనిది. దానికితోడు బహుయోగ్యురాలు. అందువల్ల నాకు ఆ సుగుణాలన్నీ ఏనాటికి మరపుకు వచ్చినవికావు. ఆమె భర్తపట్ల చాలా అణకువ, విశ్వాసంగల ఇల్లాలు. పిల్లల, పోష్యుల సంరక్షణంలో బహు సమర్థు రాలు. చాలా సహనంగల ఇల్లాలు. ఆమె ప్రతివిషయంలోను నడచుకొన్నతీరు, బంధువులు స్నేహితులు ఇరుగుపొరువారిపట్ల ఆమె కనపరచిన సంస్కారం, నాజూకుతనం ఎన్నటికి మరువరానివి. డబ్బుఖర్చు విషయంలోను, సంసార నిర్వహణంలోను సమయపాలన, నేర్పు, అమితంగా ప్రదర్శిస్తూవుండేదామె. ఒక్కమాటలో చెప్పాలంటే అమితమైన చురుకుదనం, తెలివితేటలు, ఇష్టాగోష్ఠి ప్రసంగాలలో వాక్చాతుర్యం కనపరుస్తూవుండేది. చాలా నిబ్బరమూ, పరిపక్వ మైన విచక్షణ కనపరిచేది. నేను ఎప్పుడైనా ఏవిషయంలోనైనా దారీతెన్నూ తోచక ఆమె సలహాను కోరినప్పుడు వెంటనే సలహాచెప్పేది. నాఅంతటి పరమ నిర్భాగ్యుడెవడూవుండడు. అటువంటిరత్నంవంటి నేర్పరి ఆయిన భార్యను పోగొట్టుకున్నాను. వాస్తవానికి నాలో మనఃస్థిమితమే లేకుండాపోయింది. నా పనులలో సహజశక్తిసామర్థ్యాలన్నీ ఎంతగానో కుంటుపడిపోయినవి. ఇంటి దగ్గరవుంటే ఏమాత్రమూ ఓదార్పు కనపడదని తెలుసుకొని దక్షిణదేశంలో ఈవరకు నేను చూడని పుణ్యక్షేత్రాలను చూచివస్తే ఏమైనా శాంతి కలుగుతుం దేమోనన్న ఆలోచన కలిగింది. దీని కనుగుణంగా 1881 అక్టోబరు 1వ తేది మేనాలో బయలుదేరి నెల్లూరువిడిచి దక్షిణయాత్ర ప్రారంభించాను. కొంతమంది పరివారాన్నికూడా వెంటవుంచుకున్నాను. మూడురోజుల తరవాత కాళహస్తి, లేదా శ్రీకాళహస్తి అనే క్షేత్రం చేరుకున్నాను. పరమ పవిత్రమైన ఆక్షేత్ర దైవతాన్ని దర్శించుకొని, ప్రయాణం తిరుపతిదాకా కొనసాగించాను. కొండ యెక్కి శ్రీవెంకటేశ్వరుని దర్శించుకున్నాను. ఇక్కడకు చేరేసరికి నాకు అస్వస్థత కలిగింది. తిరుపతిలోనే నాకుసూచనగా, దక్షిణప్రాంతంలోను పడమటి ప్రాంతంలోనూ కలరా వున్నట్లు తెలిసింది. గత్యంతరంలేక, నా ఇష్టానిష్టాలతో

నిమిత్తంలేకుండా మళ్ళీ తిరిగి నెల్లూరికి చేరుకోవాల్సి వచ్చింది. 1831 అక్టోబరు 11వ తేదిన నెల్లూరుకు చేరుకున్నాను. నామిత్రుడు, బంధువూ ఏనుగుల వీరాస్వామయ్యనుంచి ఆతరవాత కొన్నిరోజులకు నాకొక లేఖవచ్చింది. ఆయన మద్రాసులోని ఘనమైన మహాప్రభువరేణ్యుల సుప్రీమ్‌కోర్టు న్యాయస్థానంలో ఇంటర్‌ప్రిటర్‌గా వున్నారు. పాఠకులు తెలుసుకోగలగడానికి ఈలేఖ ప్రతిని నేనిక్కడ పొందుపరుస్తున్నాను.

నా ప్రియమైన సుబ్బన్నా,

ఏకకాలంలోనే నిన్ను అభినందించటము, నీకు సానుతాపం తెలియజేయ వలసిరావటమూ నాదురదృష్టం. ఇది నాపాలబడింది. సుబ్బన్నా, ఇదీప్రపంచం. ఇందులోకి పరీక్షకోసమే మనంపంపబడ్డాము. అన్నిమతాలవారూ ఈవిషయంలో ఏక వాక్యతనే కనపరుస్తారు. ఈప్రపంచంలో సుఖసంతోషదాయకాలని మనం భావించే సంఘటనలన్నీ నిజానికి శాపబంధనాల వంటివి. పరమార్థం తెలుసుకొనేదృష్టి లేకపోవడంకూడా యీవిషయంలో మనం తప్పుదోవ తొక్కడానికి హేతువవుతున్నది. ఉదాహరణకు, మనకందరికీ తెలుసు-మనం పుట్టడమనేది చావడానికేనని. అయినా మృత్యువంటే మనకు పరమభీతి. మనమిత్రుల మృతికి అలమటించిపోతాము. బంధువియోగానికి పలవిస్తాము. పుట్టుట గిట్టుటకొరకే అని వీళ్ళవిషయంలోమాత్రం మనకు తెలియదా? వస్తుజాతవిషయానికి వగచిపనిలేదు. మనకుతెలుసు. ప్రతిక్షణం అవి నశించిపోతూవుండే అవకాశంవుంది.

కనకమ్మ వియోగాన్ని నీవు మరచిపోగలుగుతావని ఆశిస్తాను. ఆమె పేరు సార్థకమైనది. గుణశీలాదులవల్ల, రూపంచేత ఆమె ఆపేరుకు అన్నివిధాలా తగినదని నిరూపించుకొన్నది. అయితే నీవు మిగిలినజీవితాన్ని భగవంతుడనుగ్రహించిన యీ చిన్నిభార్యతో, యీకొత్త ఇల్లాలితో మనఃస్థిమితంతో గడపగలవని ఆశిస్తున్నాను. ఈమెకూడా సంప్రదాయంగల మంచికుటుంబంలోంచి వచ్చిందని నేను విన్నాను. ఈమె చక్కదనమూ యోగ్యతాకూడా కనకమ్మకు మించకపోయినా తీసిపోయేవికావని విన్నాను. ఈ సందర్భంగానూ, నీకు పుత్రుడు జన్మించాడని విన్నతరవాతనూ, ఆపిల్లవాడు చిరంజీవికావాలని కోరుకుంటూ, నిన్ను హృదయపూర్వకంగా అభినందిస్తూ వున్నాను. ఈ అభినందనలు స్వీకరించవలసిందిగా వేడుతున్నాను.

నీకూ తెలుసు నీవు చొక్కప్పకు వ్రాసినలేఖలో వ్రాసిన విషయం చిన్న పిల్లల మాటగాపుండని, ప్రాజ్ఞులనదగినది కాదని. ఏమంటే నీవు చొక్కప్పకు వ్రాసిన ఉత్తరంలో 'దాన్ని పోగొట్టుకొని దీన్ని పొందడంవల్ల నాకేమిప్రయోజనం' అంటూ వ్రాశావు. సర్వశక్తుని నిర్ణయంలో ఇది దోషంకాదు. మనకు ఏమి తీసుకొనవలెనో, మరుగా ఏమి ఇవ్వవలెనో ఆయనకు బాగాతెలుసు. జ్ఞానులైనవాళ్ళు ఎప్పుడూ తమకిచ్చినదానితోనే తృప్తిపడతారు. పోగొట్టుకున్న దానికోసం పరితపించరు: కాబట్టి ఈ సమయంలో నీవిద్య, జ్ఞానము అంతా కలబోసి ఆలోచించమని ప్రార్థిస్తున్నాను. మనసుకి ఓదార్పు లభించటానికి కనరావెళ్ళే ఉద్దేశం నీకున్నట్లు నీవు చొక్కప్పకు వ్రాసినలేఖలో చూశాను. ఎంతమాత్రమూ ఇట్లా చేయవద్దు. మనస్సును చిక్కపట్టుకోకుండా ఏప్రదేశానికి వెళ్ళినా ఓదార్పుఅంటూ కలగనేకలగదు. చిన్నఇల్లాలు, పసిబిడ్డడైన కొడుకు ఇప్పుడు నీ ఆలనాపాలనాకోసం చూస్తున్నారు. నీకోసం కాకపోయినా వీళ్ళిద్దరి విషయంలోనైనా వీళ్ళకు న్యాయం చేకూర్చు. ఇప్పుడున్న నీ మనఃస్థితిని నివారించుకొని మన పవిత్ర గ్రంథాలన్ని ఏంబోధిస్తున్నాయో వాటిసారాంశం మననంచెయ్యి. అవి నీకు తప్పకుండా ఓదార్పు లభింపచేస్తాయని నా నిశ్చయం. నీకు మంచి ఆరోగ్యమూ, మానసిక స్వస్థత కలగాలని కోరుతూ, వాత్సల్యంతో, నిండుమనసుతో,

ఉంటాను

(సం.) వై. వీరాస్వామి.

ఈక్రింద ఉదాహరిస్తున్నలేఖ, మద్రాసునుంచి నా ఆప్తమిత్రుడైన చొక్కప్ప చెట్టియారు నేను నెల్లూరు చేరుకొన్న తర్వాత నాకు వ్రాసినలేఖ.

మద్రాసు. 24 నవంబరు 1881

నా ప్రియసోదరా,

నీవు దయతోను, అభిమానంతోను వ్రాసిన 20వ తేది ఉత్తరం నాకందినదని తెలియజేయడాని కానందిస్తున్నాను. నీవు నెల్లూరుకు తిరిగివచ్చిన విషయం తెలిసి సంతోషించాను. పరమేశ్వరుడు మనకు అనుగ్రహించిన దానితో తృప్తి

పడాలి, సంతోషపడాలి. నీవు పెళ్ళి చేసుకున్న తర్వాత మళ్ళీ ప్రయాణాలకు పూనుకోవడం మంచి ఆలోచనకాదు.

మనఃపూర్వకంగా
(సం) చొక్కప్ప చెట్టి

1831 నవంబరు 12వ తేది అంటే ఖరనామ సంవత్సర కార్తీకశుద్ధ అష్టమి శనివారం అంటే తులలో 29వ రోజు నా నాలుగోభార్య మహలక్ష్మి వ్యక్తురాలైంది. తరవాత పదిరోజులకు, అంటే నవంబరు 21వ తేదిన, కార్తీక బహుళ విదియ ఆమెను కాపరానికి పంపించారు. నెల్లూరులో ఈ తంతుకాస్తా జరిపినారు.

సమస్త జాతులవారికి ఉపయుక్తంగా వుండేట్లు రద్దీగల రహదారిలో ఒక సత్రం నిర్మించాలని నాకు బహుకాలంనుంచీ ఒక కోరిక వున్నది. నెల్లూరుజిల్లా ప్రధాన కలెక్టరైన మిస్టర్ జె. సి. విష్‌గారికి నా యీకోరిక తెలియజేశాను. నా కోరికకు ఆయన సంతోషపూర్వక సమ్మతి తెలియజేసినారు.

1832 జనవరి 21 తేదిన సెటిలుమెంటు పనులమీద ఆయన ఉత్తరజిల్లా పర్యటనకు నెల్లూరునుంచి బయలుదేరాడు. నేనుకూడా ఆయనవెంట బయలుదేరి రామాయపట్నం, సింగరాయకొండలమధ్య నేను సత్రం నిర్మించడానికి నిర్ణయించుకొన్న స్థలం చూపేటందుకు వెళ్ళాను. వాటిమధ్యదూరం 14 మైళ్లు (సుమారు). ఈ మధ్యలో ఒకసత్రం వుండడం అత్యంతావశ్యకమని నేనుభావించడం, ఈస్థల నిర్ణయం చేయడానికి ప్రేరేపించింది. విష్‌గారు ఆప్రదేశాన్ని సందర్శించి, ఈభూమి చాకిచెర్ల పౌరులకు చెందింది కాబట్టి వాళ్ళ అనుమతితో తమ అంగీకారాన్ని, అక్కడ సత్రం నిర్మించడానికి తెలియజేశారు. ఆయనకు నేను చాలా కృతజ్ఞుడనై వుండాలి. కావలిముఠాకు చెందిన 200 తాటిచెట్లను నాకిప్పించడమేకాక, కమ్మరి, వడ్రంగి మొదలైన పనివాళ్ళను కుదర్చడంలోనూ ఇంకా సేవకులను కుదుర్చుకోవడంలోను, చాలా సహాయం చేశారు. రామాయపట్నం ఏక్టింగ్ సబ్‌కలెక్టరు మిస్టర్ థామస్ ప్రెండర్‌గాస్ట్, నా పూనికకుచాలా సంతోషించి, తమ చేతనైనంతసాయం చేశారు. అటు తరవాత నేను చేవగల కలపకొన్నాను. కావలసిన సేపాళబద్దలు, కడ్డీలు, ఇనపమేకులు, అన్నీ మద్రాసునుంచి తెప్పించాను. చాలామంది పనివాళ్ళనుపెట్టి 1832 మార్చి 1 తేదిన పని

ప్రారంభించి మిస్టర్ విష్‌గారికి, మిస్టర్ ప్రెండర్‌గాస్ట్‌గారికి యీవిషయం తెలియచేశాను. మద్రాసులోని నాస్నేహితులందరికీకూడా యీవిషయం తెలియ పరిచాను.

ఖరనామసంవత్సర మాఘశుద్ధ నవమికి సరిఅయిన 1882 ఫిబ్రవరి 10వ తేది శుక్రవారం, నేను కొనిజేడులో నా కొమారునికి అన్నప్రాసన జరిపించాను. పిల్లవాడికి ఆదిశేషయ్య అని ఆరోజున నామకరణం చేశాను. వాళ్ళ అమ్మ మరణశయ్యమీద, పిల్లవాడికి ఆపేరు పెట్టవలసిందిగా నన్నుకోరింది. పిల్లవాడికి అప్పటికి ఎనిమిదోనెల వచ్చింది. ఆరోగ్యంగా చక్కగా పెరుగుతున్నాడనిపించింది. భగవంతుడు దీర్ఘాయుష్షు ప్రసాదించుగాక. ఈపిల్లవాడి వ్యవహారనామం వెంకటజోగి గోపాలరావు.

1882 మార్చి 1వ తేదిన నా వయసు 47 సంవత్సరాల 8 మాసాలు. ఊగూరులో నా జననకాల గ్రహస్థితినిబట్టి అటు తరవాతకూడా జ్యోతిషశాస్త్ర వేత్తలలో గొప్ప గొప్ప పండితులు కొందరు అప్పుడప్పుడు చెప్పినదానినిబట్టి-ఈవిధంగా జాతకం చూపించుకోవడానికి నేను చాలాడబ్బు ఖర్చుచేశాను- నా ఆయుర్దాయం ఇంకా చాలాకాలంవుందని తేలినా, నా ఆరోగ్యహీనతనుబట్టి క్షీణించిన జీవసత్వాలనుబట్టి, తరవాత తరవాత శరీరస్థితిద్వారా నాకు కలిగిన అనుభవాలనుబట్టి, ఆ జోస్యం నిజంకాబోదని నాకుతోచింది.

మద్రాసు సదర్ కోర్టులో ఉన్నతపదవి, సంతృప్తికరమైనపదవీ అయినా ఉద్యోగవిరమణ చేస్తున్నప్పుడు నా స్వస్థలంలో సుగుణవతి, ప్రేమస్వరూపిణి, అయిన నా ఇల్లాలు కనకతో ప్రశాంతంగా గడుపుదామనుకొన్నాను. ఏ కనక మృతి ఇవాల్టికి, ఇవాల్టికేకాదు, ఏనాటికికూడా నాకు తీరని దుఃఖాన్ని కలిగిస్తూ ఉంటుందో ఆ కనకతో గడుపుదామని, ముందు ముందు నా ఆరోగ్యం వయోచితంగా కుదుటపడుతుందనీ ఆశించాను. కాని నేనుచేసిన పొరపాటుకు ఇప్పుడు చాలా బాధపడుతున్నాను. అయినా ఇప్పుడునేను చేయగలిగిందిలేదు. మద్రాసులో నా ఉన్నతపదవిని నేను విడిచిపెట్టక పోయినట్లయితే, తీవ్రమైన నా శరీర అస్వస్థతనుబట్టి అక్కడే ప్రాణాలు విడిచిపెట్టి వుండేవాణ్ణి. కనక మృతివల్ల ఇప్పుడనుభవిస్తున్న దురంతవేదన అనుభవించకుండా తప్పించుకొనేవాడిని.

నెల్లూరు చేరుకున్న తర్వాత నాకు కావలసిననాడు, నా జ్ఞాతిసోదరుడు వెంకటకృష్ణయ్యను పోగొట్టుకున్నాను. నా బంధువు, కూర్చుమిత్రుడు మంచెళ్ళ రామకృష్ణయ్యను పోగొట్టుకున్నాను. కడపటికి దురదృష్టవంతురాలు నా కనకను పోగొట్టుకున్నాను. ఈ మూడు చావులూ ఐదునెలల వ్యవధానంతోనే సంభవించటంతో, రోజురోజుకీ నాముఖం కిట్టడిముబ్బడి అవుతూవచ్చింది తీవ్రమైన ఈ దుఃఖోద్వేగంవల్లనో, వాతావరణ పరిస్థితులు నా శరీరానికి అనుకూలించక పోవడంవల్లనో నా ఆరోగ్యం బాగా పాడైపోయింది. త్వరలోనే నేనుచనిపోవడం ఎంతమాత్రమూ విపరీతమైన విషయమేమీకాదు. ఆశ్చర్యం కలిగించేది అసలే కాదు.

ఇదివరలో పేర్కొన్న ధర్మసత్రం కట్టుబడికిగాను ఆరునెలలపాటు నేను అక్కడేవుండి అన్నిపనులు చూసుకోవలసి రావడంతో, ఆ ప్రదేశంలోనే సకుటుంబంగా వుండి ఆ కట్టుబడి పర్యవేక్షించాను

1882లో కొంతభాగం కట్టుబడి పూర్తికావడంతో నెల్లూరుకు మేముతిరిగి వచ్చాము. అక్కడ నవంబరు 15 వరకు వుండి మళ్ళీ స్థానానికి వచ్చాము. ప్రిన్సిపల్ కలెక్టరుగారైన విష్‌గారికి ఆప్రదేశాన్ని సత్రంనిర్మాణంకోసం మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు సమర్పించాను. ఈ విషయంలో బద్దెపూడి తహసిల్దారును పోయి కలుసుకోవలసిందిగా ఆయన ఆదేశించారు.

1882 నవంబరు 24 తేది ఆదివారం మా మామగారు పెట్టూరు రామదాసుగారు హఠాన్మరణానికి గురిఅయినారు. పొందూరులో ఆయన కర్మాంతరాలన్నీ జరిగాయి.

డిసెంబర్ నెలలో పొందూరును వదలి మాసత్రం దగ్గర వారంరోజులు మకాంచేసి మేము(నేను, నాభార్య, ఆవిడతల్లి, సోదరుడు, మూపెంపుడుకూతురు) యాత్రలకు బయలుదేరాము. ఈ కట్టిస్తున్న సత్రానికి నేను కనకమ్మసత్రం అని పేరుపెట్టాను. మద్రాసులోని గవర్నమెంటు గజటు సంపాదకుడికి, 1883 'అల్మనా' లో యీవిషయం చేర్చవలసిందిగా దరఖాస్తు పంపుకున్నాను.

1882 డిసెంబరు 17వ తేది సోమవారం సత్రంవిడిచి బయలుదేరి 19వ తేది నెల్లూరు చేరాము, 24వ తేది కాళహస్తి, 26 తిరుపతి, 28న చంద్రగిరి

చేరాము. చంద్రగిరిలో నా పూర్వకాలపు స్నేహితుడు మద్దూరు సుబ్బారావును చూడటానికి ఆగాను. మళ్ళీ తిరుగు ప్రయాణంలో తిరుపతి 1వ తేదిన చేరాను. తిరువళ్ళూరుమీదుగా మద్రాసుకు ప్రయాణంచేసి 1888 జనవరి 10వ తేదిన రాజధాని చేరుకున్నాము. మద్రాసులో సుమారు వారంరోజులు గడపిన తర్వాత ఇంకా దక్షిణానికి ప్రయాణం సాగించాము.

కంజీవరం, పాండిచ్చేరి, కడలూరు, చిదంబరం, మాయవరం, కుంభకోణం, తిరువాలూరు, రాజమన్నార్‌కోవిల్, పంచనదాలమీదుగా 1888 ఫిబ్రవరి 19వ తేదిన తిరుచునాపల్లి చేరుకున్నాము. అక్కడ ఆరువారాలుండిపోయి మళ్ళీ ప్రయాణం సాగించాము. అవదయార్ కోవిల్‌మీదుగా రామేశ్వరం చేరుకొని, మళ్ళీ అక్కడనుంచి రామ్నాడ్ వచ్చాము. ఆక్కడినుంచి తిన్నవేలివచ్చి పవిత్రమైన తామ్రపర్ణిలో స్నానంచేశాము. దారిలో అనేకవుణ్యక్షేత్రాలు చూసుకుంటూ అక్కడినుంచి మలబారు చేరుకున్నాము. తిరువాన్కూరు రాష్ట్రంలోని తిరువనంతపురం లేదా అనంతశయనం 1888 మే 12వ తేదిన చేరాము. అక్కడనుంచి జనార్దనం వరకు ప్రయాణంసాగించి అక్కడ మా తండ్రిగారి ఆబ్దీకం నిర్వర్తించాను. అక్కడినుంచి తిరుగుప్రయాణం చేశాము. దురదృష్టంకొద్ది అరమూడి దగ్గర బండిమీదినుంచి ప్రమాదకరంగా నేను పడిపోయినాను. అప్పుడు నేను బండిమీదనే ప్రయాణం చేస్తూవుండేవాడిని. ఈ దురదృష్ట సంఘటనవల్ల మెడ దగ్గర ఎడమవైపు ఎముక విరిగిపోయి తోతాద్రిలో నేను 15 రోజులు కదలకుండా పడివుండవలసి వచ్చింది. ఒక దేశీయ వైద్యుడక్కడ నాకు వైద్యం చేశాడు. అక్కడినుంచి తిరునల్వేలి, మధురలమీదుగా జూన్ 14వ తేదిన తిరుచినాపల్లి చేరుకొన్నాము. తిరుచినాపల్లిలో ఒక నెలరోజులుండిపోయి అక్కడినుంచి బయలుదేరి తిరునవల్లి, కంజీవరంమీదుగా మద్రాసుకు వచ్చాము. అక్కడినుంచి బయలుదేరి 1888 ఆగస్టు 2వ తేదినాడు నెల్లూరు చేరుకున్నాము.

1888 చివరలో నేను మాస్త్రాసుకి వెళ్ళాను. దానికి సున్నంకొట్టించడం ఆవరణలో యాత్రికుల సౌకర్యార్థం చిన్నచిన్న ఇళ్ళుకట్టించడం, నేనేస్వయంగా చూసుకోవలసి రావడంతో అక్కడే వున్నాను. 1889 సెప్టెంబరు నెలకల్లా ఇవి కట్టించడం పూర్తిఅయింది. మా కుటుంబంలో ఆరుగురు సభ్యులు తీవ్రమైన చలి జ్వరాలతో బాధపడ్డాము. నేను మరణిస్తే, నాభార్య మహలక్ష్మి నాఆస్థిఅంతటికీ ఉత్తరాధికారం వహించి నా స్వార్జితం, పిత్రార్జితాల రెంటినీ చూసుకుంటూ నా

కొమారుడూ ఉత్తరాధికారి అయిన వెంకటజోగి గోపాలరావు ఉరఫు ఆదిశేష య్యకు చదువుచెప్పించి పెంచి పెద్దచేయాలి. పిల్లవాడికి యుక్తవయసురాగానే ఆస్తిపాస్తులన్నీ అతడే చూసుకుంటాడు. రాయసం పిచ్చయ్యకుకాని మరింకే ఇతరవ్యక్తికిగాని నా స్థిరచరాస్తులలో దేనినుంచికూడా ఏమీచెందదు.

నా కుమారుడు యుక్తవయసువా డయ్యేవరకు నా భార్య, నా ఆస్తి హక్కుకు కర్త అవుతుంది. నా ఆస్తిపాస్తుల వ్యవహారాలన్నీ ఆమే నిర్వహించు కొంటుందిగాక.

1884 ప్రారంభంలో మేమంతా బంధువులనూ స్నేహితులనూ చూడ టానికి ఒంగోలు వెళ్ళాము. అక్కడినుంచి కనకమ్మ సత్రానికి వెళ్ళాము. మే వరకు అక్కడేవుండి, కుటుంబమూ, పాడిపశువులతోసహా జూన్‌నెలలో కోడూరు శ్రోత్రియం గ్రామానికి వెళ్ళాము. ఆభూములను బాగుచేయించుకోడానికి స్వయంగా అక్కడవుండి చూసుకోవలసి వచ్చింది. ఆపని నిమిత్తమై అక్కడ వుండి పనిప్రారంభించాను. కొత్తచెరువులు త్రవ్వించడం, పాతవాటికి మరామ తులు చేయించడం, తోటలు వేయించడం, కొబ్బరిచెట్లు నాటించడానికి భూమిని దున్నించి సిద్ధంగా చేయడం, ఇంకా రకరకాల పూల, పండ్ల చెట్లను వేయించ డానికి భూమిని బాగుచేయించడంతోపాటు, వేసవిగాడ్పుల కాలంలో ఇక్కడికి వచ్చి గడపటానికిగాను ఒక మిట్టప్రదేశంమీద చిన్న ఇల్లు కట్టడానికికూడా ఒక ప్రదేశాన్ని ఎంచుకున్నాను. ఈప్రాంతం బహుసుందరమైనది. వాతావరణం మిక్కిలి చల్లగాను, అత్యంత ఆరోగ్యప్రదంగాను వున్నది. ఈవిధంగా ఆగస్టు నెలవరకూ ఇక్కడ వున్నాము. అప్పుడిక నెల్లూరుకువెళ్ళి నవంబరువరకు అక్కడవున్నాము. అక్టోబరు నెలలో వచ్చిన దసరాపండుగను ఒకమోస్తరుగా బాగానే జరుపుకున్నాము. శ్రోత్రియ గ్రామానికి తిరిగివచ్చిన తరువాత ప్రిన్సి పల్ కలెక్టర్‌గారైన స్టోక్‌హౌస్‌గారినుంచి కోడూరు పెద్దచెరువుద్వారా నాలుగో వంతు భూములకు నీరుపారే ఏర్పాటుకు శ్రమపడి అనుమతి సంపాదించడంతో అక్కడేవుండి కోడూరు, అళ్వార్‌మంటపం, శ్రోత్రియంగ్రామాల సేద్యాన్ని స్వయంగా చూసుకున్నాను. ఎదలు, కోతలు, నూర్పిళ్లు, అన్నీ పర్యవేక్షించాను.

1886 మార్చిలో మేము శ్రోత్రియం గ్రామంవిడిచి కనకమ్మ సత్రం మీదుగా కందుకూరు వెళ్ళాము, కంచరగుంట, పొట్టేటిపుండు, అనంతసాగరాలలో

కంద్రిగదార్లకు నాకు మధ్యవున్న లావాదేవీలు పరిష్కరించుకోవటానికిగాను ఆ ప్రదేశాలకు వెళ్ళవలసివచ్చింది. ఈచివరి శ్రోత్రియం గ్రామం (అనంతసాగరం) విషయంలో చాలాచిక్కులు ఎదురైనందువల్ల, దీనితో నా సంబంధాలన్నీ వదులుకోవాలనుకొన్నాను. ఈ భూములను నేను ఇదివరలో ఎవరిపేర పెట్టానో, ఎవరికి వ్రాశి ఇచ్చానో, వాళ్ళనే అన్నివ్యవహారాలు పరిష్కరించుకోవలసిందిగా కోరాను. శ్రోత్రియందారులు (బ్రాహ్మణులు) నేనుచేసిన మేలును ఉపకారాన్ని మరిచి కృతఘ్నులై నన్ను నాశనంచేయటానికి తలపడ్డారు. మొదటినుంచీ చివరి వరకు వాళ్ళకు నేనెంతో సాయంచేశాను. కాబట్టి ఇకవాళ్ళు చేసినదానికి తగ్గట్టుగా వాళ్ళతోకాని, వాళ్ళ భూములతోకాని ముందుముందు నాకెటువంటి సంబంధం వుండబోదని స్పష్టపరిచాను. ఇదివరలో ఇందులో నేను వ్రాసియిచ్చిన భాగస్థులైన వారందరికీ వెంటనేవచ్చి మీ భూములను మీరు స్వాధీనం చేసుకోని, నిర్వహించుకోండి అని వర్తమానం పంపాను.

ఏప్రిల్ నెలలో తిరిగి మేము నెల్లూరు చేరాము. దుర్ముఖి చైత్ర బహుళ షష్టి గురువారం అంటే ఆనెల 7వ తేదిన మా పెంపుడుకూతురు ధర్మసంవర్ధని వివాహం జరిపించాను. నా నాలుగోభార్య మహలక్ష్మి సోదరుడైన పెట్లూరు మాలకొండరావు పరుడు. నా జ్ఞాతిసోదరుడు వెంకటకృష్ణయ్య కుమారుడైన వెంకటరాముడి ఉపనయనంకూడా నేనుచేశాను. ఈరెండు శుభకార్యాలకుగాను నాకు 500 రూపాయలదాకా ఖర్చైనవి. ఇక్కడ ఒకవిషయం ప్రస్తావించటం ఉచితమనుకుంటాను. నా ఉద్దేశమూ, నా మూడోభార్య కనక ఉద్దేశమూ మా బిడ్డను తన (కనక) సోదరుడు పిచ్చయ్యకిచ్చి పెళ్ళిజేదామనే. అయితే తరవాత తరవాత అతడి ప్రవర్తనవల్ల, ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోనని అతడు మొండికెత్తడంవల్ల ఈవిధంగా మాలకొండరావుకు నాకూతురునిచ్చి పెళ్ళి చేయవలసివచ్చింది. అయితే పిచ్చయ్య పెండ్లిజరిగిన తరవాతనే-చిత్తూరులో అతనికి వేరే వాళ్లు పిల్లనిచ్చారు-నేను నాబిడ్డ పెళ్ళిచేశాను. ప్రొవిన్షియల్ కోర్టులో కొద్దినెలల క్రిందటే పిచ్చయ్య రైటరుపనిలో చేరాడు. నేను కొన్ని సంవత్సరాలక్రితం అతడికి ఏదైనా ఉద్యోగం చూపించవలసిందిగా సిఫార్సుచేసి ఉండటంతో, జార్జి కనమేజర్‌గారి ప్రాపకంతో అండదండలతో అతడికా ఉద్యోగం వచ్చింది.

ఈ శుభకార్యాలు జరిపించిన కొద్దిరోజులకు నేను కోడూరు శ్రోత్రియానికి వెళ్ళి, అక్కడ కొన్నిరోజులున్నాను. చెరువుల మరామత్తులు, అప్పుడప్పుడు వచ్చివుండేందుకుగాను ఇల్లు కట్టిస్తూనూ.

1886 సెప్టెంబరులో నేను తిరిగి నెల్లూరు వచ్చినతరవాత నాకు ప్రాణం పోవలసినంత జబ్బుచేసింది. అక్టోబరులో ఒకరోజు నాఆశ పూర్తిగా వదులు కున్నారు. ఒకరాత్రి కొన్ని గంటలసేపు ప్రాణంపోయిందనే అనుకున్నారు. కాని ఎట్లానో ఆ భయంకర పరిస్థితినుంచి తేరుకున్నాను.

ఆ తరవాత వచ్చిన జనవరిలో సకుటుంబంగా నేను స్నేహితులను బంధువులను అందరినీ చూసిరావాలసి, ఉత్తర జిల్లాలకు బయలుదేరాను. ఫిబ్రవరినెల మొత్తం ఒంగోలులోను గుంటూరులోను గడిపాను. 1887 మార్చిలో కొన్ని రోజులు శివరాత్రి పర్వదినసందర్భంగా అమరావతిలోను, తక్కినరోజులు మచిలీపట్నంలోను గడిపాను. ఏప్రిల్‌లో రాజమండ్రికివెళ్ళి కొచ్చెర్లకోట వెంకటరావు కుటుంబాన్ని చూసేందుకు వాడపల్లి, ఆచంటలకు పోయినాము. అక్కడినుంచి విశాఖపట్నంవెళ్ళి మా విద్వాంసులు బలిజేపల్లి పార్వతీశ్వర శాస్త్రులవారింట్లో మకాం చేశాము. అక్కడొక నెలరోజులు గడిపి, జూలై మొదట్లోనే నెల్లూరుకు తిరుగుప్రయాణం ప్రారంభించాను. రాజమండ్రిలో తిరుగు ప్రయాణంలో కొన్నాళ్లు వుండిపోవలసివచ్చింది. అప్పుడు గోదావరి పుష్కరం వచ్చింది. పన్నెండురోజులూ పుష్కర స్నానాలకోసం అక్కడ వుండిపోవలసి వచ్చింది. తరవాత మొగలితుర్రుమీదుగా మచిలీపట్నం చేరుకున్నాము. పది రోజులపాటు బి. బాలకృష్ణశాస్త్రిగారింట వుండిపోయినాము. అక్కడినుంచి ఆగస్టులో బయలుదేరి బాపట్ల, ఒంగోలు, పొందూరు, మాసత్రం మీదుగా ప్రయాణంచేసి, క్షేమంగా 1887 ఆగస్టు 15 తేదిన నెల్లూరు చేరుకున్నాము.

అత్యంతఖేదంతో నా నాలుగోభార్య సోదరుడు, మాధర్మసంవర్ధని భర్త పెట్లూరి మాలకొండయ్య మృతినిగూర్చి చెప్పవలసి వస్తున్నది. విలంబినామ సంవత్సర చైత్రబహుళ షష్టికి సరిఅయిన 1888 ఏప్రిల్ 15వ తేది ఆదివారం ఇది సంభవించింది. అతడు క్షయవ్యాధితో మరణించాడు. అనూహ్యమైన ఈ దుర్వార్త నన్నెంత కృంగతీసిందో చెప్పలేను. కొన్ని నెలలపాటు నేను మంచం పట్టాను.

నెల్లూరులో మాఇల్లు శిధిలమైపోయెదశకు చేరుతుండగా 1888 మధ్యలో దానిని బాగుచేయించక తప్పలేదు. వెయ్యిరూపాయలకు పైగానే దీనికిగాను నాకు ఖర్చయింది.

1888 నవంబరు 20వ తేదిన కుటుంబ సమేతంగాను, కొందరు మిత్రుల తోను నెల్లూరునుంచి బయలుదేరి మూడురోజులలో మాసత్రం చేరుకున్నాము. మునసాఫిర్ ఖానాలు, అంబే ఆవరణగృహాలు, బాగుచేయించవలసి వచ్చింది. కొన్ని నెలలక్రితం కురిసిన విపరీత వర్షాలవల్ల ఇవి కూలిపోయినవి. మట్టిగోడలతో వీటిని కట్టడం జరిగింది. ఇటుకలు, పెంకులుకూడా చేయించవలసి రావడంతో ఇక్కడ నేను కొన్నినెలలు వుండిపోవలసి వచ్చింది.

1889 జనవరిలో నేను చాలా నీరసపడిపోయినాను. నిస్సత్తువతో నడవనుకూడా నడవలేకపోయినాను. ఫిబ్రవరి మాసాంతానికి జవసత్వాలు పూర్తిగా క్షీణించడమూ, చాలా ప్రమాదకరవ్యాధికి నేనుగురికావడమూ తెలుసుకున్నాను. తీవ్రమైన ఇతర రోగచిహ్నాలతో కూడిన అత్యంత ప్రమాదకరమైన నంజువ్యాధి అది. ఇతర రోగచిహ్నాలు-మొదటిది శ్వాస ఆడకపోవడం, రెండోది మూత్రకోశంలో నొప్పి, ఇక మూడోది, చివరిది శరీరం అంతటిపైనా వాపు. ఈచిహ్నాలన్నీ మాకుటుంబంలో చాలా ఆందోళన కలిగించాయి. అందువల్ల గాలిమార్పుకు ఇంకోచోటుకు పోవడమూ, ఔషధసేవన ప్రయత్నమూ, అనివార్యంగా వెంటనే చూడవలసివచ్చింది. అందువల్ల మాసత్రం వదిలిపెట్టి ఆక్కడికి పదిమైళ్ళ దూరంలోవున్న గుడ్లూరుకు చేరుకున్నాను. అక్కడ ఒక నెలరోజులున్నాము. ఇక్కడవున్న ఈ రోజులలో సదర్ అదాలత్ కోర్టువారికి ఒకలేఖ వ్రాశాను. ధర్మప్రభువులైన ఇంగ్లీషు ప్రభుత్వంవారు దేశీయోద్యోగులందరికీ వారు ఇది వరలో చెల్లించిన నేటివ్ ఫండ్‌ను మొత్తం తిరిగి చెల్లించివేస్తున్నారన్న విషయం విని నేనీ లేఖవ్రాశాను. జీతంలోని ప్రతివరహాకు ఒక పణం చొప్పున 1808 జూన్‌నుంచి 1822 ఏప్రిల్ వరకు వారుచెల్లించే వుద్దేశంతో వున్నారన్నవిషయం నాకు తెలియవచ్చింది. ఇది దరఖాస్తురూపంలో సమర్పించుకున్నాను. దానినకలు ఈక్రింది విధంగావుంది.

సదర్ అదాలత్‌కోర్టు రిజిస్ట్రార్‌కు-

కోర్టువారి ఇడివరకటి ట్రాన్స్‌లేటరైన వెన్నెలకంటి సుబ్బారావు వినయపూర్వక విజ్ఞాపనము.

అత్యంత వినయంగా తమకు కనపరచేది ఏమంటే మీ యీ అర్జీదారుడు ప్రాధేయపూర్వకంగా అతనితాలూకు నేటివ్ పెన్షన్ సబ్‌స్క్రిప్షన్ మొత్తం 546-1-1 అతనికి రిఫండ్‌గా రావలసి వుంటుందని మనవి చేసుకుంటున్నాడు.

1831 మార్చి 1వ తేది ఫోర్ట్ సెయింట్‌జార్జి గజటు ప్రకటన మేరకు నెల్లూరు ప్రిన్సిపల్ కలెక్టరుగారి ట్రెజరీనుంచి ఎకౌంటెంటుజనరలుద్వారా ఒక బిల్లురూపంగా అతడికి చేరేట్లు ఏర్పాటు చేయగలరు. మీ అర్జీదారుడు ఆ జిల్లాలోనే నివసిస్తున్నాడు కనక ఈవిధంగా చేయగలరు.

పైన చెప్పిన బిల్లును మీ అర్జీదారుడు రామాయపట్నం దగ్గర కనకమ్మ సత్రంలో వుంటున్నాడు, కనక ఆ చిరునామాకు పంపించగలరు. ఈ మీ అర్జీదారుడు విధిగా మిమ్మల్ని ఎప్పుడూ ప్రార్థిస్తూవున్నాడు.

రామాయపట్నందగ్గర కనకమ్మ సత్రం
1839 మార్చి 16. (సం.) వి. సుబ్బారావు

నేను పెట్టుకొన్న ఈ పిటిషన్‌కు 1839 మే 2వ తేది గల ఈ లేఖ సమాధానంగా నాకందింది.

సదర్ అదాలత్

సదర్ అదాలత్‌కోర్టు పూర్వపు ట్రాన్సలేటర్ వెన్నెలకంటి సుబ్బారావుకు-
మీరు పంపించిన 16వ తేదీగల విజ్ఞాపనకు సమాధానంగా సదర్ అదాలత్‌కోర్టు న్యాయమూర్తులు మీ కీ విధంగా తెలియజేయమని నన్ను ఆదేశించినారు. ఈబిల్లు ప్రిన్సిపల్ కలెక్టర్ నెల్లూరిగారినుంచి మీకు చెల్లించేటట్లు 545-1-1, మీరు నేటివ్‌పెన్షన్ ఫండ్‌కు చెల్లించిన మొత్తం మీకు తిరిగి ఇచ్చేట్లు ఇది పంపించబడుతున్నది. ఫోర్ట్ సెయింట్‌జార్జి గజట్‌లోని ప్రకటనమేరకు ఎకౌంటెంటు జనరల్ ఫీజు 1 రూపాయను మినహాయించుకొని తక్కిన మొత్తానికి మీకు బిల్లు పంపుతున్నాము. గ్రహించకోరెదము.

ఇదేవిధంగా వెంటనే ఈబిల్లు అందినట్లు తెలియజేయవలసిందని ప్రార్థన. ఈవిధంగా మీకు తెలియజేయవలసిందిగా నేను ఆదేశింపబడినాను.

సదర్ అదాలత్ కోర్టువారి ఉత్తర్వుల మేరకు

(సం.) టి. హెచ్. డేవిడ్‌సన్
ఏక్టింగ్ రిజిస్ట్రార్
29 ఏప్రిల్ 1839

గుడ్లూరులో ఒక నెలవుండి, అక్కడ ఏమీ ప్రయోజనం లేకపోగా, ఇంకా వ్యాధి ముదిరిపోతున్నందువల్ల సత్తువ మరీ మరీ క్షీణిస్తున్నందువల్ల మా సత్రానికి దాపుగావున్న భీమవరం అనే గ్రామానికి వచ్చిచేరినాము. అక్కడి దేశీయ వైద్యుడిచ్చిన మందుకూడా నాకేమాత్రమూ పనిచేయక పోవడంతో మా సత్రానికి తిరిగిరావడానికి తొందరచేసి వచ్చి అక్కడ చేరాము.

1839 వ సంవత్సరమే, మే, జూన్, జూలై, ఆగస్టు నెలలలో చాలా మంది దేశీయ వైద్యులద్వారా వైద్యం చేయించుకున్నాను. కాని ప్రయోజనం మాత్రం కనపడలేదు.

మా అబ్బాయి వెంకటజోగి గోపాలరావుకు తొమ్మిదోవీడు రావడంతో, అతని ఉపనయనం చేయకుండా, ఆలస్యం చేయడం ఎంతమాత్రమూ ఉచితం కాదని నాకుతోచింది. అందువల్ల మా సత్రంలోనే ఆగస్టు 19, 1839 నాడు అంటే వికారి సంవత్సర శ్రావణశుద్ధ దశమి సోమవారంనాడు, ఉపనయనం జరిపాను. ఈ ఉపనయనం జరగడానికి నాకు అట్టే ఖర్చుకాలేదు (సుమారుగా నూటాయాభై రూపాయలు మాత్రమే ఖర్చయినాయి).

—★—

నాతండ్రి, ఈ పుస్తకరచయిత సుబ్బారావుగారు వికారినామ సంవత్సర భాద్రపద బహుళ నవమికి సరిఅయిన 1839 అక్టోబరు 1వ తేది ఉదయం 10 గంటలకు ఇహలోకయాత్ర చాలించారు.

—వి. గోపాలరావు

వెన్నెలకంటి సుబ్బారావు పంతులుగారు మరణించడానికి కొన్నిరోజుల పూర్వం సన్యాసాశ్రమ స్వీకారం చేశారని, అందువల్ల వారు తనువుచాలించిన తర్వాత కనకమ్మ సత్రంప్రక్కనే వారిని సమాధి చేశారని, బహుకాలం

ప్రజలు ఈ సత్రమూ, సమాధులపట్ల భక్తిశ్రద్ధలూ, గౌరవాదరాలూ కనపరుస్తూ వచ్చారని శ్రీ ఓంగోలు వెంకటరంగయ్యపంతులుగారు, సుబ్బారావుగారి జీవిత యాత్రా చరిత్రకు వ్రాసుకొన్న నోట్సుద్వారా తెలియవస్తున్నది.

—అనువాదకుడు

THE PEDIGREE OR GENEALOGICAL TABLE OF
The Male Descendants of Vennelcunty Vencata Kistnamah for three generations

